www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

బుధవారం | 26-6-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) :22 సంచిక (Issue) : 88 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం; తిథి: పంచమి రా. 8.55 తదుపరి షష్ఠి; నక్షత్రం: ధనిష్ఠ మ. 1.05 తదుపరి శతభిషం వర్జ్యం: రా. 7.50-9.20; దుర్ముహూర్తం: ఉ. 11.51-12.44; అమృతఘడియలు: తె. 4.51 మొదలు; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 5.46, సూర్యాస్తమయం: 6.49 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem |Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

సన్నాల జాబితా సిద్ధం

బోనస్ ఇవ్వబోయే వరి విత్తనాలు ఖరారు
రైతులు పండించే రకాల నుంచే ఎంపిక
40 పబ్లిక్ వెరైటీలు, మరికొన్ని ప్రైవేటువి..
రాష్ట్ర ప్రభుత్వ నిపుణుల కమిటీ నిర్ణయం
రైతుల్లో సందిగ్ధం తొలగేలా నేడు ప్రకటన
బోనస్‌తో అన్నదాతకు రూ.2,800 వరకు లబ్ధి

9





అంతరిక్షంలోనే సునీత

బోయింగ్ వ్యోమనౌకలో హీలియం లీకు.. సరిదిద్దే పనిలో నాసా
ఇద్దరు వ్యోమగాముల తిరుగు ప్రయాణం మరోసారి వాయిదా
సునీతతోపాటు విల్‌మోర్ కూడా ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్‌లోనే
2018 నుంచి పదే పదే ప్రమాదాలతో బోయింగ్‌పై విమర్శలు
ఇప్పుడు వ్యోమనౌకలోనూ లోపాలతో రోదసిలో ఇక్కట్లు!

2



స్పీకర్ పదవికి ఎన్నిక

లోక్‌సభ చరిత్రలో నాలుగోసారి.. ఎన్డీఏ నుంచి మళ్లీ ఓం బిర్లా
కేరళ ఎంపీ కె. సురేశ్‌ను నిలిపిన ప్రతిపక్షం.. నేడు ఓటింగ్
గడువుకు కొద్ది నిమిషాల ముందు నామినేషన్ల దాఖలు
స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవానికి కేంద్ర మంత్రుల రాయబారం విఫలం
'డిప్యూటీ స్పీకర్' ఇవ్వాలని విపక్షం పట్టు.. అంగీకరించని ఎన్డీఏ
ఎన్డీఏ మిత్రపక్షానికి ఉప సభాపతి పదవి?



2

విపక్ష నేత రాహుల్

ప్రొటెం స్పీకర్‌కు సోనియా లేఖ.. ఆమోదం



లోక్‌సభలో మంగళవారం రాజ్యాంగ ప్రతితో ఎంపీగా ప్రమాణ స్వీకారం చేస్తున్న రాహుల్‌గాంధీ

పదేళ్ల తర్వాత.. లోక్‌సభలో ప్రతిపక్ష నేత
16 రోజుల యోచన తర్వాత రాహుల్ ఓకే
విపక్ష నేతకు కీలక పార్లమెంటరీ అధికారాలు
ఎన్నికల కమిషనర్లు, సమాచార కమిషన్..
సీబీఐ, విజిలెన్స్ చీఫ్ నియామకాల్లో పాత్ర

న్యూఢిల్లీ, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభలో విపక్ష నేతగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నియమితులయ్యారు. దశాబ్ద కాలం తర్వాత మళ్లీ లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా దక్కింది. మోదీని దీటుగా ఎదుర్కొనేది రాహుల్ ఒక్కడే ననే అభిప్రాయంతో ఈ నెల 9న జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) సమావేశం కూడా విపక్ష నేత విషయంలో ఏకగ్రీవంగా తీర్మానించిన విషయం తెలిసిందే..! అయితే.. రాహుల్ మాత్రం తాను ఇంకా ఆలోచించుకోవాల్సి ఉందని అప్పట్లో వ్యాఖ్యానించారు. బుధవారం జరగనున్న లోక్‌సభ స్పీకర్ ఎన్నిక విషయంలోనూ.. ప్రతిపక్షాలకు డిప్యూటీ స్పీకర్ పదవిని కేటాయించాలనే సంప్రదాయం అంశంలోనూ మోదీని

మిగతా 2వ పేజీలో...

తెలంగాణ నుంచి మరిన్ని సీట్లు ఆశించాం!

సీఎం రేవంత్ వద్ద సోనియా వ్యాఖ్య!
ఎంపీల ప్రమాణ స్వీకారం వేదికగా..
ప్రియాంక, సోనియాతో రేవంత్ చర్చలు
ప్రమాణ స్వీకారానికి హాజరైన నేతలు
నేడు ఢిల్లీకి భట్టి, ఉత్తమ్‌కుమార్
మంత్రివర్గ విస్తరణ, చేరికలపై చర్చ



ఢిల్లీలో సోనియాతో మాట్లాడుతున్న రేవంత్, చిత్రంలో ప్రియాంక



ఢిల్లీలో మహిపాల్‌రెడ్డి

హఠాత్తుగా ప్రత్యక్షమైన ఎమ్మెల్యే

కేసీఆర్‌తో సమావేశానికి డుమ్మా
ఆయన పార్టీ మారుతున్నారని ప్రచారం
కోర్టు పనిమీదే ఢిల్లీకి అంటూ వివరణ

పటాన్‌చెరు, జూన్ 25: పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారుతున్నారన్న ప్రచారం నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మంగళవారం పార్టీ అధినేత కేసీఆర్ నిర్వహించిన సమావేశానికి డుమ్మా కొట్టారు. ఆయన హఠాత్తుగా ఢిల్లీలో ప్రత్యక్ష్యం కావడం కలకలం రేపింది. పార్టీ ఫిరాయించే అవకాశం ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో ముందునుంచీ ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పేరు వినిపిస్తున్న నేపథ్యంలో తాజాగా జరుగుతున్న పరిణామాలు చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల మహిపాల్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల ఇళ్లలో సోదాలు చేసిన ఈడీ.. సుమారు 300 కోట్ల అక్రమ నగదు లావాదేవీలపై దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొనడంతో రాజకీయ దుమారం రేగింది. మరోపక్క బీఆర్ఎస్ నుంచి ఎవరూ చేజారకుండా అధినేత కేసీఆర్ మంగళవారం పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గైర్హాజరయిన మహిపాల్ రెడ్డి ఢిల్లీలో ప్రత్యక్షం కావడంతో ఆయన పార్టీ మారుతున్నారన్న ప్రచారం పెద్ద ఎత్తున జరిగింది. అయితే.. తాను ఏ నాయకుడిని

మిగతా 13వ పేజీలో...

'ఎమర్జెన్సీ' మైండ్‌సెట్
ఇంకా పోలేదు

ఆ చీకటి రోజుల్లో దేశాన్నే జైలుగా మార్చారు



వెంకయ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రధాని మోదీ

356 అధికరణను ఎడాపెడా ప్రయోగించారు
రాజ్యాంగాన్ని అణచివేశారు.. స్వేచ్ఛ హరించారు
అలాంటివారు రాజ్యాంగంపై ప్రేమ ప్రకటిస్తారా?
కాంగ్రెస్ పార్టీపై ప్రధాని మోదీ ధ్వజం
వైఫల్యాల్ని కప్పిపుచ్చేందుకే గతం తవ్వుతున్నారు
మాట్లాడేదానికి భిన్నంగా వ్యవహరిస్తుంటారు
ఏ అంశంలోనూ ఏకాభిప్రాయం తీసుకోలేదు
తిప్పికొట్టిన ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే

వెంకయ్య ఇంటికి మోదీ

పలు అంశాలపై ఇద్దరు నేతల చర్చలు
దేశ ప్రగతిపై వెంకయ్య వివేకం భేష్: ప్రధాని

న్యూఢిల్లీ, జూన్ 25: దేశంలో ఎమర్జెన్సీ విధించినవారికి రాజ్యాంగంపై ప్రేమ ఉందని ప్రకటించే హక్కు లేదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. కాంగ్రెస్‌కు ఇప్పటికీ ఆ మైండ్‌సెట్ పోలేదని ధ్వజమెత్తారు. 1975లో జూన్ 25న ఇందిరాగాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అత్యవసర పరిస్థితి విధించిందని ఆయన మంగళవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఆ చీకటి రోజుల్లో దేశాన్నే జైలుగా మార్చారని.. రాజ్యాంగాన్ని అణచివేశారని.. ప్రాథమిక స్వేచ్ఛ లేకుండా చేశారని గుర్తుచేశారు. ఎన్నికైన ప్రభుత్వాలను రద్దుచేసే 356 అధికరణను ఎడాపెడా ప్రయోగించారని.. పత్రికాస్వేచ్ఛను నాశనం చేయడానికి బిల్లు తెచ్చారని.. సమాఖ్య విధానాన్ని నాశనం చేశారని.. రాజ్యాంగాన్ని ప్రతి దశలో ఉల్లంఘించారని దుయ్యబట్టారు. రాజ్యాంగంపై అమితప్రేమ ఉందని పైకి చెబుతూ.. దానిపై ఉన్న ఏహ్య భావాన్ని నిజానికి దాచుకున్నారని ఆరోపించారు. ప్రజలు వారి

మిగతా 2వ పేజీలో...

జై సమ్మక్క.. జై భద్రకాళి

3

జై తుల్జాభవానీ.. జై యాదగిరి లక్ష్మీనరసింహస్వామి
ప్రమాణ స్వీకారాల్లో తెలంగాణ ఎంపీల నినాదాలు
ఒవైసీ 'జై పాలస్తీనా' నినాదం.. రికార్డుల నుంచి తొలగింపు
తెలుగులో ప్రమాణం చేసిన తమిళ ఎంపీ కె. గోపీనాథ్



కాంగ్రెస్‌లో జీవన్‌రెడ్డి తుపాను!

ఎమ్మెల్సీకి రాజీనామా చేయడానికి సిద్ధం
మండలి చైర్మన్ లేకపోవడంతో వాయిదా
జీవన్‌తో మాట్లాడాల్సిందిగా
భట్టికి సూచించిన అధిష్ఠానం, సీఎం
గంటకుపైగా భట్టి, దుద్దిళ్ల మంతనాలు
హామీ లేనందున.. అలకవీడని జీవన్‌రెడ్డి
ఫోన్‌లో మాట్లాడిన దీపాదాస్ మున్షీ
నేడో రేపో అధిష్ఠానంతో భేటీ

12

కేజ్రీ బెయిల్‌పై స్టే

ట్రయల్ కోర్టు తీరు అనాలోచితం..
విచారణలో ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్యలు
జైల్లోనే కేజ్రీని అరెస్ట్ చేసిన సీబీఐ

2

ఎప్‌సెట్ కౌన్సెలింగ్ తేదీల మార్పు!

27న నిర్వహించాల్సి ఉండగా
వచ్చే నెల 4కు వాయిదా
మూడు దశల్లో కౌన్సెలింగ్..
ఆగస్టు దాకా నిర్వహణ

14

తొందర పడొద్దు

నా దగ్గర ప్లాన్ ఉంది.. కొన్ని రోజుల్లో కీలక పరిణామాలు

నెల కూడా పట్టదు.. ధైర్యంగా ఉండండి
ఏ ఇబ్బంది కలిగినా.. నేరుగా నా వద్దకు రండి
మీకు ఎటువంటి నష్టం జరగనివ్వను
బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో అధినేత కేసీఆర్
పార్టీ ఎమ్మెల్యేలు, నేతలతో ఫాంహౌస్‌లో భేటీ

రైల్ రోకో కేసుపై హైకోర్టు స్టే

కేసీఆర్ హాజరు పట్లనట్లు కనిపించడం లేదని వ్యాఖ్య
విద్యుత్తు కమిషన్ చెల్లదు.. నోటీసుల్ని కొట్టేయండి
హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన మాజీ సీఎం

విచారణకు రండి!

కేసీఆర్‌కు జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ నోటీసు
వారంలో వాస్తవాలను వివరించాలని శ్రీముఖం



హైదరాబాద్/మర్కుక్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొందరు కాంగ్రెస్‌లో చేరడం, మరికొందరు అదేబాటలో ఉన్నట్లు ప్రచారం జరుగుతుండడంతో ఆ పార్టీ అధినేత కేసీఆర్ రంగంలోకి దిగారు. ఫిరాయింపులకు కళ్లెం వేసేందుకుగాను ఎమ్మెల్యేలను బుజ్జగించే పనిలో పడ్డారు. ఈ మేరకు మంగళవారం పలువురు ఎమ్మెల్యేలను సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని తన ఫాంహౌస్‌కు పిలిపించుకొని

మిగతా 13వ పేజీలో...

మూడు బాక్సుల్లో ఆధారాలు!




ట్యాపింగ్ కేసులో సీడీలు, పెన్‌డ్రైవ్ సమర్పణ
మరోసారి చార్జిషీట్.. వివరాల గోప్యతకు మెమో
భుజంగరావు, తిరుపతన్న
బెయిల్ పిటిషన్లపై విచారణ నేటికి వాయిదా
బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించిన ప్రణీత్‌రావు
ప్రభాకర్‌రావు కోరిన సమయం నేటితో పూర్తి!

హైదరాబాద్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తు అధికారులు మంగళవారం కోర్టుకు కీలక ఆధారాలను సమర్పించారు. మొత్తం మూడు బాక్సుల్లో ఆధారాలను అందజేస్తూ.. మరోమారు చార్జిషీట్ దాఖలు చేశారు. దర్యాప్తు అధికారి, ఏసీపీ వెంకటగిరి కోర్టుకు సమర్పించిన ఆధారాల్లో సీడీలు, పెన్‌డ్రైవ్‌లు, ధ్వంసం చేసిన హార్డ్‌డిస్కుల శకలాలు, ఇతర సాంకేతిక ఆధారాలు ఉన్నాయి. గత వారం పోలీసులు సమర్పించిన చార్జిషీట్‌ను కోర్టు తిరస్కరించిన విషయం తెలిసిందే..! దీంతో అధికారులు న్యాయనిపుణుల సలహాతో పకడ్బందీగా అభియోగ పత్రాలను రూపొందించి, కోర్టుకు అందజేశారు. అత్యంత సున్నితమైన కేసు కావడంతో.. చార్జిషీట్‌తోపాటు.. తాము అందజేసిన ఆధారాల వివరాలను బహిర్గతం కాకుండా చూడాలంటూ కోర్టులో మెమో దాఖలు చేశారు. నిందితులెవరికీ ఈ ఆధారాలను అందజేయకూడదని

మిగతా 3వ పేజీలో...

'ఎమర్జెన్సీ' మైండ్‌సెట్ ఇంకా పోలేదు

(మొదటి పేజీ తరువాయి)



అసంగత చర్యలను గ్రహించే పదే పదే ఓడిస్తున్నారని వ్యాఖ్యానించారు. అధికారంలో కొనసాగేందుకు ప్రజాస్వామిక సూత్రాలన్నీ తుంగలో తొక్కారని, కాంగ్రె‌స్‌ను వ్యతిరేకించే ప్రతి వ్యక్తినీ చిత్రహింసల పాల్జేశారని విమర్శించారు. నాడు ఎమర్జెన్సీని తీవ్రంగా వ్యతిరేకించినవారికి ఇది నివాళులు అర్పించాల్సిన రోజుగా పేర్కొన్నారు. ఓ కుటుంబాన్ని అధికారంలో ఉంచడం కోసం కాంగ్రెస్ చాలా సార్లు రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసిందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ధ్వజమెత్తారు. కాంగ్రెస్ మైండ్‌సెట్‌లో ప్రజాస్వామ్యానికి తావే ఉండదని బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా అన్నారు. లోక్‌సభ స్పీకర్ ఎన్నిక విషయంలో విపక్షాలు కపటంతో, రెండు నాల్కల ధోరణితో వ్యవహరిస్తున్నాయని ధ్వజమెత్తారు.

వెంకయ్య ఇంటికి మోదీ

న్యూఢిల్లీ, జూన్ 25(ఆంధ్రజ్యోతి): మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడితో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. మంగళవారం ఢిల్లీలోని వెంకయ్య నాయుడి నివాసానికి వెళ్లిన ఆయన కొద్దిసేపు అక్కడే గడిపారు. ఈ సందర్భంగా దేశ ప్రయోజనాలకు సంబంధించిన పలు అంశాలపై ఇరువురూ తమ అభిప్రాయాలను పంచుకున్నారు. భారతదేశ పురోగతి పట్ల వెంకయ్యనాయుడు వివేకం ఎప్పుడూ ప్రశంసనీయమే నని మోదీ ఈ సందర్భంగా కొనియాడారు. కాగా, మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మోదీకి వెంకయ్య అభినందనలు తెలిపారు.

వైఫల్యాలను దాచేందుకే

ప్రధాని మోదీ తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే గతాన్ని తవ్వితీస్తుంటారని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. నిజానికి గత పదేళ్లుగా ఆయన అప్రకటిత ఎమర్జెన్సీని అమలుచేస్తున్నారని 'ఎక్స్'లో ఆరోపించారు. ఆయన తరచూ ఏకాభిప్రాయం, సహకారం గురించి మాట్లాడతారని... తద్విరుద్ధంగా వ్యవహరిస్తుంటారని విమర్శించారు. 'పార్టీలను చీల్చడం.. ఎన్నికైన ప్రభుత్వాలను దొడ్డిదోవన పడగొట్టడం, 95 శాతం మంది ప్రతిపక్ష నాయకులపైకి ఈడీ, సీబీఐ, ఐటీ వంటి సంస్థలను ఉసిగొల్పడం.. సీఎంలను జైల్లో పెట్టడం.. ఎన్నికలకు ముందు అధికార యంత్రాంగాన్ని వాడుకోవడం.. ఇవన్నీ అప్రకటిత ఎమర్జెన్సీ కాదా? 146 మంది విపక్ష ఎంపీలను సస్పెండ్ చేసినప్పుడు.. మూడు కొత్త క్రిమినల్ చట్టాలను తెచ్చినప్పుడు.. వివాదాస్పద వ్యవసాయ చట్టాలను తెచ్చినప్పుడు.. నోట్ల రద్దు, లాక్‌డౌన్, ఎలక్టొరల్ బాండ్ల చట్టం తెచ్చినప్పుడు మీరు చెప్తున్న ఏకాభిప్రాయం ఎక్కడుంది' అని ఖర్గే ప్రధానిపై ధ్వజమెత్తారు.

రామమందిర పైకప్పులో లీకేజీ లేదు: నృపేంద్ర

అయోధ్య, జూన్ 25: అయోధ్యలోని రామమందిరం పైకప్పు నుంచి ఎలాంటి వర్షం నీరు లీకేజీ కావడం లేదని మందిర నిర్మాణ కమిటీ ఛైర్మన్ నృపేంద్ర మిశ్ర స్పష్టం చేశారు. అయితే పైకప్పులో కరెంటు వైర్ల కోసం ఏర్పాటు చేసిన పైపుల నుంచి వచ్చిన వర్షం నీరు గర్భగుడిలో పడిందని తెలిపారు. వర్షం నీరు గర్భగుడిలోనే పడుతోందంటూ ప్రధాన అర్చకుడు ఆచార్య సత్యేంద్ర దాస్ చెప్పిన నేపథ్యంలో మంగళవారం మిశ్ర ఈ వివరణ ఇచ్చారు. ఆలయాన్ని తానే స్వయంగా తనిఖీ చేశానని, ఎక్కడా లీకేజీలు లేవని చెప్పారు. ప్రస్తుతం రెండో అంతస్తు నిర్మాణం జరుగుతోందని, అది పూర్తయితే గర్భగుడిలోకి అసలు వర్షం నీరే వచ్చే అవకాశమే ఉండదని స్పష్టం చేశారు. వచ్చే నెల నాటికి మొదటి అంతస్తులోని పనులన్నీ పూర్తవుతాయని తెలిపారు. డిసెంబరు నాటికి మొత్తం ఆలయ నిర్మాణం పూర్తవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కర్ణాటకలో కబాబ్ కృత్రిమ రంగులపై నిషేధం

బెంగళూరు, జూన్ 25(ఆంధ్రజ్యోతి): కృత్రిమ రంగుల వాడకం వల్ల క్యాన్సర్, బీపీ, మధుమేహం వంటి జబ్బులు ప్రబలే ప్రమాదం ఉందని పరిశోధనల్లో తేలిన నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వం చేప, చికెన్ కబాబ్‌ల తయారీలో కృత్రిమరంగుల వాడకాన్ని నిషేధించింది. ఈ మేరకు ఆహారభద్రతా విభాగం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. కొన్ని నెలల కిందట గోబీ మంచూరియా, కాటన్‌క్యాండీ తయారీలో కృత్రిమ రంగుల వినియోగాన్ని నిషేధించారు. కబాబ్‌లకూ ఇటువంటి రంగులు వాడుతున్నారని ఇటీవల ఫిర్యాదులు అందడంతో ఆరోగ్యశాఖ పరీక్షలు నిర్వహించింది. ఇకపై కృత్రిమరంగులు వాడితే ఆహారభద్రతా చట్టం కింద ఏడేళ్ల జైలుశిక్షతోపాటు రూ.10 లక్షల జరిమానా విధిస్తామని అధికారులు హెచ్చరించారు.

'కర్ణాటకలో విదేశీ పెట్టుబడులకు మోదీ అడ్డంకి'

బెంగళూరు, జూన్ 25(ఆంధ్రజ్యోతి): కర్ణాటకకు విదేశీ పెట్టుబడుల ఆకర్షణకు ప్రధాని మోదీ అడ్డంకిగా మారారని ఐటీ, బీటీశాఖల మంత్రి ప్రియాంక ఖర్గే ఆరోపించారు. ఐటీ, బీటీ శాఖల ఉన్నతస్థాయి బృందం పెట్టుబడుల ఆకర్షణ కోసం అమెరికా, బ్రిటన్ దేశాల్లో పర్యటనకు సంబంధించి మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తాము ఆహ్వానించే పెట్టుబడిదారులను గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలని మోదీ ఒత్తిడి తెస్తున్నారని, అక్కడికే తీసుకెళ్తున్నారని మంత్రి ఆరోపించారు. ప్రధాని మోదీ, పీఎంవో అధికారులు పెట్టుబడిదారులను సంప్రదించి వారిపై ఒత్తిడి తెస్తున్నారని అన్నారు. తెలంగాణకు వచ్చిన పెట్టుబడిదారులపై కూడా ఒత్తిడి చేసిన ఉదాహరణలు ఉన్నాయని తెలిపారు.

పుణె కేసులో బాలుణ్ని విడుదల చేయండి

ముంబై, జూన్ 25: దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన పుణె పోర్షే కారు ప్రమాదం కేసులో బాంబే హైకోర్టు తీర్పు వెలువరించింది. నిందితుడైన 17 ఏళ్ల కుర్రవాడిని జువెనైల్ హోం నుంచి వెంటనే విడుదల చేయాలని మంగళవారం ఆదేశించింది. అతడి మేనత్త దాఖలు చేసిన పిటిషన్‌పై విచారించిన కోర్టు.. నిందితుడిని రిమాండ్‌కు పంపుతూ జువైనల్ జస్టిస్ బోర్డు (జేజేబీ) ఇచ్చిన ఆదేశాలను కొట్టివేసింది. ఈ ప్రమాదంపై ప్రజల ఆగ్రహం మధ్య, తక్షణం స్పందించాలన్న తొందరపాటులో నిందితుడి వయసును జేజేబీ పరిగణనలోకి తీసుకోలేదని కోర్టు పేర్కొంది. 'ఇది ఎలాంటి రిమాండ్? ఏ అధికారంతో నిందితుడికి మళ్లీ రిమాండ్ విధించారు. ఓ వ్యక్తికి తొలుత బెయిల్ మంజూరు చేసి, మళ్లీ రిమాండ్‌కు పంపడం ఏంటి? దీనికి ఏ విధానం అవలంబించారు?' అని ప్రశ్నించింది. దీనికి జేజేబీ బాధ్యత వహించాలని పేర్కొంది.

చంద్రుడి దక్షిణ ధ్రువం నుంచి మట్టి, రాళ్లు

- అంతరిక్ష ప్రయోగాల్లో చైనా కొత్త రికార్డు

బీజింగ్, జూన్ 25: చంద్రుడి దక్షిణ ధ్రువం మీదకు చైనా ప్రయోగించిన చాంగే-6 స్పేస్ క్రాఫ్ట్ తిరిగి భూమిని చేరింది. వస్తూ వస్తూ అక్కడి నుంచి రెండు కిలోల మట్టి, రాళ్ల నమూనాలను తీసుకువచ్చింది. దీంతో, చంద్రుడి దక్షిణ ధ్రువం నుంచి నమూనాలను సేకరించిన తొలి దేశంగా చైనా చరిత్ర సృష్టించింది. చాంగే-6 లోని రిటర్నర్ మాడ్యూల్ భారత కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 11.37 గంటలకు ఉత్తర చైనాలోని సిజివాంగ్ ప్రాంతంలో విజయవంతంగా ల్యాండ్ అయింది. చాంగే 6ను మే 3వ తేదీన అంతరిక్షంలోకి ప్రయోగించారు. జూన్ 2వ తేదీన ఇది చంద్రుడి దక్షిణ ధ్రువంపై ఏకెన్ బేసిన్ వద్ద ల్యాండ్ అయింది. స్పేస్‌క్రాఫ్ట్‌లోని రోవర్ అక్కడి మట్టి, రాళ్ల నమూనాలను సేకరించింది. జూన్ 4న చాంగే-6లోని రిటర్నర్ మాడ్యూల్ తిరిగి అంతరిక్షంలోకి ఎగిరింది. మంగళవారం అది భూమిని చేరింది.

కెన్యాలో జనాగ్రహం.. పార్లమెంటుకు నిప్పు

నైరోబీ, జూన్ 25: అసలే ధరల పెరుగుదల కారణంగా బతకడమే కష్టమవుతున్న సమయంలో పన్నుల భారాన్ని కూడా మోపడాన్ని నిరసిస్తూ కెన్యా దేశంలో ప్రజలు ఆందోళనకు దిగారు. రొట్టెలు, వంటగ్యాస్‌పైనా పన్ను వేయడంతో ప్రజాగ్రహం పెల్లుబికింది. సహనం కోల్పోయిన జనం మంగళవారం ఏకంగా పార్లమెంటు భవనానికి నిప్పు పెట్టారు. భవనంలోని ఒక భాగంలో మంటలు వ్యాపించాయి. పన్నుల పెంపునకు సంబంధించిన ఆర్థిక బిల్లుపై చర్చ జరుగుతున్నప్పుడే ఈ సంఘటన జరగడం గమనార్హం. ఈ గందరగోళం నడుమే ఆ బిల్లుకు ఆమోదం లభించింది. పార్లమెంటు బయట ఉద్యమకారులు పోలీసులతో ఘర్షణకు దిగారు. వారిని అదుపు చేయడానికి కాల్పులు జరపడంతో కనీసం పది మంది మరణించారు.

స్పీకర్ పదవికి ఎన్నిక!

లోక్‌సభ చరిత్రలో ఇది నాలుగోసారి.. ఎన్డీయే నుంచి మరోసారి బరిలో ఓం బిర్లా

- ఇండియా నుంచి కేరళ ఎంపీ సురేశ్
- కేంద్ర మంత్రుల రాయబారం విఫలం
- నేడు ఓటింగ్.. పేపర్ స్లిప్పుల ద్వారానే



ఓం బిర్లా నామినేషన్ పత్రాలను లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు సమర్పిస్తున్న ఎన్డీయే నేతలు

న్యూఢిల్లీ, జూన్ 25: చర్చలు.. సంప్రదింపులు విఫలం కావడం.. అధికార, ప్రతిపక్ష కూటములు పట్టు విడవకపోవడంతో.. స్వతంత్ర భారత చరిత్రలో నాలుగోసారి.. దాదాపు యాభై ఏళ్ల అనంతరం మొదటిసారి లోక్‌సభ స్పీకర్ పదవికి పోటీ జరగనుంది. గడువు మరికొద్ది సేపట్లో ముగుస్తుందనగా మంగళవారం ఇరు పక్షాల అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. బీజేపీ ఎంపీ, గత లోక్‌సభ స్పీకర్ ఓంప్రకాశ్ బిర్లాను ఎన్డీఏ మరోసారి బరిలో దించగా, కేరళకు చెందిన కాంగ్రెస్ ఎంపీ సురేశ్ కొడికున్నిల్‌ను ఇండియా కూటమి పోటీకి నిలిపింది. బుధవారం ఉదయం 11 గంటలకు స్పీకర్ ఎన్నిక జరగనుంది. ఈ పరిస్థితిని తప్పించేందుకు ఇండియా కూటమి నేతలు కేసీ వేణుగోపాల్ (కాంగ్రెస్), టీఆర్ బాలు (డీఎంకే)తో కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా చర్చలు జరిపారు. బిర్లా అభ్యర్థిత్వానికి మద్దతు ఇస్తామని, ప్రతిగా తమకు డిప్యూటీ స్పీకర్ ఇవ్వాలంటూ విపక్షం షరతు విధించింది. అధికార పక్షం ససేమిరా అనడంతో సంప్రదింపులు విఫలమయ్యాయి. అనంతరం బయటకువచ్చిన కేసీ వేణుగోపాల్.. డిప్యూటీ స్పీకర్ పదవిని ప్రతిపక్షానికి ఇచ్చే ఆనవాయితీని అధికార పక్షం పాటించనందున స్పీకర్ పదవికి తమ అభ్యర్థిని నిలుపుతున్నట్లు ప్రకటించారు. ఓటింగ్ అనివార్యమైన రీత్యా.. స్పీకర్ ఎన్నికకు ఎంపీలకు పేపర్ స్లిప్‌లను పంపిణీ చేయనున్నారు. కొత్త పార్లమెంటు భవనంలో ఎలక్ట్రానిక్ వ్యవస్థ ఇంకా అందుబాటులోకి రాకపోవడం, సభ్యులకు సీట్ల కేటాయింపు కొనసాగుతుండడమే దీనికి కారణం. కాగా, ఉదయం 11.50 వరకు ఎన్డీఏ ప్రతిస్పందన కోసం ఎదురుచూసి నామినేషన్ దాఖలు చేశామని సురేశ్ తెలిపారు. స్పీకర్ ఎన్నికలో అనుసరించాల్సి వ్యూహంపై ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల నేతలు మంగళవారం రాత్రి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే నివాసంలో సమావేశమై చర్చించారు.

బలం బిర్లా వైపే..!

లోక్‌సభలో ప్రస్తుతం సభ్యుల సంఖ్య 542. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ వయనాడ్‌కు రాజీనామా చేయడంతో ఒక స్థానం ఖాళీగా ఉంది. ఎన్డీఏకు 293 మంది, ఇండియాకు 233 మంది సభ్యుల బలం ఉంది. మరో ముగ్గురు స్వతంత్రులు సైతం విపక్షానికి మద్దతిస్తున్నారు. ఈ ప్రకారం చూస్తే స్పీకర్‌గా ఓం బిర్లా గెలుపు లాంఛనమే. రాజస్థాన్‌లోని కోటా స్థానం నుంచి ఈయన మూడుసార్లు గెలిచారు. మరోవైపు దళిత నేత అయిన సురేశ్ కేరళలోని మవేలీకర నుంచి 8 సార్లు విజయం సాధించారు. కాగా, సురేశ్‌ను ఇండియా అభ్యర్థిగా నిలిపే అంశంపై తమను కలుపుకొని పోలేదని టీఎంసీ మొదట అసంతృప్తి వ్యక్తం చేసింది. అయితే గాంధీ టీఎంసీ అధినేత్రి మమతతో మాట్లాడడంతో ఖర్గే నివాసంలో మంగళవారం రాత్రి నిర్వహించిన సమావేశానికి ఆ పార్టీ లోక్‌సభా పక్ష నేత కూడా హాజరయ్యారు.

1952, 1967, 1976 తర్వాత..

తొలి లోక్‌సభ ఏర్పడిన 1952లో స్పీకర్ పదవికి ఎన్నిక జరిగింది. నాడు శంకర్ శాంతారామ్ మోరేపై జీవీ మావలంకర్ గెలుపొందారు. తర్వాత రెండోసారి 1967లో ఎన్నిక అనివార్యమైంది. కాంగ్రెస్‌కు చెందిన నీలం సంజీవరెడ్డి... ప్రతిపక్షం మద్దతిచ్చిన స్వతంత్ర ఎంపీ తెన్నేటి విశ్వనాథంపై గెలిచారు. దేశంలో ఎమర్జెన్సీ అమల్లో ఉండగా 1976లో స్పీకర్ పదవికి మూడోసారి ఎన్నిక జరిగింది. అప్పట్లో జగన్నాథ్‌రావుపై బలిరామ్ భగత్ విజయం సాధించారు.

మోదీ.. ఇదేనా నిర్మాణాత్మకం:రాహుల్

ఆనవాయితీ ప్రకారం డిప్యూటీ స్పీకర్ పదవి ప్రతిపక్షానికి దక్కాలని తాము చెప్పామని, అందుకు అంగీకరిస్తే స్పీకర్ పదవి ఏకగ్రీవం అయ్యేందుకు సహకరిస్తామని ప్రతిపాదించామని రాహుల్ గాంధీ చెప్పారు. దీనికి ప్రధాని మోదీ అంగీకరించలేదని ఆరోపించారు. ప్రతిపక్షాలు నిర్మాణాత్మకంగా వ్యవహరించాలని పిలుపునిచ్చి.. ఆయనే నిర్మాణాత్మకంగా వ్యవహరించలేదన్నారు. అయితే డిప్యూటీ స్పీకర్ పదవిని ప్రతిపక్షాలకే ఇవ్వాలన్న నిబంధన ఎక్కడా లేదని కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ తెలిపారు. ఎన్డీఏ మిత్రపక్షాలకు ఈ పదవిని కేటాయించాలని బీజేపీ భావిస్తున్నట్లు సమాచారం.

లోకం తీరు



తమిళ ఎంపీ గోపీనాథ్ తెలుగులో ప్రమాణ స్వీకారం



చెన్నై, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని కృష్ణగిరి ఎంపీ కె.గోపీనాథ్ మంగళవారం పార్లమెంటులో తెలుగులో ప్రమాణ స్వీకారం చేయడం అందరినీ ఆకట్టుకుంది. కాంగ్రెస్ సీనియర్ నేత గోపీనాథ్ తెలుగు కుటుంబానికి చెందిన వారు. కృష్ణగిరి జిల్లా హోసూరుకు చెందిన ఆయన విద్యాభ్యాసం తెలుగు మాధ్యమంలోనే కొనసాగింది. 2001, 2006, 2011లో హోసూరు నియోజకవర్గం నుంచి గోపీనాథ్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. తమిళనాడులో నెలకొన్న తెలుగు భాషా సమస్యల కోసం, తెలుగు వారి కోసం పోరాడే యోధుడిగా ఆయనకు మంచి పేరుంది. తమిళనాడు అసెంబ్లీలోనూ ఆయన పలుమార్లు తెలుగులోనే ప్రసంగించారు. మాతృభాష పట్ల ఎనలేని మమకారమున్న గోపీనాథ్.. పార్లమెంటులో కూడా తెలుగులోనే ప్రమాణస్వీకారం చేయడంతో పలువురు తమిళ ఎంపీలు హర్షధ్వానాలతో ఆయన్ని అభినందించారు.

రాజ్యాంగ ప్రతితో ప్రమాణం

- రాహుల్ నుంచి అఖిలేశ్ దాకా ప్రతిపక్ష సభ్యులందరూ అంతే

న్యూఢిల్లీ, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో రెండో రోజు సభ్యుల ప్రమాణ స్వీకారాల సందర్భంగా పలు ఆసక్తికర అంశాలు చోటుచేసుకున్నాయి. మంగళవారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నుంచి సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ దాకా విపక్ష నేతలు రాజ్యాంగ ప్రతులను చేతబట్టి ఎంపీలుగా ప్రమాణం చేశారు. పలువురు సభ్యులు ప్రమాణ స్వీకారం అనంతరం నినాదాలు చేశారు. ఉదయం 11 గంటలకు ప్రమాణ స్వీకార కార్యక్రమం ప్రారంభం కాగా, ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్.. సభ్యులతో ప్రమాణం చేయించారు. రాహుల్‌గాంధీ పేరు పిలవగానే కాంగ్రెస్ సభ్యులు భారత్ జోడో అంటూ నినాదాలు చేశారు. ఆయన రాజ్యాంగ ప్రతిని చేతబట్టి ఇంగ్లిష్‌లో ప్రమాణం చేశారు. కాగా, ఉత్తరప్రదేశ్‌లోని బరేలీ ఎంపీ ఛత్రపాల్ సింగ్(బీజేపీ) ప్రమాణం స్వీకారం అనంతరం 'జై హిందూ రాష్ట్ర.. జై భారత్' అంటూ నినాదం చేశారు. దీనిపై విపక్ష సభ్యులు అభ్యంతరం తెలిపారు. ఆయన నినాదం రాజ్యాంగ నియమాలకు వ్యతిరేకంగా ఉందన్నారు. దీంతో రికార్డులో ఆ నినాదాన్ని తొలగిస్తామని ప్రొటెం స్పీకర్ ప్రకటించారు. ఇక గజియాబాద్ ఎంపీ అతుల్‌గార్గ్ (బీజేపీ) ప్రమాణ స్వీకారం తర్వాత 'నరేంద్రమోదీ జిందాబాద్' అంటూ నినదించారు. మహారాష్ట్రకు చెందిన ఎన్సీపీ (ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే ప్రమాణ స్వీకారం అనంతరం ప్రొటెం స్పీకర్ భర్తృహరి కాళ్లకు నమస్కరించారు. రాజస్థాన్‌కు చెందిన భారత్ ఆదివాసీ పార్టీ అధ్యక్షుడు, ఎంపీ రాజ్‌కుమార్ రోత్.. ఒంటెపై పార్లమెంటుకు వచ్చారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీని హత్య చేసిన బాడీగార్డుల్లో ఒకరైన బియాంత్‌సింగ్ కుమారుడు సరబ్‌జిత్‌సింగ్ ఖల్సా మంగళవారం లోక్‌సభ సభ్యుడిగా పమాణం చేశారు. తమిళనాడులోని తిరువళ్లూర్ ఎంపీ శశికాంత్ సెంథిల్(కాంగ్రెస్) రాజ్యాంగ ప్రతిని చేతపట్టుకుని తమిళంలో ప్రమాణం చేశారు.

కేజ్రీవాల్ బెయిలుపై స్టే



ఢిల్లీ హైకోర్టు తీర్పు.. ట్రయల్ కోర్టు నిర్ణయం అనాలోచితమని వ్యాఖ్య

న్యూఢిల్లీ, జూన్ 25: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు రౌస్ అవెన్యూ కోర్టు మంజూరు చేసిన బెయిలుపై ఢిల్లీ హైకోర్టు స్టే విధించింది. మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన కేజ్రీవాల్ తిహాడ్ జైల్లో ఉన్నారు. ట్రయల్ కోర్టు ఈ నెల 20న కేజ్రీవాల్‌కు సాధారణ బెయిలు మంజూరు చేసింది. దీన్ని సవాలు చేస్తూ ఈడీ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ట్రయల్ కోర్టు ఏకపక్షంగా వ్యవహరించిందని, తమకు వాదనలు వినిపించడానికి తగిన సమయం కూడా ఇవ్వలేదని తెలిపింది. కేజ్రీవాల్‌కు మంజూరు చేసిన బెయిల్‌పై స్టే ఇవ్వాలని కోరింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ సుధీర్‌కుమార్ జైన్ నేతృత్వంలోని వెకేషన్ బెంచ్ మంగళవారం విచారణ జరిపింది. కేజ్రీవాల్‌కు బెయిలు మంజూరు చేసే విషయంలో ట్రయల్ కోర్టు కనీస ఆలోచన చేయలేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈడీ సమర్పించిన పత్రాలను జడ్జి సరిగా పరిశీలించలేదని, దర్యాప్తు సంస్థ లేవనెత్తిన అభ్యంతరాలనూ పట్టించుకోలేదని పేర్కొంది. బెయిలు పిటిషన్‌పై వాదనలు వినిపించేందుకు ఈడీకి సరైన అవకాశం కల్పించలేదని న్యాయమూర్తి జస్టిస్ జైన్ పేర్కొన్నారు. మనీలాండరింగ్ అంశంలో దర్యాప్తు సంస్థ వాదనలను, లిఖితపూర్వక సమర్పణలను ట్రయల్ కోర్టు జడ్జి పరిగణనలోకి తీసుకోలేదని.. వాటిపై చర్చించనూ లేదని వ్యాఖ్యానించారు. ట్రయల్ కోర్టు ఇచ్చిన సాధారణ బెయిలుపై స్టే విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ తీర్పుతో కేజ్రీవాల్ ప్రస్తుతానికి తిహాడ్ జైలుకే పరిమితం కావాల్సి ఉంటుంది. ఢిల్లీ హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని ఆప్ వర్గాలు మంగళవారం వెల్లడించాయి. కాగా, తన బెయిలు విషయమై కేజ్రీవాల్ ఇప్పటికే దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో బుధవారం విచారణ జరగనుంది. మరోవైపు, తిహాడ్ జైల్లో ఉన్న కేజ్రీవాల్‌ను సీబీఐ మంగళవారం అరెస్టు చేసింది. బుధవారం ఆయన్ను ట్రయల్ కోర్టులో ప్రవేశపెట్టనున్నారు. ఈడీ కేసులో బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరగడానికి ఒక రోజు ముందు కేజ్రీవాల్‌ను సీబీఐ అరెస్టు చేయడం గమనార్హం. ఇదిలా ఉండగా, బెయిలు పిటిషన్లపై విచారణలో అనవసరంగా వాయిదాలు వేయొద్దని సుప్రీంకోర్టు సూచించింది. మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన ఆప్ నేత, ఢిల్లీ మాజీ మంత్రి సత్యేంద్ర జైన్ బెయిలు పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు తదుపరి విచారణ జరిగే రోజు నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నట్లు పేర్కొంది. జూలై 9న ఢిల్లీ హైకోర్టులో జైన్ బెయిలు పిటిషన్‌పై విచారణ జరగనుంది.

క్షీణించిన అతీశి ఆరోగ్యం నిరాహార దీక్ష విరమణ



న్యూఢిల్లీ, జూన్ 25: ఢిల్లీలో తాగునీటి కొరత సమస్యకు కేంద్రప్రభుత్వం పరిష్కారం చూపాలని, హరియాణా నుంచి ఢిల్లీకి రావాల్సిన నీటి వాటాను మొత్తం సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని నిరవధిక నిరాహార దీక్ష చేపట్టిన ఆప్ నాయకురాలు అతీశి ఆరోగ్యం బాగా క్షీణించింది. ఆమె రక్తంలో షుగర్ స్థాయి బాగా పడిపోయింది. దీంతో, ఆమెను ఢిల్లీలోని లోక్‌నాయక్ ఆస్పత్రిలో చేర్చారు. ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. అతీశి ఐదు రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నారు. దీక్ష విరమించాలని సోమవారం సాయంత్రమే వైద్యులు ఆమెకు సూచించారు. దానికి ఆమె నిరాకరించారు. అయితే, సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత అతీశి ఆరోగ్యం మరింత క్షీణించడంతో ఆదివారం తెల్లవారుజామున 3.45గంటలకు ఆమెను ఆస్పత్రిలో చేర్చారు. కాగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నందున అతీశి తన నిరాహార దీక్షను విరమించారని ఆప్ రాజ్యసభ సభ్యుడు సంజయ్‌సింగ్ ప్రకటించారు. అతీశి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం స్థిరంగా ఉందని వైద్యులు తెలిపారు.

విపక్ష నేతగా రాహుల్



(మొదటి పేజీ తరువాయి)

రాహుల్ దీటుగా ఎదుర్కోగలరని మంగళవారం రాత్రి ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఇంట్లో జరిగిన విపక్ష కూటమి సమావేశం పునరుద్ఘాటించింది. దీంతో.. ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉండేందుకు రాహుల్ తన ఆమోదాన్ని ప్రకటించారు. ఆ వెంటనే కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ(సీపీపీ) చైర్‌పర్సన్ సోనియాగాంధీ ప్రొటెం స్పీకర్ భర్తృహరికి రాహుల్‌ను తమ పార్టీ తరఫున ప్రధాన ప్రతిపక్ష నేతగా పేర్కొంటూ లేఖ రాశారు. గడిచిన పదేళ్లుగా లోక్‌సభలో విపక్ష నేత హోదా ఖాళీగా ఉంది. ఏదైనా పార్టీ లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష హోదాను పొందాలంటే.. మొత్తం సీట్లలో 10% స్థానాల్లో గెలిచి ఉండాలి. ప్రస్తుతం లోక్‌సభలో 543 సీట్లున్నాయి. అంటే.. ప్రధాన ప్రతిపక్ష హోదా దక్కాలంటే 54 సీట్లు తప్పనిసరి. 2014 సార్వత్రిక ఎన్నికల్లో మోదీ ప్రభంజనంతో.. కాంగ్రెస్ 44 సీట్లతో సరిపెట్టుకుంది. 2019లో కూడా కాంగ్రెస్ పార్టీ 52 స్థానాలను దక్కించుకోగా.. ప్రధాన ప్రతిపక్ష హోదాకు రెండు సీట్లు తక్కువయ్యాయి. ఈ సారి 99 మంది ఎంపీలుండడంతో.. కాంగ్రెస్ ప్రతిపక్ష హోదాను దక్కించుకుంది.

రాహుల్‌పై గురుతర బాధ్యత..!

లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేతకు ప్రత్యేక సభాహక్కులుంటాయి. లోక్‌సభలో సభ్యులకు సీట్లు, గదుల కేటాయింపులు, అధికారిక పత్రాల సరఫరా, పార్లమెంటరీ కమిటీల నియామకం, సభ రోజువారీ కార్యకలాపాల్లో కీలక పాత్ర పోషిస్తారు. సీబీఐ చీఫ్, చీఫ్ విజిలెన్స్ కమిషనర్, కేంద్ర సమాచార హక్కు కమిషనర్, ఎన్నికల ప్రధాన కమిషనర్, ఇతర కమిషనర్ల నియామకానికి సంబంధించిన ప్యానెళ్లలోనూ ప్రధాన ప్రతిపక్ష నేత సభ్యుడిగా ఉంటారు. వీటితోపాటు.. లోక్‌సభలో ప్రజల గళాన్ని వినిపించే అవకాశం విపక్ష నేతకు ఎక్కువగా ఉంటుంది. "జోడో యాత్రల సందర్భంగా రాహుల్ అనేక వర్గాలను కలిశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ కూడా నిరుద్యోగిత, ధరల పెరుగుదల, మహిళా సమానత్వం, సామాజిక న్యాయంపై హామీలు ఇచ్చింది. ఈ అంశాలపై పార్లమెంట్‌లో గళమెత్తాల్సిన అవసరముంది. అది రాహుల్ వల్లే సాధ్యం. ఎన్నికల ప్రచారంలోనూ మోదీని రాహుల్ దీటుగా ఎదుర్కొన్నారు" అని కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వ్యాఖ్యానించారు.

అలా లీకయ్యిందా?

- కొరియర్ కంపెనీ నిర్లక్ష్యమే కారణం!
- నీట్ ప్రశ్నపత్రాన్ని కంపెనీ వాహనానికి బదులు వేరే రిక్షాలో తరలించిన వైనం
- మార్గమధ్యంలోనే అక్రమార్కులు పేపర్‌ను చేజిక్కించుకుని ఉండొచ్చని అంచనా

న్యూఢిల్లీ, జూన్ 25: నీట్ పేపర్ లీక్ గుట్టు రట్టవుతోంది. అక్రమార్కులకు ప్రశ్నపత్రం ముందే ఎలా అందింది? అనే ప్రశ్నకు సమాధానం నెమ్మదిగా బయటికి వస్తోంది. షెడ్యూలు ప్రకారం.. అహ్మదాబాద్ నుంచి ఓ ప్రైవేటు కొరియర్ సంస్థ ద్వారా రాంచీకి చేరుకున్న ప్రశ్నపత్రాలు.. అక్కణ్నుంచి స్థానిక ఎస్‌బీఐ బ్రాంచ్‌కి చేరాల్సి ఉంది. తర్వాత ఆ బ్యాంకు నుంచి అవి సంబంధిత ఎగ్జామ్ సెంటర్‌కు చేరాలి. రాంచీకి వచ్చిన ప్రశ్నపత్రాలను తన సొంత వాహనంలో బ్యాంకుకు తరలించాల్సిన కొరియర్ కంపెనీ.. అందుకు ఒక ఈ-రిక్షాను బుక్ చేసుకున్నట్టు బిహార్ ఆర్థిక నేరాల విభాగం అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో.. కొరియర్ కంపెనీ నుంచి బ్యాంకుకు వెళ్లే సమయంలోనే ప్రశ్నపత్రాలు ఉన్న బాక్సు ట్యాంపరింగ్‌కు గురై, పేపర్ లీక్ అయి ఉండొచ్చని వారు అంచనా వేస్తున్నారు. నీట్ పేపర్ లీక్ గురించి మే 4వ తేదీనే ఉప్పందుకున్న బిహార్ పోలీసులు.. మే 5వ తేదీ నాటికే సాల్వర్ గ్యాంగ్ ముఠా విద్యార్థులకు ఆ ప్రశ్నపత్రాన్ని అందజేసిన స్కూలుకు చేరుకున్నారు. అక్కడ వారికి తగలబెట్టిన ప్రశ్నపత్రం తాలూకా అవశేషాలు దొరికాయి. ఆ బుక్‌లెట్‌పై ఉన్న నంబర్ (636488) ఆధారంగా విచారణ జరపగా.. అది ఝార్ఖండ్ హజారీబాఘ్‌లోని ఒయాసిస్ అనే పాఠశాలకు (నీట్ పరీక్షా కేంద్రం) చేరాల్సిన ప్రశ్నపత్రంగా తేలింది. దీంతో వారు జూన్ 21న అక్కడికి చేరుకుని ఒయాసిస్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడిని ప్రశ్నించగా.. ఆయన ఒక ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు. ఆరోజు తమకు అందిన ప్రశ్నపత్రాల బాక్సు డిజిటల్ లాక్ మధ్యాహ్నం ఒకటింబావు సమయంలో దానంతట అదే తెరుచుకోవాల్సి ఉందని.. కానీ, తెరుచుకోకపోవడంతో జాతీయ టెస్టింగ్ ఏజెన్సీని సంప్రదించామని.. వారు దాన్ని కట్టర్‌తో బలవంతంగా తెరవాలని సూచించడంతో అలాగే చేశామని ప్రిన్సిపాల్ వివరించారు. దర్యాప్తులో భాగంగా జూన్ 21న వచ్చిన ఈవోయు అధికారులు.. ప్రశ్నపత్రాలున్న అల్యూమినియం బాక్సు చుట్టూ ఉండే స్టిక్కర్లు ఉండాల్సిన రీతిలో లేవని, ప్రశ్నపత్రాలున్న ఎన్వలప్ కవర్‌ను ఒక చివర చాలా తెలివిగా తెరిచారని.. తమకు తెలిపినట్టు వెల్లడించారు.

ఇంకా అంతరిక్షంలోనే సునీతా విలియమ్స్



న్యూఢిల్లీ, జూన్ 25: భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ ఇటీవల ప్రయాణించిన బోయింగ్ స్టార్‌లైనర్ వ్యోమనౌకకు సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో ఆమెతోపాటు మరో నాసా వ్యోమగామి బుచ్ విల్‌మోర్ కూడా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లోనే చిక్కుకుపోయారు. వారిద్దరూ స్టార్‌లైనర్‌లో ఈ నెల 5న ఐఎస్ఎస్‌కు చేరుకున్న సంగతి తెలిసిందే. అక్కడ ఈ వ్యోమనౌకలో హీలియం లీకేజీ సమస్య తలెత్తడంతో.. నాసా ఇంజనీర్లు దాన్ని సరిదిద్దే పనిలో నిమగ్నమయ్యారు. ఈ నెల 26న వారు భూమిపైకి తిరిగొస్తారని నాసా నాలుగు రోజుల క్రితం ప్రకటించినప్పటికీ.. ఈ ప్రక్రియ మరోసారి వాయిదాపడింది. వాస్తవానికి పది రోజుల మిషన్‌ను ముగించుకుని వారు ఈ నెల 14న భూమిపైకి తిరిగి రావాల్సి ఉంది. విమానయాన రంగంలో ఘనమైన చరిత్ర ఉన్న దిగ్గజ సంస్థగా పేరొందిన బోయింగ్.. వరుస ప్రమాదాలతో ఇటీవలికాలంలో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. 2018, 2019 సంవత్సరాల్లో బోయింగ్ 737 మ్యాక్స్ విమానాలు ఘోర ప్రమాదానికి గురి కావడంతో పలు దేశాలకు చెందిన విమానయాన కంపెనీలు ఆ విమానాల వినియోగాన్ని నిషేధించాయి. దాంట్లో లోపాలను సరిచేయడంతో 20 నెలల తర్వాత ఆ నిషేధాన్ని ఎత్తివేశాయి. కానీ, ఆ తర్వాత బోయింగ్ కంపెనీకి చెందిన ఇతర మోడల్ విమానాలు కూడా తరచుగా ఏదో ఒక ప్రమాదానికి గురై వార్తల్లోకెక్కడంతో ఆ సంస్థ పేరెత్తితేనే ప్రయాణికులు భయపడే పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు.. రోదసిలో సైతం బోయింగ్ వ్యోమనౌక రకరకాల లోపాలతో ఇబ్బందిపెట్టడం గమనార్హం.

'ఎమర్జెన్సీ' ఓ మాయని మచ్చ

» ఇందిరను మించిన దురాలోచన రాహుల్‌ది: సంజయ్



హైదరాబాద్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): ఎమర్జెన్సీ పాలన దేశానికి ఓ మాయని మచ్చ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. కాంగ్రెస్ అధికార దాహానికి ఎమెర్జెన్సీ పాలన ఓ నిదర్శన మని అన్నారు. ఇందిరను మించిన దురాలోచన రాహుల్ గాంధీదని మండిపడ్డారు. బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని తారుమారు చేస్తుందని.. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లను రద్దు చేస్తుందని పార్లమెంట్ ఎన్నికల్లో తప్పుడు ప్రచారం చేసి ఓట్లు పొందాలని చూసిన కాంగ్రెస్‌కు దేశ ప్రజలు తగిన బుద్ధి చెప్పినా ఆ పార్టీ నేతలు మారలేదని పేర్కొన్నారు. ఈ విషయంలో రాహుల్.. ఆయన నానమ్మ ఇందిరాగాంధీని మించిపోయారని అన్నారు. భారతదేశాన్ని అస్థిరపరచడంలో, బలహీనపరచడంలో విదేశీ శక్తుల పాత్ర ఉందనే సాకుతో అధికారాన్ని నిలుపుకునేందుకు నాడు ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధిస్తే.. అధికారం కోసం రాహుల్ గాంధీ విదేశాల్లో పర్యటిస్తూ 'ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉంది' అనే ముసుగులో భారత్‌లో పాశ్చాత్య దేశాల జోక్యం అవసరమంటూ నిస్సిగ్గుగా వేడుకుని దేశ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు యత్నించారని సంజయ్ ఒక ప్రకటనలో విమర్శించారు.

రామగుండం

జెన్‌కో భూముల్లో సింగరేణి ప్లాంట్: భట్టి

హైదరాబాద్, జూన్ 25(ఆంధ్రజ్యోతి): రామగుండంలో జెన్‌కోకు చెందిన ప్లాంట్ ఉన్న స్థలంలో 800 మెగావాట్ల సామర్థ్యంతో సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం కట్టించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రస్తుతం అక్కడున్న.. జెన్‌కోకు చెందిన 62.5 మెగావాట్ల థర్మల్ కేంద్రం మూతపడనున్న నేపథ్యంలో ఆ భూములను సింగరేణికి అప్పగించాలని మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఉప ముఖ్యమంత్రికి వినతిపత్రాన్ని అందించారు. ఎన్నికల హామీ ప్రకారం థర్మల్ విద్యుత్ కేంద్రం పూర్తిచేస్తామని భట్టి స్పష్టం చేశారు. నిజాం కాలంలో నిర్మించిన చారిత్రక రామగుండం థర్మల్ పవర్ స్టేషన్ స్థలంలో కొత్త ప్లాంట్‌ను కట్టనున్నామన్నారు.

ఎన్నికల ఖర్చుపై ఆడిటింగ్ చేయించాలి

» ప్రధాన ఎన్నికల అధికారికి రాసిన లేఖలో ఎఫ్‌జీజీ

రాష్ట్రంలో 17 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం కోసం ఎన్నికల కమిషన్(ఈసీ)కు భారీ స్థాయిలో రూ.622 కోట్లు ఖర్చు కావడంపై ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్(ఎఫ్‌జీజీ) అనుమానం వ్యక్తం చేసింది. ఎన్నికల వ్యయంపై ఆడిటింగ్ ఉండదు కాబట్టి అధికార యంత్రాంగం నిధులను దుర్వినియోగం చేసి ఉండొచ్చని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో ఎన్నికల ఖర్చుపై రాష్ట్ర ఆడిటర్ జనరల్‌తో ఆడిటింగ్ చేయించాలని కోరింది. ఈ మేరకు ఎఫ్‌జీజీ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో)కి మంగళవారం లేఖ రాశారు. ఆడిటింగ్ వివరాలన్నీ ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు కూడా రూ.701కోట్లు ఖర్చు అయ్యాయని, ఎన్నికల ఖర్చుపై అప్పుడే వివరాలు కోరామని, జవాబు రాలేదని గుర్తు చేశారు.

బొగ్గు బ్లాకులను వేలం వేయొద్దు

» మావోయిస్టు నాయకుడు ప్రభాత్

గోదావరిఖని, జూన్ 25: సింగరేణి గనులను సింగరేణికే కేటాయించేలా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని, ఈ మేరకు అసెంబ్లీలో తీర్మానం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ డిమాండ్ చేశారు. సింగరేణి ప్రాంతంలోని బొగ్గు బ్లాకులను కేంద్ర ప్రభుత్వం బహిరంగ వేలం పాటలో పెట్టి ప్రైవేటీకరించే విధానాన్ని కోల్‌బెల్ట్ ప్రాంతంలోని సకల జనులు ఖండించాలని, బొగ్గు బ్లాకులను కాపాడుకునేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మంగళవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో.. తెలంగాణ కోసం చేసిన సకల జనుల సమ్మె పోరాటాన్ని అధిగమించే స్థాయిలో మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. బెల్ట్ ప్రాంత కాంగ్రెస్ ప్రజాప్రతినిధులంతా బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణపై క్రియాశీలంగా స్పందించాలన్నారు. బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకంగా కార్మికవర్గం చేపట్టే పోరాటాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు కలిసి ఉద్యమించాలని కోరారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఆదివాసీ మహిళలపై అకృత్యాలను అరికట్టాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తల డిమాండ్

రాంనగర్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో ఆదివాసీ మహిళలపై కేంద్ర బలగాలు చేస్తున్న అకృత్యాలను అరికట్టాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో 'చైతన్య మహిళా సంఘం' రాష్ట్ర కన్వీనర్ జ్యోతి, కో- కన్వీనర్ ఆధ్వర్యంలో ఛత్తీస్‌గఢ్ అడవుల్లో ఆదివాసీ మహిళలపై జరుగుతున్న దాడులపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. 'ఆపరేషన్ కగార్' పేరుతో అమలు చేస్తున్న హింసను వెంటనే ఆపాలని, శాంతియుత వాతావరణం నెలకొల్పి ఆదివాసీల డిమాండ్లను నెరవేర్చాలని వక్తలు డిమాండ్ చేశారు. అలాగే నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్‌లో చెంచు మహిళపై జరిగిన హింసకు సంబంధించి సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సామాజిక వేత్త సజయ, పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య, సృజన, ప్రొఫెసర్ వనమాల తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు భయపడి.. ఇసుక ట్రాక్టర్ నుంచి దూకేసి డ్రైవర్ పరారీ

» చెరువులోకి దూసుకెళ్లిన ట్రాక్టర్, ఓ కానిస్టేబుల్‌కు గాయాలు

ముస్తాబాద్, జూన్ 25 : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్ డ్రైవర్ పోలీసుల నుంచి తప్పించుకునేందుకు తాను నడుపుతున్న ట్రాక్టర్ నుంచి అకస్మాత్తుగా దూకి పరారయ్యాడు. దీంతో ఆ ట్రాక్టర్ చెరువులోకి దూసుకెళ్లి మునిగిపోగా, ఆ ట్రాక్టర్‌పై ఉన్న ఓ కానిస్టేబుల్ అదృష్టవశాత్తు గాయాలతో బయటపడ్డాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలో ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ముస్తాబాద్ మండలంలో నామాపూర్ మానేరు వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో సోమవారం రాత్రి దాడి చేసిన పోలీసులు నామాపూర్ శివారులో ఐదు ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఒక్కో ట్రాక్టర్‌పై ఒక్కో కానిస్టేబుల్ కూర్చొని వాటిని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఇందులో గురుబాబు అనే వ్యక్తి నడుపుతున్న ట్రాక్టర్‌పైకి సత్యనారాయణ అనే కానిస్టేబుల్ ఎక్కాడు. మార్గమధ్యలో గురుబాబు ట్రాక్టర్ నుంచి అకస్మాత్తుగా దూకేసి పరారయ్యాడు. దీంతో ట్రాక్టర్ పక్కనే ఉన్న చెరువులోకి దూసుకెళ్లగా, ట్రాక్టర్ నుంచి దూకిన కానిస్టేబుల్ సత్యనారాయణ రాళ్లపై పడి గాయపడ్డాడు. అయితే, ఐదో ట్రాక్టర్ స్టేషన్‌కు చేరకపోవడంతో వెనక్కి వెళ్లిన పోలీసులకు మేళ్ల చెరువు కట్ట పక్కన రాళ్లపై పడి ఉన్న కానిస్టేబుల్ సత్యనారాయణను గుర్తించి ఏం జరిగిందో తెలుసుకుని ఆస్పత్రికి తరలించారు. సత్యనారాయణ ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా, గురుబాబుపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

జై సమ్మక్క సారక్క.. జై భద్రకాళి

జై తుల్జాభవానీ.. జై యాదగిరి లక్ష్మీనరసింహస్వామి.. ప్రమాణ స్వీకారాల్లో తెలంగాణ ఎంపీల నినాదాలు

» మార్మోగిన ప్రాంతీయత.. పార్టీలకతీతంగా 'జై తెలంగాణ'

» ఒవైసీ 'జై పాలస్తీనా' నినాదం.. వివాదం

» రికార్డుల నుంచి తొలగింపు



రాజ్యాంగం పట్టుకొని మల్లు రవి



పంచెకట్టులో కొండా

న్యూఢిల్లీ, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో రెండో రోజు కూడా తెలంగాణకు చెందిన లోక్‌సభ సభ్యులు ప్రత్యేకత చాటారు. ఎంపీలుగా ప్రమాణ స్వీకారం సందర్భంగా ప్రాంతీయతకు పెద్దపీట వేస్తూ, స్థానిక దేవతలను తలుచుకుంటూ, దళిత, బహుజనవాదాన్ని ప్రస్తావించారు. రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ సోమవారమే ప్రమాణం చేయగా.. మిగిలిన 15 మంది ఎంపీలు మంగళవారం ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా వారు చేసిన నినాదాలు ఇతర సభ్యుల దృష్టిని ఆకర్షించాయి. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్.. 'జై సమ్మక్క సారక్క' అని నినదించగా, కాంగ్రెస్ ఎంపీల్లో కడియం కావ్య 'జై భద్రకాళి' అని, బలరాం నాయక్ 'జై తుల్జాభవానీ' అని, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి 'జై యాదగిరి లక్ష్మీనరసింహస్వామి' అని నినాదాలు చేశారు. కాగా, గడ్డం వంశీకృష్ణ, రామసహాయం రఘురాంరెడ్డి, ధర్మపురి అరవింద్, రఘునందన్‌రావు, కొండా విశ్వేశ్వరరెడ్డి ఇంగ్లీషులో ప్రమాణం చేయగా, సురేష్ షెట్కార్, మల్లు రవి, కుందూరు రఘువీర్, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, కడియం కావ్య, బలరాం నాయక్, ఈటల రాజేందర్, డీకే అరుణ తెలుగులో ప్రమాణం చేశారు. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఉర్దూలో, గోడం నగేశ్ హిందీలో ప్రమాణం చేశారు. సురేశ్ షెట్కార్, రఘునందన్‌రావు, ఈటల రాజేందర్, అసదుద్దీన్, మల్లు రవి, కుందూరు రఘువీర్, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, కావ్య, బలరాం నాయక్, రామసహాయం రఘురాం రెడ్డి జై తెలంగాణ నినాదాలు చేశారు. మల్లు రవి, కడియం కావ్య రాజ్యాంగ ప్రతిని చేతిలో పట్టుకుని ప్రమాణం చేశారు. కాగా, రఘురాంరెడ్డి 'జై భీం' అని నినదించారు. అయితే ఒవైసీ ప్రమాణం పూర్తయిన తర్వాత నినాదాలిస్తూ, 'జై తెలంగాణ, జై భీం, జై మీమ్‌తో పాటు జై పాలస్తీనా.. అల్లాహో అక్బర్' అని నినదించారు. పాలస్తీనా పేరు ప్రస్తావించడం వివాదానికి దారితీసింది. అసద్ నినాదాలపై కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై ప్రొటెం స్పీకర్ స్థానంలో ఉన్న రాధామోహన్ సింగ్ స్పందిస్తూ.. నిబంధనల ప్రకారం వ్యవహరించి రికార్డుల నుంచి తొలగించే విషయాన్ని పరిశీలిస్తామన్నారు. అనంతరం వాటిని రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రొటెం స్పీకర్ భర్తృహరి మెహతాబ్ ప్రకటించారు. కాగా, ఒవైసీ చేసిన నినాదం రాజ్యాంగ విరుద్ధమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఓ చేత్తో రాజ్యాంగంపై ప్రమాణం చేస్తూనే.. మరోవైపు ఆ రాజ్యాంగానికే వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడమేంటని మండిపడ్డారు. పార్లమెంటులో మరో దేశం పేరును ప్రస్తావించడం సరికాదని కిరెన్ రిజిజు అన్నారు.

మూడు బాక్సుల్లో ఆధారాలు!

(మొదటి పేజీ తరువాయి)

ఆ మెమోలో కోరారు. కాగా.. చంచల్‌గూడ జైలులో విచారణ ఖైదీలుగా ఉన్న అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై కోర్టు తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేసింది. 90 రోజుల జ్యుడీషియల్ కస్టడీ ముగిసినా.. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయలేదన్న కారణంతో మ్యాండేటరీ బెయిల్ ఇవ్వాలని వారిద్దరూ కోర్టును కోరారు. ఈ వ్యాజ్యంపై విచారణ బుధవారానికి వాయిదాపడింది. మరోవైపు మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు కూడా మరోమారు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. కాగా. ఈ కేసులో ఏ1గా ఉన్న ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు భారత్‌కు తిరిగి వస్తారా? అని దర్యాప్తు అధికారులు ఎదురుచూస్తున్నారు. ఈ కేసు తొలినాళ్లలోనే ప్రభాకర్‌రావు తాను జూన్ 26కల్లా భారత్ తిరిగి వస్తానంటూ తన న్యాయవాది ద్వారా కోర్టుకు వెల్లడించారు. అప్పట్లో కోర్టుకు సమర్పించిన మెమోలో తాను అనారోగ్యంతో బాధపడుతున్నట్లు.. ఆరోగ్యం సహకరిస్తే జూన్ 26 నాటికి భారత్‌కు వస్తానని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఈ కేసులో ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్‌రావు అరెస్టవ్వగా.. పోలీసు కస్టడీలో వారంతా ముక్తకంఠంతో "ప్రభాకర్‌రావు చెప్పినట్లు చేశాం" అని వాంగ్మూలమిచ్చారు. ఎన్నికల సమయంలో డబ్బు తరలింపు వ్యవహారాల విషయంలోనూ ఆదేశాలిచ్చింది ప్రభాకర్‌రావేనని పేర్కొన్నారు. దీంతో ఇప్పుడు ప్రభాకర్‌రావును విచారిస్తే గానీ, ఈ కేసు వెనక ఉన్న సూత్రధారులు, గత ప్రభుత్వ ప్రముఖుల పేర్లు బయటకు వచ్చే పరిస్థితులు లేవని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే 10 మంది వరకు రాజకీయ నాయకుల పేర్లు బయటకు వచ్చినా.. పోలీసులు వారిని ఇంకా విచారించాల్సి ఉంది.

27, 28 తేదీల్లో భారీ వర్షాలు

» 15 జిల్లాలకు హెచ్చరిక

» మిగిలిన జిల్లాల్లో తేలికపాటి వర్షాలు

హైదరాబాద్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి) : గురు, శుక్రవారాల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ నెల 27, 28 తేదీల్లో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, హన్మకొండ, పెద్దపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, పెద్దపల్లి, ఆదిలాబాద్, కరీంనగర్, నిర్మల్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. మిగిలిన జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని తెలిపింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఉపశమనం

దాదాపు రెండునెలలుగా మండుటెండలను, వడగాడ్పులను అనుభవిస్తున్న ఉత్తరభారతంలో కొన్ని ప్రాంతాలకు త్వరలోనే నిర్దిష్టమైన ఉపశమనం దక్కవచ్చునని భారతవాతావరణశాఖ మంగళవారం చేసిన ప్రకటన సూచిస్తోంది. బిహార్ వంటి రాష్ట్రాల్లో వేడిమి తగ్గడం, పశ్చిమభారతంలోనూ, ఈశాన్యంలోనూ వర్షాలు కురవడం ఇత్యాది పరిణామాలను ఐఎండీ లెక్కవేసింది. పంజాబ్, పశ్చిమరాజస్థాన్‌లో వడగాడ్పుల బాధ మరికొంతకాలం తప్పదని, ఇందుకు పూర్తిభిన్నంగా పశ్చిమబెంగాల్ తడిసిముద్దవుతుందని ఈ ప్రకటన సారాంశం. నైరుతి రుతుపవనాల విస్తరణతో దేశం చల్లబడుతుందన్న విశ్లేషణలు మనసుకు ఎంతో ఉపశమనాన్ని ఇస్తున్నాయి.

ఏప్రిల్ మొదలు జూన్ మూడోవారం వరకూ ఇంతటి సుదీర్ఘకాలం వేడిమిని, వడగాడ్పులను దేశం గత దశాబ్దకాలంలో చూసివుండదు. కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతలు అనూహ్యంగా ఉంటూ ప్రధానంగా ఉత్తరాది యావత్తూ మాడిపోయింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా గరిష్ఠం స్థాయిలో ఉంటూ, రాత్రి వేళల్లోనూ వేడినిలబడి జనజీవితం దుర్భరమైంది. అర్ధరాత్రిళ్ళు నలభైడిగ్రీల వేడిని సైతం ఢిల్లీ అనుభవించింది. ఈనెలలో, పట్టుమని పదిరోజుల్లోనే రెండువందలమంది నిరుపేదలు, నిరాశ్రయులు మరణించడం వడగాడ్పుల తీవ్రతను తెలియచేస్తోంది. అత్యంత వేడిమి శరీరంమీద మిగల్చే ప్రభావాలు అంతుచిక్కవు. ప్రాణానికి ముప్పువాటిల్లేవరకూ ఆ వేడి శరీరాన్ని పైకి కనిపించకుండా దొలిచేస్తుంది. ఆస్పత్రులు కిటకిటలాడిపోతూ, ఒకదశలో చికిత్స అందించలేని స్థితిలోకి జారుకున్నాయి. మిగతా అందరికంటే ఎక్కువగా కార్మికులు, వలసకూలీలు ప్రత్యక్షనరకం చవిచూశారు. ఎండల్లో పనిచేయలేక, ఆకలితో ఉండలేక అల్లాడిపోయారు. గిగ్ వర్కర్లు కాలుకదపలేకపోయారు. రోడ్లమీద చిన్నచిన్న వ్యాపారాలు చేసుకొనేవారిని మండుటెండలు చావుదెబ్బకొట్టాయి. ఈ దేశంలో డెబ్బయ్‌ఐదుశాతంమంది శ్రామికులు ఎండల్లోనే పనిచేస్తున్నందువల్ల మండుటెండలు, వడగాడ్పులతో ఉత్పన్నమైన పరిస్థితులు వారి ఉపాధిని గణనీయంగా దెబ్బతీయడమే కాక, దేశ ఉత్పత్తి కూడా తీవ్రంగా పతనమవుతుందన్నది వాస్తవం. ఈశాన్యభారతంలోని ఎత్తయిన పర్వతప్రాంతాల్లో కూడా కొద్దివారాల్లోనే అధిక వడగాడ్పు రోజులు నమోదైనాయి.

దేశరాజధాని చవిచూసిన పరిస్థితులను గమనించినప్పుడు, మీడియా కన్ను అంతగా పడని మిగతా ప్రాంతాలు ఇంకెంతటి నరకాన్ని చూవిచూశాయో సులువుగా అర్థమవుతుంది. జనానికి సరిపడా నీటిని అందించలేక, రాజకీయ నాయకుల అండదండలతో చెలరేగిపోయిన ప్రైవేటు ట్యాంకర్ల మాఫియాను నియంత్రించలేక ఢిల్లీ ప్రభుత్వం చతికిలబడిపోయింది. ఎండిన యమునలోకి కాస్తంత నీటిని వదలాల్సిందిగా హర్యానాను కోరినా ఆ రాష్ట్రం రాజకీయకారణాలతో సహకరించలేదని ఢిల్లీ ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం ఆరోపించింది. ఢిల్లీకి కాసిన్ని తాగునీళ్ళు ఇప్పించడానికి న్యాయస్థానాలు సైతం రంగంలోకి దిగాల్సివచ్చింది. విద్యుత్ వినియోగం రికార్డుస్థాయికి చేరి, తగినంత సరఫరా లేక, దిగుమతి చేసుకున్నది కూడా చాలక ఢిల్లీ ప్రజలు నానారకాల కష్టాలూ అనుభవించారు. ప్రజల బాధల్ని తీర్చలేని పాలకులు ప్రతీ విషయాన్నీ ఎంత తెలివిగా రాజకీయం చేస్తారో ఢిల్లీ ప్రజలు మరోమారు చూశారు.

ఇదంతా ఎల్‌నినో ప్రభావమే కావచ్చును కానీ, గత మూడునాలుగేళ్ళుగా వడగాడ్పులను దేశం చవిచూస్తున్నది. వచ్చే సంవత్సరాల్లోనూ ఈ పరిస్థితుల్లో విశేషమైన తేడా ఉండకపోవచ్చు. వాతావరణమార్పులు ఇందుకు దోహదం చేస్తున్నప్పటికీ, స్థానిక పరిస్థితులు, ప్రభుత్వాల నిష్క్రియాపరత్వం తోడైనప్పుడు సామాన్యుడు సులువుగా బలైపోతాడు. ముందస్తు ప్రణాళికలతో, అత్యయిక స్థితి తరహా ఏర్పాట్లతో మండుటెండల నుంచి ప్రజలను కాపాడేందుకు ప్రభుత్వాలు సంసిద్ధంగా ఉండాలి. నేడు ఢిల్లీ ఎదుర్కొంటున్న పరిస్థితులు రేపు అన్ని నగరాలూ అనుభవించక తప్పదేమో. కాంక్రీట్ అరణ్యాలుగా మారిపోయిన నగరాలన్నీ ఈ తరహా ఉపద్రవాలు చవిచూస్తూ, ఉద్యోగ ఉపాధులు దెబ్బతినిపోతే ఎలా అన్నది ప్రశ్న. ఈసారి రుతుపవనాలు త్వరగానే కేరళను తాకినప్పటికీ, గత పదిహేను రోజులుగా అవి స్తంభించిపోవడంతో, అటు వర్షాలు లేక, ఇటు ఎండలు తగ్గక, ఉక్కపోత భరించలేక దేశం యావత్తూ అల్లాడిపోతున్నది. ఈ దీర్ఘకాలిక వేసవికి త్వరలోనే విముక్తి లభించబోతున్నందుకు కచ్చితంగా సంతోషించాల్సిందే.

> బొగ్గు గనుల కేటాయింపు అంతా చట్ట ప్రకారమే అంటున్న కేంద్ర ప్రభుత్వం అదే చట్టంలో సింగరేణి తరహా సంస్థలకు రిజర్వేషన్ విధానంలో గనులను కేటాయించే వెసులుబాటు ఉన్నదనే విషయాన్ని ఉపేక్షిస్తోంది. సగటు పౌరుడికి అవసరమైన విద్యుత్ కోణం నుంచి సింగరేణికి గనుల కేటాయింపును పరిగణనలోకి తీసుకోవాలి. సౌదీ అరంకో, అద్నాక్‌ల తరహాలో సింగరేణికి కూడ జాతి విశాల ప్రయోజనాల దృష్ట్యా బొగ్గు గనులు కేటాయించాలి. తద్వారా మాత్రమే ఆత్మనిర్భర్ భారత్, వికసిత భారత్ సుసాధ్యమవుతాయి.

సౌదీ అరంకో–సింగరేణి

సహజ వనరు అయిన ఖనిజ సంపదను సద్వినియోగం చేస్తే జాతి దిశ, దశ పురోగమన శీలమవుతాయి. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న గల్ఫ్ దేశాలే ఇందుకు ఒక చక్కటి ఉదాహరణ. వాటి సహజ సంపద అయిన చమురు నిక్షేపాలు పూర్తిగా ప్రభుత్వాల యాజమాన్యం, అజమాయిషీలో ఉండడం వల్లే ఆ దేశాల పురోగతి సాధ్యమయింది. ఒకప్పుడు తినడానికి తిండి లేక అలమటించిన ఈ ఎడారి దేశాలు ప్రైవేట్ రంగానికి పెద్ద పీటం వేయడం ద్వారా సంపూర్ణ స్వేచ్ఛా విపణి విధానాన్ని పాటిస్తున్నాయి. అయితే సహజ వనరుల విషయానికి వచ్చే సరికి గల్ఫ్ రాజ్యాల రాచరిక పాలకులు ఆ సంపదపై ప్రభుత్వ నియంత్రణను పూర్తిగా కొనసాగిస్తూ తమ ప్రజలకు ఉజ్వల భవిష్యత్తును నిర్మిస్తున్నారు. అనేక సంక్షోభాలు, సవాళ్ల మధ్య కూడ చమురు ఉత్పాదక దేశాలు పురోగమనిస్తున్నాయి. కారణమేమిటి? ఆ దేశాల ప్రభుత్వ రంగ సంస్థల చిత్తశుద్ధి, సహజ వనరుల కేటాయింపు తీరు తెన్నులే ఒక ప్రధాన కారణమని చెప్పవచ్చు. ప్రభుత్వ రంగంలోని సౌదీ అరంకో, అద్నాక్, ఖతర్ ఎనర్జీ మొదలైన సంస్థలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ముఖ్య భూమిక వహించే స్థాయికి ఎదగడానికి చమురు, సహజ వాయువు నిక్షేపాలపై ప్రభుత్వాలకు పూర్తి అధిపత్యం ఉండడమేనని నిస్సంకోచంగా చెప్పి తీరాలి.

గల్ఫ్ దేశాలకు చమురు నిక్షేపాల తరహాలో భారత్‌కు అపార ఖనిజ సంపద దేవుడిచ్చిన వరమే. అయితే అపరిమిత ఖనిజ సంపద ఉన్నా పేదరికం తాండవించడం దేశ దౌర్భాగ్యం. బొగ్గు నిల్వలు అత్యధికంగా ఉన్న జార్ఖండ్ ఒక పేద రాష్ట్రం. తెలుగునాట గోదావరి పరివాహక ప్రాంతాలలో బొగ్గు సమృద్ధిగా ఉన్నా అటు ఇల్లెందు నుంచి ఇటు తాడిచెర్ల వరకు ఉన్న గ్రామాలు పట్టణాలు కూడా వెనుకబడిన పేద ప్రాంతాలనే విషయాన్ని విస్మరించరాదు.

గల్ఫ్ లేఖ

ఇక ఖనిజాలను శుద్ధి చేసి ఉత్పత్తి చేసే ప్రభుత్వరంగ సంస్థలను సాక్షాత్తు పాలకులే వ్యూహాత్మకంగా బలహీనపర్చడం ఒక విచిత్ర విషాదం. దేశంలో నాణ్యమైన ఉక్కును ఉత్పత్తి చేస్తూ టాటా స్టీల్‌తో పోటీ పడే విశాఖ ఉక్కు కర్మాగారానికి గనులు కేటాయించకుండా దెబ్బతీస్తున్న విధానాన్ని మనం చూస్తున్నాం.

దేశ పారిశ్రామిక, విద్యుదుత్పత్తి రంగాలకు వెన్నుదన్నుగా ఉన్న బొగ్గు విషయాన్నే చూడండి. జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిషా రాష్ట్రాలలోని పరిస్థితులనూ గమనించండి. బిహార్ లోని కోల్ బెల్ట్ ప్రాంతమైన ధన్‌బాద్ లోని దయనీయ పరిస్థితుల ఆధారంగా నిర్మించిన హిందీ సూపర్ హిట్ సినిమా 'కాల పథ్థర్ (1979)లో అమితాబచ్చన్, శశికపూర్, శత్రుఘ్న సిన్హాలను ఒక్కసారి గుర్తు చేసుకుంటే కళ్లు ఆర్ద్రమవుతాయి. ఆ రకమైన దుర్భర పరిస్థితుల నుంచి కోలుకుంటూ క్రమంగా పురోగమనంలో పయనిస్తున్న ప్రభుత్వ రంగ బొగ్గు సంస్థలకు తాజాగా శ్రీకారం చుట్టిన గనుల వేలం విధానం అశనిపాతమే అవుతుందనడంలో సందేహం లేదు.



సింగరేణి సంస్థ తెలంగాణ కొంగు బంగారం. తెలంగాణ శ్రామిక జీవన జీవనాడి అయిన ఈ సంస్థ, గనుల వేలం విధానం మూలంగా క్రమేణా ఉనికి కోల్పోయి ముున్ముందు ఒక దివాళా సంస్థగా మిగిలిపోయే ప్రమాదం ఎంతైనా ఉన్నది. తెలుగునాట సింగరేణి కానీ ఈశాన్య రాష్ట్రాలలో కోల్ ఇండియా, దాని అనుబంధ సంస్థలు గానీ బొగ్గు ఉత్పత్తి ద్వారా దేశ విద్యుదుత్పాదనలో కీలక పాత్ర వహిస్తున్నాయి. మరోవైపు ప్రైవేటు రంగాన్ని సైతం ఆదుకుంటున్నాయి. 2013లో 565 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి కాగా 2023లో 893 మిలియన్ టన్నులకు పెరిగింది. ప్రభుత్వ రంగ సంస్థలు కాబట్టి ప్రజాహితాన్ని కాంక్షిస్తాయి. అందుకే బహిరంగ విపణి విధానంలో కాకుండా జాతి సేవా దృక్పథంతో అవి బొగ్గును విక్రయిస్తున్నాయి. పైగా అడుగడుగునా రాజకీయ జోక్యం కారణాన ఈ ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేటు రంగం తరహాలో కేవలం లాభాల బాటలో మాత్రమే పయనించలేవు. ప్రధాని నరేంద్ర మోదీ గొప్పగా వర్ణించే ఆత్మనిర్భర్ భారత్‌కు ఈ బొగ్గు గనులు నిలువెత్తు సాక్ష్యం. దురదృష్టవశాత్తు కేంద్ర ప్రభుత్వమే వాటిని నిర్వీర్యం చేస్తోంది. పశ్చిమ బెంగాల్‌లో రెండు ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రం బొగ్గు గనుల వేలంలో పాల్గొనకుండా చేయడం ద్వారా ఆ రాష్ట్రంలో విద్యుదుత్పత్తి సంస్థలు ప్రైవేటు కంపెనీలను ఆశ్రయించవల్సిన అవసరాన్ని కేంద్రం సృష్టించింది.

సంపన్న పాశ్చాత్య దేశాలలో పర్యావరణ కాలుష్యం సమస్యకు బొగ్గు ఒక కారణంగా ఉన్నది. భారత్‌లో ఇప్పటికీ ఆ నల్ల బంగారం ఒక ప్రధాన ఇంధన వనరు. విద్యుదుత్పత్తికి అవసరమైన ముడి పదార్థం. పన్నులు వగైరా కారణాన దేశీయ బొగ్గు కంటె విదేశీ దిగుమతి బొగ్గు ధర చౌకగా ఉండడాన్ని కూడ గమనించాలి. దేశ విద్యుత్ ఉత్పత్తి వ్యవస్థ ప్రైవేటీకరణ జరుగుతుండగా ఆ రంగంలో అదానీ సంస్థ అనూహ్యంగా దూసుకెళ్తుంది. విదేశీ బొగ్గుతో పాటు ఖతర్ సహజ వాయువు దిగుమతిలో కూడ అదానీ సంస్థదే సింహ భాగం. ఈ నేపథ్యంలో సింగరేణికి బొగ్గు గనుల కేటాయింపు విషయం ప్రాధాన్యత సంతరించుకొంటోంది. అంతా చట్ట ప్రకారమే అంటున్న కేంద్ర ప్రభుత్వం అదే చట్టంలో సింగరేణి తరహా సంస్థలకు రిజర్వేషన్ విధానంలో గనులను కేటాయించే వెసులుబాటు ఉన్నదనే వియాన్ని విస్మరిస్తోంది, ఉపేక్షిస్తోంది. పూర్తిగా మౌనం వహించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఒక సంస్థ మనుగడ లేదా అందులో పని చేసే ఉద్యోగుల భవిష్యత్తుకు సంబంధించిన విషయంగా కాకుండా సగటు పౌరుడికి అవసరమైన విద్యుత్ కోణం నుంచి సింగరేణికి గనుల కేటాయింపు విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. సౌదీ అరంకో, అద్నాక్‌ల తరహాలో సింగరేణికి కూడ జాతి ప్రయోజనాల దృష్ట్యా బొగ్గు గనులు కేటాయించాలి. తద్వారా మాత్రమే ఆత్మనిర్భర్ భారత్, వికసిత భారత్ సుసాధ్యమవుతాయి.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

కొత్త పార్లమెంట్ చరిత్ర సృష్టిస్తుందా?



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

'ఓహ్, నీవు నన్ను ఓడించావు కదా!' అని ఒడిషా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తనకు అసెంబ్లీలో నమస్కరించిన లక్ష్మణ్ బాగ్ అనే ఎమ్మెల్యేకు ప్రతి నమస్కారం చేస్తూ చిరునవ్వు నవ్వారు. రెండు నియోజకవర్గాల్లో పోటీ చేసి, ఒక నియోజకవర్గంలో కేవలం 4,700 ఓట్లతో గెలిచిన నవీన్ పట్నాయక్ ఇటీవల అసెంబ్లీలో ప్రవేశించినప్పుడు అధికార పార్టీ ఎమ్మెల్యేలు అవహేళన చేయలేదు. పైగా ముఖ్యమంత్రితో సహా ఎమ్మెల్యేలందరూ లేచి నిలబడి పట్నాయక్‌ను గౌరవపూర్వకంగా ఆహ్వానించారు. పార్లమెంటరీ ఉత్తమ సంప్రదాయాల్ని ఈ దృశ్యం అద్భుతంగా ప్రతిఫలించింది.

అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఇలాంటి సత్సంబంధాలు నెలకొనాలంటే ఇరు వర్గాలు పరస్పరం పార్లమెంటరీ సంప్రదాయాలను అనుసరించాలి. జాతీయ స్థాయిలో గత కొన్నేళ్లుగా ఉభయ పక్షాలు ఈ సంప్రదాయాలకు తిలోదకాలిస్తున్నాయి. 17వ లోక్‌సభలో అనేక అవాంఛనీయమైన సంఘటనలు చోటు చేసుకున్నాయి. అది పార్లమెంటరీ ప్రమాణాల క్షీణతను తారస్థాయిలో ప్రతిఫలించింది. ప్రతిపక్షాలు లేవనెత్తిన కొన్ని అంశాలకు పార్లమెంట్‌లో ప్రతిస్పందించేందుకు ప్రభుత్వం నిరాకరించడం, దాన్ని కారణంగా తీసుకుని అసలు సభలే నిర్వహించకుండా రోజుల తరబడి ప్రతిపక్షాలు స్తంభింపచేయడం... చివరకు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 143 మంది ఎంపీలను ప్రభుత్వం సస్పెండ్ చేయించడం 17వ లోక్‌సభలో పార్లమెంటరీ ప్రమాణాలను ప్రశ్నార్థకం చేసింది. పార్లమెంట్‌లో ఎవరు గౌరవం కోల్పోవడానికి ఎవరు కారణమయ్యారు అనే చర్చను పక్కన పెడితే, ఇరు వర్గాలు పరస్పర గౌరవం కోల్పోయినప్పుడే ఇలాంటి పరిస్థితులు తలెత్తుతాయన్న విషయంలో సందేహం లేదు. తత్ఫలితంగా లేబర్ కోడ్ వంటి అనేక ముఖ్యమైన బిల్లులు చర్చలు లేకుండా ఆమోదమయ్యాయి. పార్లమెంట్ చరిత్రలో మొదటిసారిగా 17వ లోక్‌సభ సమావేశాలు అతి తక్కువ రోజులు జరిగాయి. బడ్జెట్ ప్రతిపాదనలపై కూడా కూలంకషంగా చర్చలు జరగలేదు. ప్రజల జీవితాలపై ప్రభావం చూపించే ఆర్థిక నిర్ణయాలు చర్చకు నోచుకోలేదు. స్థాయీ సంఘాలకు నివేదించకుండానే నూటికి 90 శాతం బిల్లులను ఆమోదించారు. దీనితో సమావేశాల పట్ల ప్రజాప్రతినిధులకే ఆసక్తి తగ్గిపోయింది. ప్రెస్ గ్యాలరీ కూడా దాదాపు ఖాళీగా కనిపించేది. శాసన, అధికార, న్యాయవ్యవస్థల్లో అధికార వ్యవస్థ చాలా శక్తిమంతమైనది. మిగతా రెండు వ్యవస్థలు తమ అస్తిత్వాన్ని, ప్రాధాన్యాన్ని నిరూపించుకోకపోతే అధికార వ్యవస్థ ఆధిపత్యాన్ని అంగీకరించినట్టవుతుందన్న విషయంలో సందేహం లేదు. అందువల్ల ఈ మూడు వ్యవస్థలూ సమతుల్యం పాటించి పరస్పర ప్రాధాన్యాన్ని గుర్తించినట్లయితే ప్రజాస్వామ్యం ఆరోగ్యకరంగా, జవాబుదారీతనంతో పరిఢవిల్లుతుంది. తద్వారా వ్యవస్థల పట్ల ప్రజల గౌరవం కూడా పెరుగుతుంది.

18వ లోక్‌సభ కాలంలో కూడా గత సమావేశాల నాటి సంక్లిష్ట పరిస్థితులు పునరావృతం అవుతాయా అన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. పార్లమెంట్‌లో ఎవరి సంఖ్యాబలం ఎంత మేరకు ఉన్నదో అన్న అంశంతో నిమిత్తం లేకుండా పార్లమెంటరీ సంప్రదాయాలను పాటించడం నేతల వ్యవహార శైలిని బట్టి ఆధారపడి ఉంటుంది. 1957లో లోక్‌సభలో జనసంఘ్‌కు నలుగురే సభ్యులు ఉండేవారు. అయినప్పటికీ ఆ పార్టీ నేత అటల్ బిహారీ వాజపేయి చివరి వరుసలో నిలబడి విదేశాంగ విధానంపై అనర్గళంగా మాట్లాడిన తర్వాత ప్రధానమంత్రి నెహ్రూ ఆయనను అభినందించారు. 'మీకు దేశ ప్రధాని అయ్యే లక్షణాలున్నాయి' అని వ్యాఖ్యానించారు. ఇప్పుడా పరస్పర గౌరవాలు మృగ్యమయి పోయాయి.

ఆశ్చర్యకరమేమంటే 18వ లోక్‌సభలో వాతావరణం చూస్తుంటే అధికార కూటమి శిబిరంలో కంటే ప్రతిపక్ష కూటమిలో విజయోత్సాహాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఎన్డీఏ కూటమి కంటే దాదాపు 60 సీట్లు తగ్గినప్పటికీ బిజెపి మెజారిటీని బాగా తగ్గించామని ప్రతిపక్ష నేతల్లో ఆనందం కనిపిస్తోంది. గత లోక్‌సభలో కంటే అధికంగా సీట్లను దక్కించుకోవడమే ఈ సంతోషానికి కారణం కావచ్చు. ఈ రకంగా పార్లమెంట్‌లో రెండు గెలిచిన పార్టీలు కనిపిస్తున్నాయి.

అధికారంలోకి రాలేకపోయినా గెలిచామనుకోవడమంత అల్పసంతోషం మరొకటి లేదు. ఈ సంతోషంతోనే ప్రతిపక్షాలు మరింత సంఘటితమవుతున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో బిజెపి సీట్లను తగ్గించిన కాంగ్రెస్ నేత రాహుల్, సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ పక్కపక్కనే కూర్చోవడం, మొదటి రోజు నుంచే ఇండియా కూటమి పార్టీలన్నీ సమిష్టిగా నిర్ణయాలు తీసుకోవడం విస్మరించదగిన పరిణామం కాదు. ప్రమాణ స్వీకారం నాటి నుంచే కలిసికట్టుగా కార్యాచరణ నిర్ణయించుకోవడం, రాజ్యాంగ ప్రతితో ఊరేగింపు నిర్వహించడం, ప్రొటెమ్ స్పీకర్ అభ్యర్థిని తీవ్రంగా వ్యతిరేకించడం, డిప్యూటీ స్పీకర్ పదవిని తమకు కేటాయిస్తేనే స్పీకర్ పదవి విషయంలో అధికార కూటమికి మద్దతు నిస్తామని ప్రకటించడం ప్రతిపక్షాల సంఘటిత వైఖరిని స్పష్టం చేస్తోంది. ప్రశ్నపత్రాల లీక్ వల్ల యుజిసి నెట్ పరీక్షలు రద్దు కావడం, లక్షలాది మంది అభ్యర్థులు రాసే నీట్ పేపర్లు లీక్ కావడం వంటి పరిణామాలన్నీ ప్రతిపక్షాలకు ఆయుధాలుగా మారాయి. ఈ రీత్యా ప్రతి అంశంపై ఇకనుంచి ప్రతిపక్షాలు విభేదించి అధికార పార్టీని ఆత్మరక్షణలో పడవేసేందుకు ప్రయత్నించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ రీత్యా 18వ లోక్‌సభలో కూడా గత సమావేశాల్లో కంటే తీవ్రంగా సంఘర్షణాయుత వాతావరణం కనపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. వయనాడులో రాహుల్ గాంధీ ఖాళీ చేసిన సీటులో ప్రియాంక కూడా గెలిచి వస్తే లోక్‌సభలో ఈ ఇద్దరు అన్నాచెల్లెళ్ల దాడిని ఎదుర్కొనేందుకు బిజెపి, మిత్రపక్షాలు సిద్ధపడాల్సి ఉంటుంది. గత సమావేశాల్లో బహిష్కృతురాలైన తృణమూల్ కాంగ్రెస్ ఎంపి మహువా మొయిత్రా మళ్లీ గెలిచి సభలో అడుగుపెట్టారు. ఎన్డీఏతో పోలిస్తే ప్రతిపక్ష శిబిరంలోనే అద్భుత వక్తలు ఉన్నారు. వారిని ఎదుర్కొనే వక్తలను ఎన్డీఏ సిద్ధం చేయవలసి ఉంటుంది.

17వ లోక్‌సభతో పోలిస్తే 18వ లోక్‌సభలో తొలిసారి పార్లమెంట్‌లో అడుగుపెట్టిన ఎంపీలు ఎక్కువ మంది ఉన్నారు. బిజెపిలో 45 శాతం కొత్త ఎంపీలైతే, కాంగ్రెస్‌లో 60 శాతం కొత్త ఎంపీలే. తెలుగుదేశం, సమాజ్‌వాది పార్టీ, ఎన్‌సిపిల్లో కూడా మూడింట నాలుగోవంతు కొత్తవారే. దాదాపు 50 శాతం లోక్‌సభ ప్రక్షాళనం అయినట్లు కనిపిస్తోంది. సభలో తమ ప్రత్యేకత నిలబెట్టుకోవాలని కొత్త ఎంపీలు ఆశిస్తున్నారు. అతి సామాన్య నేపథ్యం నుంచి వచ్చిన కలిశెట్టి అప్పల్నాయుడు సైకిల్‌పై పార్లమెంట్‌కు వచ్చి తన ప్రత్యేకత నిరూపించుకున్నారు. మాజీ కేంద్ర మంత్రి సుష్మాస్వరాజ్ కూతురు బాన్సురీ స్వరాజ్ నుంచి యూపీ దళిత నేత చంద్రశేఖర్ ఆజాద్ వరకూ ఒక రకమైన వైవిధ్యం ఈసారి లోక్‌సభలో కనిపిస్తోంది.



> మంచికో, చెడుకో ఇవాళ దేశ ప్రజలు రెండు కూటముల వైపే మొగ్గు చూపారు. ఎన్డీఏ కూటమి, ఇండియా కూటమిలో భాగం కాని పార్టీలను ప్రజలు దాదాపు తిరస్కరించారు. బిఆర్ఎస్, వైసీపీ, బిజెడి తదితర పార్టీల ఎంపీలు 18 మంది మాత్రమే ఉండగా మిగతా 525 మంది ఏదో ఒక కూటమికి చెందిన వారే. ఎవరు ఒప్పుకోకపోయినా భారత దేశం రెండు రాజకీయ శిబిరాల మధ్య విభజితమైంది. ఈ విభజన కేవలం రాజకీయాలకే పరిమితం కాదని, అభివృద్ధి నుంచి ప్రజాసమస్యల వరకూ అవలంబించాల్సిన సైద్ధాంతిక దృక్పథానికి సంబంధించినదేని స్పష్టం.

అయితే ఎంత వైవిధ్యం, ఎంత యువరక్తం ఉన్నా పార్లమెంట్‌లో సరైన చర్చలు జరగనంతవరకూ వాటి ప్రాధాన్యత ఏమీ ఉండదు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానం, బడ్జెట్ నుంచి కీలక బిల్లులు, స్వల్పవ్యవధి చర్చల వరకు ఒకరిపై మరొకరు దుమ్మెత్తి పోసుకోకుండా తమ అభిప్రాయాలను విస్పష్టంగా చెప్పే ఎంపీల కోసం దేశం ఎదురు చూస్తోంది. దేశం ఎదుర్కొనే సమస్యలను చర్చించాలంటే ఎంపీలు ముందుగా వాటిని లోతుగా అధ్యయనం చేయాలి. ఒక దృక్కోణం, దృక్పథం లేకుండా ఏ అంశంపై నైనా అలవోకగా ఊకదంపుడు ఉపన్యాసాలు చేసే వారు చాలా మంది ఉన్నారు. అయితే సభను ఆకట్టుకునే విధంగా విషయ పరిజ్ఞానంతో మాట్లాడేవారు తక్కువ. 17వ లోక్‌సభలో అత్యధిక తెలుగు ఎంపీలు తమ ఉనికిని నిరూపించుకోలేకపోయారన్నది వాస్తవం.

18వ లోక్‌సభలో నిరక్షరాస్యులు ఎవరూ లేరు. అత్యధిక సంఖ్యలో గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు ఉన్నారు. వృత్తిపరమైన డిగ్రీలు సాధించిన వారు, డాక్టరేట్లు, న్యాయవాదులు, సినీ కళారంగానికి చెందినవారు దాదాపు వంద మందికి పైగా ఉన్నారు. వందమంది వ్యాపారస్తులు కూడా ఉన్నారు. వీరందరి ప్రతిభను సరిగా ఉపయోగించుకోవాలంటే సభలో వారికి మాట్లాడే అవకాశం కల్పించాలి. మంత్రిత్వ శాఖలకు చెందిన స్థాయీ సంఘాల్లో వారిని చేర్చి మొక్కుబడిగా కాకుండా చైతన్యవంతంగా ప్రతి బిల్లును క్షుణ్ణంగా పరిశీలించేలా చూడాలి. న్యాయవ్యవస్థలో అత్యున్నత స్థాయిలో తీర్పు చెప్పగలిగేది సుప్రీంకోర్టు అయితే శాసన వ్యవస్థలో అత్యున్నత స్థాయిలో చర్చలు జరిపి ప్రజల భవిష్యత్తును నిర్ణయించగలిగే వేదిక పార్లమెంట్ మాత్రమే.

దురదృష్టకరమైన విషయం ఏమంటే పార్లమెంట్‌లో దేశ ప్రయోజనకరమైన అంశాలపై కంటే రాజకీయాలకు ఎక్కువ ప్రాధాన్యం లభిస్తోంది. 18వ లోక్‌సభలో రాజకీయాలను పక్కన పెట్టి దేశం ఎదుర్కొనే సమస్యలపై చర్చ జరిగేలా చూడాలి. మంచికో, చెడుకో ఇవాళ దేశ ప్రజలు రెండు కూటముల వైపే మొగ్గు చూపారు. ఎన్డీఏ కూటమి, ఇండియా కూటమిలో భాగం కాని పార్టీలను ప్రజలు దాదాపు తిరస్కరించారు. బిఆర్ఎస్, వైసీపీ, బిజెడి తదితర పార్టీలకు చెందినవారు కేవలం 18 మంది మాత్రమే ఉండగా మిగతా 525 మంది ఏదో ఒక కూటమికి చెందినవారే. ఎవరు ఒప్పుకోకపోయినా భారతదేశం రెండు రాజకీయ శిబిరాల మధ్య విభజితమైంది. ఈ విభజన కేవలం రాజకీయాలకే పరిమితం కాదని, అభివృద్ధి నుంచి ప్రజా సమస్యల వరకూ అవలంబించాల్సిన సైద్ధాంతిక దృక్పథానికి కూడా సంబంధించిందని భావించవలసి ఉంటుంది. ప్రస్తుత పార్లమెంట్‌లో రెండు వేర్వేరు సైద్ధాంతిక శిబిరాల అభిప్రాయాల బలమైన వ్యక్తీకరణకే కాని వ్యక్తుల ప్రాధాన్యతకు అంత తావు ఉండకూడదన్న స్పృహ ఇరు వర్గాలకు ఉండాలి. అప్పుడే పార్లమెంట్‌లో చర్చలు రసవత్తరంగా, అర్థవంతంగా మారుతాయి.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

'నీట్'తో నష్టపోతున్న రాష్ట్ర విద్యార్థులు

వైద్య విద్య ప్రవేశాల విధానంలో మార్పులు చేస్తూ 2010 డిసెంబర్ 21న అప్పటి కేంద్ర ప్రభుత్వం నేతృత్వంలోని 'మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ప్రకారం.. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (కామన్ ఎంట్రెన్స్ టెస్ట్)ను నిర్వహిస్తామని ప్రకటించింది. అయితే, 2011లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోదీ ఈ విధానాన్ని వ్యతిరేకించారు. ఇదిలా ఉంటే 2013, 2016 మధ్య నీట్ పరీక్షా విధానాన్ని తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, యూపీ, ఉమ్మడి జమ్మూకశ్మీర్ ప్రభుత్వాలు వ్యతిరేకిస్తూ సుప్రీం కోర్టును ఆశ్రయించాయి. రాష్ట్రాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను 'నీట్' పరీక్షా విధానం కాలరాస్తుందని ఆయా ప్రభుత్వాలు వాదించాయి. దేశవ్యాప్తంగా ఒకే పరీక్ష, విద్యార్థులకు సమాన అవకాశాలు, సీబీఎస్‌ఈ సిలబస్, 13 ప్రాంతీయ భాషల్లో నిర్వహిస్తుండటం వంటి సానుకూల అంశాలను కారణంగా చూపెట్టి దేశంలోని రాష్ట్రాలన్నీ 'నీట్'లో జాయిన్ కావాలని సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. 2017కు ముందు వైద్య అర్హత పరీక్షను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా నిర్వహించినా, ఆ తర్వాత 'ఆల్ ఇండియా పూల్' ద్వారా మన వైద్య విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతాయన్న సుప్రీం కోర్టు, కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనలతో 'నీట్'లో జాయిన్ కావాల్సి వచ్చింది. 2017 సంవత్సరం నుంచి మన విద్యార్థులు నీట్ పరీక్షను రాస్తూ వస్తున్నారు.

తాజాగా నీట్‌లో అవకతవకలు, అక్రమాలు జరిగాయని దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వైద్య కోర్సులో సీటు దక్కించుకోవాలనే లక్ష్యంతో ఎంతో కష్టపడ్డ విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఇదిలా ఉంటే 2024 నీట్ పరీక్షలో భాగంగా మన రాష్ట్రం నుంచి 1.40 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. ఉత్తరాది రాష్ట్రాలైన హర్యానా, గుజరాత్, బీహార్, జార్ఖండ్, మహారాష్ట్రలలో జరిగిన అవకతవకలకు తెలంగాణ విద్యార్థులు ఎందుకు బలి కావాలనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. నీట్ పరీక్ష ద్వారా మన విద్యార్థులకు లాభం జరగడం పక్కన పెడితే నష్టాలే ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో 'ఆల్ ఇండియా పూల్' నుంచి తెలంగాణ బయటకువచ్చి, మళ్లీ మన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా అర్హత పరీక్షను నిర్వహించాలనే ప్రతిపాదనలు వెల్లువెత్తుతున్నాయి.

రాష్ట్రంలో మొత్తం 54 వైద్య కళాశాలలుంటే, అందులో ప్రభుత్వ వైద్య కళాశాలలు 27 ఉన్నాయి. మొత్తం కళాశాలల్లో 8,265 సీట్లుండగా, ప్రభుత్వ సీట్లు 3,815 మాత్రమే. అయితే వీటిలో 15 శాతం సీట్లు 'ఆల్ ఇండియా పూల్' కోటా కిందికి వర్తిస్తాయి. ఈ కోటా కారణంగా మన తెలంగాణ విద్యార్థులు ఏటా 519 వైద్య సీట్లను కోల్పోవాల్సి వస్తున్నది. రాష్ట్రంలో మొత్తం 30 పీజీ వైద్య కళాశాలలుండగా అందులో ప్రభుత్వ కళాశాలలు 10 మాత్రమే ఉన్నాయి. మొత్తం కళాశాలల్లో 2,978 సీట్లుండగా, ప్రభుత్వ కళాశాలల్లోని సీట్లు 1,267 మాత్రమే. వీటిలో 50 శాతం సీట్లు 'ఆల్ ఇండియా పూల్' కోటా కిందికి వర్తిస్తాయి. ఈ కోటా కారణంగా మన రాష్ట్ర వైద్య విద్యార్థులు 621 సీట్లను కోల్పోతున్నారు.

2014 జూన్ 2 తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ అనంతరం రాష్ట్రంలో ఏర్పాటైన తొలి ప్రభుత్వం వైద్యరంగానికి పెద్దపీట వేసింది. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలనే లక్ష్యంతో ముందడుగు వేసింది. అందుకు సరిపడా వైద్యులను తయారుచేసుకోవాలనే దీర్ఘకాలిక వ్యూహంతో జిల్లాకో ప్రభుత్వ మెడికల్ కాలేజీని నిర్మించింది. అత్యాధునిక భవనాలతో కూడిన మెడికల్ కాలేజీలు నిర్మించడం, వాటిలో మౌలిక సదుపాయాల కల్పించడం, మహిళల భద్రత కోసం నగరాల్లో 'షీ' టీమ్స్‌ను ఏర్పాటుచేయడం కారణంగా భద్రతా రీత్యా తెలంగాణ రాష్ట్రం దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే ముందున్నది. ఈ కారణంగా ఇతర రాష్ట్రాల్లోని విద్యార్థులు ఇక్కడికి రావడానికి మొగ్గు చూపుతున్నారు కానీ, మన విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వెళ్లడానికి ఆసక్తి కనబరచడం లేదు. ఆల్ ఇండియా కోటాలో భాగంగా ఎంబీబీఎస్ సీట్లలో 15 శాతం, పీజీ సీట్లలో 50 శాతం ఇతర రాష్ట్రాల్లోని వైద్య విద్యార్థులకు కేటాయిస్తుండటం వల్ల మన వైద్య విద్యార్థులకు సరైన న్యాయం జరగడం లేదు. దీనికి తోడు లోకల్, నాన్‌లోకల్ సమస్య కూడా మన విద్యార్థులను వెంటాడుతున్నది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 371–డి ప్రకారం మన వైద్య విద్యార్థులు ఇతర రాష్ట్రాల్లో ఎంబీబీఎస్ పూర్తిచేస్తే మన రాష్ట్రంలో నాన్‌లోకల్‌గా పరిగణించబడుతున్నారు. దీంతో వేలాది వైద్య విద్యార్థులు డాక్టర్ కావాలనే తమ కలకు మధ్యలోనే ఫుల్‌స్టాప్ పెడుతున్నారు. ఇదిలా ఉంటే రాబోయే ఐదారేండ్లలో మన ప్రభుత్వ వైద్యకళాశాలల్లో పీజీ విద్యను బోధించేందుకుగాను అనుమతి లభించవచ్చని. ఒకవేళ తెలంగాణ రాష్ట్రం 'ఆల్ ఇండియా పూల్' నుంచి వైదొలగితే మన విద్యార్థులు పీజీ సీట్లను కూడా కోల్పోయే అవకాశాలున్నాయి. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం 'ఆల్ ఇండియా పూల్' నుంచి వైదొలగాలి.

'నీట్'లో తాజా అవకతవకలు, అక్రమాలు మన వైద్య విద్యార్థులను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. అందుకే నీట్‌ను రద్దుచేసి రాష్ట్రాలవారీగానే వైద్య అర్హత పరీక్షను నిర్వహించాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. అయితే తమిళనాడు ప్రభుత్వం అసెంబ్లీలో నీట్ వ్యతిరేక బిల్లును ప్రవేశపెట్టింది. కానీ ఆ బిల్లును ఆమోదించి రాష్ట్రపతికి పంపించాల్సిన గవర్నర్ నెలల తరబడి తన వద్దే ఉంచుకొని ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా వ్యవహరిస్తుండటం విచారకరం. ప్రతి రాష్ట్ర ప్రభుత్వం నీట్‌ను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో బిల్లులను ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకోవాలె. అప్పుడే నీట్ గండం నుంచి విద్యార్థులు బయటపడే ఆస్కారం ఉంటుంది. 'నీట్'లో ఇన్ని అవకతవకలు జరుగుతున్నా, దేశవ్యాప్తంగా గందరగోళ పరిస్థితులు ఏర్పడుతున్నా ప్రధాని మోదీ ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తుండటం అత్యంత గర్హనీయం. బర్లలో స్కాం, గొర్లలో అవినీతి అంటూ ఊ అంటే వాలిపోయే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టోరేట్ (ఈడీ) నీట్ కుంభకోణంపై పల్లెత్తు మాట కూడా మాట్లడకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది.

నీట్‌లో తాజా అక్రమాలను పరిగణనలోకి తీసుకున్నట్టయితే నీట్ పరీక్షా విధానం వల్ల ఉత్తరాది వైద్య విద్యార్థులకే లాభం చేకూరుతున్నదని, దక్షిణాది విద్యార్థులు నష్టపోతున్నారనే ఆరోపణలున్నాయి. హర్యానాలో ఒక పరీక్షా కేంద్రంలో ఆరుగురు విద్యార్థులకు 720 మార్కులు రావడం ఆ ఆరోపణలకు బలాన్ని చేకూరుస్తున్నాయి. కాబట్టి నీట్ విషయంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలి. ఒక కమిషన్ నియమించి 'నీట్'పై సమగ్ర అధ్యయనం జరిపించాలి. గత ప్రభుత్వ చొరవ వల్ల వైద్య విద్యార్థుల కోసం రాష్ట్రంలో అన్ని వసతులు మెరుగయ్యాయి. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా వైద్య అర్హత పరీక్షను నిర్వహిస్తామని సుప్రీం కోర్టుకు విన్నవించుకోవాలి. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం 2016 నాటి సుప్రీం కోర్టు ఆదేశాలను సవరించాలని డిమాండ్ చేయాలి. ఆలస్యం చేయకుండా నీట్ నుంచి వెంటనే బయటికి వచ్చి మన వైద్య విద్యార్థులకు సంపూర్ణంగా న్యాయం జరిగేట్టుగా చొరవ తీసుకోవాలి. అందుకుగాను సుప్రీం కోర్టు జోక్యం తప్పనిసరి.

> బీఆర్ఎస్ ప్రభుత్వ చొరవ వల్ల వైద్య విద్యార్థులకు రాష్ట్రంలో అన్ని వసతులు మెరుగయ్యాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా వైద్య అర్హత పరీక్షను నిర్వహిస్తామని సుప్రీం కోర్టుకు విన్నవించుకోవాలి. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం 2016 నాటి సుప్రీం కోర్టు ఆదేశాలను సవరించాలని డిమాండ్ చేయాలి. ఆలస్యం చేయకుండా నీట్ నుంచి వెంటనే బయటికి వచ్చి మన వైద్య విద్యార్థులకు సంపూర్ణంగా న్యాయం జరిగేట్టుగా చొరవ తీసుకోవాలి.



◆ బోయినపల్లి వినోద్‌కుమార్
మాజీ ఎంపీ, సీనియర్ న్యాయవాది

పాతికేళ్ళుగా పెరగని పెన్షన్

దేశానికి ఇంధనం, విద్యుత్తు అందించడం కోసం బొగ్గు గనుల గుహలలో పనిచేయడానికి ముందుకు వచ్చారు కార్మికులు. విద్యుత్ కాంతులు వలే తమ బ్రతుకు కూడా వైభవంగా ఉంటుందని, రిటైర్ అయిన తర్వాత ప్రశాంతంగా జీవనం గడుస్తుందని ఆశించారు. కానీ ఆ ఆశలు అడియాశలయ్యాయి. ఎప్పుడో 1998లో రూపొందించిన పెన్షన్ పథకం ద్వారా ఉద్యోగ విరమణ చేసిన చివరి నెల జీతంపై 25 శాతం పెన్షన్ ఇస్తున్నారు. దీని ప్రకారం దాదాపు లక్షలాది మంది ఇప్పటికీ 2000 రూపాయలు లోపు పెన్షన్ మాత్రమే పొందుతున్నారు. వివిధ రాష్ట్రాలలో సంక్షేమ పెన్షన్లు దాదాపు నాలుగు వేల రూపాయలు ఇస్తున్నారు. కానీ 30–35 సంవత్సరాలు పనిచేసిన బొగ్గు ఉద్యోగులు అత్యంత తక్కువ పెన్షన్ పొందుతున్నారు. ఇది విచిత్రమైన పరిస్థితి. అసలు బొగ్గు గనులలో ఎందుకు ఉద్యోగం చేశామా? అని వీరు బాధ పడుతున్నారు. దాదాపు ప్రతి రంగంలో మొదట నిర్ణయించిన పథకాలు, నియమనిబంధనలు ప్రస్తుత అవసరాలు బట్టి సవరిస్తున్నారు, కానీ బొగ్గు గనుల పెన్షన్ పథకాన్ని 25 సంవత్సరాలు గడిచినా ఇప్పటివరకు సవరించకపోవడం బాధాకరం. ఈ విషయంలో బొగ్గు కార్యదర్శి, కోల్ ఇండియా ఛైర్మన్, సీఎంపిఎఫ్ కమిషనర్, కేంద్ర ప్రభుత్వం లోని ఉన్నతాధికారులు... ఇది ఒక సమస్య కానట్టు ప్రవర్తిస్తున్నారు. మా దీన స్థితిని వివరిస్తూ పెన్షన్‌ను పెంచమని రాష్ట్రపతి, ప్రధానమంత్రి, బొగ్గు గనుల శాఖ మంత్రికి, అన్ని పార్టీల పార్లమెంట్ సభ్యులకు, శాసనసభ్యులకు ఎన్నోసార్లు విజ్ఞప్తి చేశాం. ఫలితం లేదు. పలుమార్లు ఆందోళనలు, ధర్నాలు నిర్వహించినా ప్రయోజనం లేదు. బొగ్గు గనుల శాఖ మంత్రిగా నియమితులైన కిషన్ రెడ్డి మా పరిస్థితిని అర్థం చేసుకుని ప్రధానమంత్రితో సత్వరమే చర్చించి పెన్షన్ పెంచేలా కృషిచేయాలని కోరుతున్నాం.

– దండంరాజు రాంచందర్ రావు

'నీట్'పై అనుమానాలు నివృత్తిచేయాలి

ప్రతిసారి విద్యార్థులతో 'పరీక్షా పే చర్చా' కార్యక్రమాన్ని నిర్వహించే ప్రధాని నరేంద్ర మోదీ కీలకమైన నీట్ పరీక్షపై ఆరోపణలు, అనుమానాలు, ఆందోళనలు వ్యక్తమవుతున్న సందర్భంలో మాట్లాడకపోవడం విద్యార్థుల పట్ల ఆయనకున్న చిత్తశుద్ధిని తెలియజేస్తోంది. నీట్ పరీక్ష మాత్రమే కాక... ఎన్నో పోటీ పరీక్షలను ఎన్టీఏ ఆధ్వర్యంలోనే నిర్వహిస్తున్నారు. తాజాగా బయటపడ్డ వివాదాస్పద అంశాల కారణంగా ఆ సంస్థపై విద్యార్థులు నమ్మకం కోల్పోయే పరిస్థితి వచ్చింది. ప్రతిసారి ఉత్తరాది రాష్ట్రాల విద్యార్థులకు ఎక్కువగా ర్యాంక్‌లు రావడం, దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులకు తక్కువ ర్యాంకులు రావడంపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు, దక్షిణాది రాష్ట్రాల ప్రజలకు అనేక అనుమానాలు కలుగుతున్నాయి. ఈ మొత్తం వ్యవహారంపై మోదీ, తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి మౌనం వీడి, సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, విద్యార్థులకు, తల్లిదండ్రులకు భరోసానివ్వాలి. తక్షణమే ప్రధాని స్పందించి మొత్తం అవకతవకలకు బాధ్యులెవరన్నది దేశ ప్రజలకు వివరించి, విద్యార్థులకు బహిరంగ క్షమాపణలు చెప్పాలి. ఎన్టీఏ పాత్రపై అత్యున్నత దర్యాప్తు సంస్థతో సమగ్ర విచారణ జరిపించి పేపర్ లీకేజీలకు పాల్పడిన వారితో పాటు అక్రమంగా లబ్ధిపొందిన వారిపై చర్యలు తీసుకోవాలి. నీట్‌లో జరిగిన అక్రమాల కారణంగా కష్టపడి చదివిన రాష్ట్ర విద్యార్థులకు ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి.

– గడ్డం శ్యామ్, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు



డెంగీ.. కలవరం!

- 'నాలుగు వేరియంట్ల' వార్తలతో జనం బెంబేలు
- ఉమ్మడి జిల్లాలో గతేడాది 821 పాజిటివ్ కేసుల నమోదు
- ఈ ఏడాది ఇప్పటి వరకు వంద కేసులు వెలుగులోకి!

7

ముంపు ముప్పు తప్పదా?

20ఏళ్లుగా వర్షాలతో వరంగల్ మహానగర ప్రజల నరకయాతన



హనుమకొండ నగరంలో నాలా ప్రవాహం

- 2004 నుంచి ఏటా మునుగుతున్న నగర లోతట్టు ప్రాంతాలు
- నగరంలో రూ.250 కోట్లతోచేపట్టిన ఆధునీకరణ పనుల్లో జాప్యం
- నాలాల విస్తరణతో పాటు వంతెనల పనుల నత్తనడక
- బొంది వాగు, నాలాల ఆక్రమణలతో కాలనీల్లోకి వరద నీరు
- అండర్ డ్రైయినేజీలతోనే ముంపునకు శాశ్వత పరిష్కారం
- 28న నగర అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

వానాకాలం వస్తే చాలు వరంగల్ మహానగరం వణికిపోతుంది. రోడ్లన్నీ జలమయమై.. గంటల తరబడి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. రోజుల తరబడి లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు వరద నీటిలో బిక్కు బిక్కుమంటూ ప్రాణాలు అర చేతిలో పెట్టుకుని బతుకుజీవుడా అంటూ గడుపాల్సిన దుస్థితి. 20 ఏళ్లుగా అదే కథ.. అదే వ్యథ.. ప్రభుత్వాలు మారుతున్నా వరంగల్ నగర రాత మాత్రం మారటం లేదు. నగరాన్ని పట్టి పీడిస్తున్న ప్రధాన సమస్యల్లో ఒకటైన డ్రెయినేజీ వ్యవస్థలో మార్పు రావడం లేదు. ఆక్రమణలతో బక్కచిక్కిపోతున్న నాలాల నుంచి వరద నీరు కాలనీల్లోకి చేరి ముంపు భయం సృష్టిస్తోంది. 30ఏళ్లుగా మురిపిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ప్రతిపాదనలు పట్టాలెక్కటం లేదు. ఈనెల 28న నగరానికి వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి వరద ముంపు, టీయూఎఫ్ఐడీసీ ద్వారా కేటాయించిన రూ.250కోట్ల పనులపై సమీక్షతో పాటు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీకి నిధులు కేటాయిస్తారనే ఆశతో నగర ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారు.

20ఏళ్లుగా వరద వ్యథ..

సుమారు 11లక్షలకు పైగా జనాభా, 1,200లకు పైగా కాలనీలతో వరంగల్ మహానగరం ట్రైసిటీగా విస్తరిస్తోంది. ఈ మహానగరం పరిధిలో ఒక ఎంపీ, ఐదుగురు ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే 2004 నుంచి వరదలతో విలవిలలాడుతున్న వరంగల్ మహానగరం రాతను ప్రభుత్వాలు మార్చలేకపోతున్నాయని నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 20 ఏళ్ల కాలంలో అనేక ప్రభుత్వాలు మారినా నగర రూపురేఖలు మార్చేంత అభివృద్ధిని చేయలేదనే చర్చ జరుగుతోంది. ఎంతో మంది మంత్రులుగా పని చేసిన నగరంలోని వరద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించలేదనే విమర్శలున్నాయి. ఈ 20 ఏళ్ల కాలంలో నగరం చాలా విస్తరించింది. సుమారు 500కు పైగా కొత్త కాలనీలు ఏర్పడ్డాయి. లోతట్టు ప్రాంతాల్లో సీపీఐ, సీపీఎం పార్టీల ఆధ్వర్యంలో పేదల కోసం గుడిసెలు వేసిన ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం జరిగింది. అయితే నగరం విస్తరించినంత వేగంగా అభివృద్ధి జరగలేదనే చర్చ జరుగుతోంది. ఫలితంగానే వానాకాలం వస్తే చాలు నగరం నీట మునిగిపోవాల్సి వస్తోందనే చర్చ జరుగుతోంది. గతేడాది జూలై, ఆగస్టులో కురిసిన వర్షాలకు వరంగల్ నగరం జలమయమైంది. అనేక కాలనీలు నీట మునగటంతో నాటు పడవలతో లోతట్టు ప్రాంత ప్రజలను రక్షించాల్సి వచ్చింది. మళ్లీ వర్షాకాలం వస్తుండటంతో నగరవాసులను నాటి వరద దృశ్యాలు కలవరపెడుతున్నాయి.

ఆక్రమణలో నాలాలు.. కాలనీల్లోకి వరద

నగరం ముంపునకు ప్రధాన కారణం నాలాల ఆక్రమణ అనే అభిప్రాయాలున్నాయి. విచ్చల విడిగా నాలాలను ఆక్రమించి దర్జాగా భవనాల నిర్మాణం చేస్తున్నా కార్పొరేషన్ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. గతంలో అధికార పార్టీ నేతల అండ.. కార్పొరేషన్ అధికారుల సహకారంతో వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రైసిటీలో చాలామంది నాలాలను ఆక్రమించుకుని నిర్మాణాలు చేశారు. ఇళ్లే కాకుండా.. కాలేజీలు, ఫామ్‌హౌస్‌లు, వ్యాపార సముదాయాల నిర్మాణం చేపట్టారు. వరంగల్‌లోని ఉర్సు, హంటర్‌రోడ్డు నుంచి ములుగు రోడ్డులోని అలంకార్ మీదుగా పెద్దమ్మగడ్డ, అక్షర కాలనీల నుంచి వెళ్లే బొందివాగుతో పాటు హనుమకొండలోని నయీం నగర్, సమ్మయ్య నగర్, బొక్కల గడ్డ తదితర ప్రాంతాల నుంచి వెళ్లే ప్రధాన నాలాల వెంట ఆక్రమణ నిర్మాణాలు భారీగా జరిగినట్టు ఆరోపణలున్నాయి. ఈ అక్రమ కట్టడాలను కార్పొరేషన్ అధికారులు గుర్తించినా అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో గతంలో వెనక్కి తగ్గినట్టు ప్రచారం జరిగింది. దీంతో వరద నీటిని దర్జాగా బయటకు తీసుకెళ్లాల్సిన నాలాలు ఆక్రమణలతో బక్కచిక్కి పోయాయి. ఫలితంగా వరద నీరు కాలనీల్లోకి చేరుతోంది. ప్రతీ ఏటా వరంగల్‌లోని కొత్తవాడ, ఆటోనగర్, దేశాయిపేట, కాశీబుగ్గ, ఎల్‌బీ నగర్, ఎనుమాములు, శివనగర్, రామన్నపేట, ఉర్సు, కరీమబాద్, హంటర్ రోడ్డులోని ఎన్‌టీఆర్ నగర్, సాయినగర్, సంతోషి మాత కాలనీ, బృందావన్ కాలనీ, డీకే నగర్, గిరిప్రసాద్, బీఆర్ నగర్, హనుమకొండలోని ప్రశాంత్ నగర్, సమ్మయ్యనగర్,

మిగతా 8వ పేజీలో..



వరంగల్‌లోని బొందివాగు



నయీంనగర్ వద్ద కొనసాగుతున్న వంతెన నిర్మాణం

సీఎం రేవంత్‌రెడ్డిపైనే ఆశలు

వరంగల్ నగరానికి అభివృద్ధి పనులను సమీక్షించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తొలిసారి నగరానికి వస్తున్నారు. 28వ తేదీ శుక్రవారం ఆయన వరంగల్ జిల్లాలోని మెగా టెక్స్‌టైల్ పార్కును పరిశీలించటంతో పాటు నగర అభివృద్ధిపై కలెక్టరేట్‌లో సమీక్షించనున్నారు. గత ఏప్రిల్ 24న మడికొండలో జరిగిన జనజాతర సభలో సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా వరంగల్‌కు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో పాటు ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, నాగరాజు, ఎంపీ కడియం కావ్య తదితరులు భూగర్భ డ్రెయినేజీ విషయంలో ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. ఈ నేపథ్యంలో 30ఏళ్లుగా ఎదురుచూస్తున్న అండర్ డ్రెయినేజీ విధానాన్ని సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటనలో మోక్షం లభిస్తుందనే నగర ప్రజలు ఆశతో ఉన్నారు.




ప్రమాణ స్వీకారం చేస్తున్న వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ సభ్యులు డాక్టర్ కడియం కావ్య, బలరాం నాయక్

పార్లమెంట్‌లో ఎంపీల ప్రమాణ స్వీకారం

హనుమకొండ సిటీ / మహబూబాబాద్ (ఆంధ్రజ్యోతి), జూన్ 25 : వరంగల్, మహబూబాబాద్ ఎంపీలుగా ఇటీవల ఎన్నికైన డాక్టర్ కడియం కావ్య, పోరిక బలరాం నాయక్ మంగళవారం పార్లమెంట్ భవన్‌లో ప్రమాణస్వీకారం చేశారు. తొలి రోజైన సోమవారం రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ప్రమాణం చేయగా.. రెండోరోజైన మంగళవారం మిగిలిన 15 మంది ఎంపీలు ప్రమాణస్వీకారం చేశారు. వారిలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, పోరిక బలరాంనాయక్ ఉండగా వారితో లోక్‌సభ ప్రొటెం స్పీకర్ ప్రమాణస్వీకారం చేయించారు. అయితే వీరిద్దరూ తెలుగులోనే ప్రమాణస్వీకారం చేశారు. రాజ్యాంగ పుస్తకాన్ని చేతిలో పట్టుకున్న కడియం కావ్య.. 'డాక్టర్ కడియం కావ్య అనే నేను' అంటూ ప్రారంభించి 'జై భీమ్.. జై భద్రకాళి.. సేవ్ కానిస్టిట్యూషన్' అంటూ ప్రమాణాన్ని ముగించారు. ఆ తర్వాత ఆ పుస్తకాన్ని ప్రదర్శిస్తూ తన సీటు వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో ఆమె కాంగ్రెస్ అగ్రనేత ఎంపీ రాహుల్ గాంధీ, ఇతర పెద్దల ఆశీర్వాదం తీసుకున్నారు. ఇక ఎంపీ బలరాంనాయక్ 'జై దుర్గాభవానీ.. జై తెలంగాణ' అంటూ ప్రమాణస్వీకారాన్ని ముగించారు.

కాళోజీ కళాక్షేత్రం పనుల్లో వేగం పెంచండి

- 'కుడా' వైస్ చైర్మన్ అశ్విని తానాజీ వాకడే



పనులను పరిశీలిస్తున్న వీసీ, అధికారులు

వరంగల్ కార్పొరేషన్, జూన్ 25 : హనుమకొండలో నిర్మిస్తున్న కాళోజీ కళాక్షేత్రం పనుల్లో వేగం పెంచాలని బల్దియా కమిషనర్, కుడా వైస్ చైర్మన్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. మంగళవారం కాళోజీ కళాక్షేత్రంతో పాటు ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఐ)ని సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. కళాక్షేత్రం పనులు ఇప్పటికే 80 శాతం వరకు పనులు పూర్తి కావడం జరిగిందని, మిగతా ఫినిషింగ్ పనులు ఆగస్టు 31 లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇంకా ఇన్నర్ రింగురోడ్డు పనులు ఇప్పటి వరకు 70 శాతం పూర్తయ్యాయని, ఇంకా వివాదంలో ఉన్న స్థలాలు యజమానులతో మాట్లాడి త్వరగా సమస్య పరిష్కరించాలన్నారు. ఐఆర్ఆర్ ప్యాచ్ వర్క్‌లను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కుడా సీపీవో అజీత్‌రెడ్డి, ఈఈ భీంరావులతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళాభివృద్ధిపై దృష్టి సారించాలి

- అంగన్‌వాడీ కేంద్రాల్లో కొత్త సిలబస్ ప్రవేశపెడుతున్నాం
- రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కమిషనర్ వాకాటి కరుణ



వాకాటి కరుణ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 25 : మహిళాభివృద్ధి, శిశు సంక్షేమంపై దృష్టి సారించాలని రాష్ట్ర మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ కమిషనర్, సెక్రటరీ వాకాటి కరుణ అన్నారు. మంగళవారం రాత్రి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత జిల్లా సంక్షేమ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వాకాటి కరుణ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో కొత్త సిలబస్ ప్రవేశపెడుతున్నామని, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు యూనిఫామ్స్ అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రాన్ని మోడల్ కేంద్రంగా ఉండేలా అన్ని వసతులు కల్పించాల న్నారు. రాష్ట్రవ్యాప్తంగా చాలా మంది పిల్లలు పౌష్టికాహారలోపంతో ఉన్నారని, ఆయా జిల్లాల అంగన్‌వాడీ కేంద్రాల్లోని లబ్ధి పొందే పిల్లలకు ఎత్తు బరువు క్రమంగా నిర్వహించి పౌష్టికాహారలోపం లేకుండా చూడాలన్నారు. సదరం సర్టిఫికెట్ కోసం ప్రతీ నెల క్యాంపులు నిర్వహించాలని, సంబంధిత శాఖాధికారులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. వయోవృద్ధుల సమస్యల సత్వర పరిష్కారం కోసం మీ సేవా పోర్టల్‌లో అప్లోడ్ చేసేలా, పరిష్కారం కోసం ట్రిబ్యునల్ చర్యలు తీసుకునేలా జిల్లాలోని బాలల సంరక్షణ కేంద్రాలను, వయోవృద్ధుల సంరక్షణ కేంద్రాలను కనీసం నెలకు ఒక్కసారైనా కలెక్టర్, జిల్లా అధికారులు సందర్శించాలని సూచించారు.

కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. మహిళాభివృద్ధి శిశు సంక్షేమంతోపాటు దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమం కోసం అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలన్నారు. అన్ని విభాగాలకు సంబంధించిన పూర్తి నివేదికలను ఈ శనివారం వరకు అందజేయాలని జిల్లా సంక్షేమాధికారిని ఆదేశించారు. అన్ని విభాగాల వారితో కలిపి ఒక వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సత్వర చర్యలు తీసుకునేలా చూడాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, జిల్లా సంక్షేమ అధికారి మధురిమ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న జూనియర్ డాక్టర్లు

కొనసాగుతున్న జూడాల సమ్మె

- రెండో రోజు కేఎంసీ నుంచి ఎంజీఎం వరకు ర్యాలీ
- డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మె విరమించేది లేదని వెల్లడి

వరంగల్ మెడికల్, జూన్ 25 : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జూనియర్ డాక్టర్లు ఓపీ విధులు బహిష్కరించి చేపడుతున్న నిరసన మంగళవారం రెండవ రోజుకు చేరుకుంది. కేఎంసీ నుంచి ఎంజీఎం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్స్ శ్రీనాథ్, అజయ్‌లు మాట్లాడుతూ ప్రభుత్వంతో జరిపిన చర్చలు అసంతృప్తిగా ముగియడంతో సమ్మె కొనసాగించడం జరుగు తుందన్నారు. స్టైఫండ్స్ విద్యార్థుల సమస్యలతోపాటు ఉస్మానియా ఆస్పత్రి భవన నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలకు సంబంధించిన ఎనిమిది ప్రధాన డిమాండ్లతో సమ్మె కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కేఎంసీ అంతర్గత రహదారులు అధ్వానంగా ఉండడంతో గత వారం రోజుల క్రితం ఓ విద్యార్థినికి జరిగిన ప్రమాదాన్ని మరువక ముందే మరో విద్యార్థికి గాయాలు అయినట్లు పేర్కొన్నారు. అంతర్గత రహదారుల మరమ్మతులకు నిధులు మంజూరు అయినట్లు చెబుతున్న అధికారులు పనులు ప్రారంభించకపోవడంలో అంతర్యం అర్థంకావడం లేదన్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించకపోతే అత్యవసర సేవలు సైతం బంద్ చేస్తామని వారు తెలిపారు.

మంగళవారం ఉష్ణోగ్రత
గరిష్ఠం : 35.0°C
కనిష్ఠం : 25.5°C

అందరూ.. ఇన్‌చార్జ్‌లే!



సర్కారు విద్యాసంస్థల్లో చేరికలను పెంచడంతో పాటు మెరుగైన విద్యాబోధన, వసతుల కల్పన లాంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని, కార్పొరేట్ స్థాయిలో విద్యాబోధనకు చర్యలు చేపడుతున్నామని పాలకులు చెబుతున్న మాటలు.. మాటలుగానే మిగులుతున్నాయి. ప్రభుత్వ బడుల్లో విద్యాప్రమాణాలను నిత్యం పర్యవేక్షించాల్సిన అధికారుల నియామకం విషయంలో చేస్తున్న నిర్లక్ష్యం కారణంగా లక్ష్యం నీరుగారిపోతోంది. మండలాల వారీగా ఉండాల్సిన పూర్తిస్థాయి విద్యాశాఖ అధికారుల స్థానంలో గెజిటెడ్ హెచ్ఎంలకే ఆ బాధ్యతలు అప్పగిస్తుండటం.. అది కూడా ఒక్కొక్కరికి మూడు నుంచి ఆరు మండలాల పర్యవేక్షణ బాధ్యతలు ఇస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఓ వైపు అసలు బాధ్యతలు.. మరోవైపు అదనపు విధులతో వారు పర్యవేక్షణలో అవస్థలు పడుతున్నారని, ఫలితంగా సర్కారు విద్యావ్యవస్థ కుంటుపడుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 21మందికి 78మండలాల బాధ్యతలు
- ఎంఈవోలుగా అదనపు బాధ్యతల్లో ప్రధానోపాధ్యాయులు
- బదిలీపై ఇతర జిల్లాలకు వెళ్లినా.. వారే కొనసాగుతున్న దుస్థితి
- పని ఒత్తిడితో కొరవడిన పర్యవేక్షణ
- కుంటుపడుతున్న విద్యావ్యవస్థ


మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 25 : కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా సర్కారు బడుల్లో విద్యాప్రమాణాలను పెంచుతున్నామని, సర్కారు విద్యావ్యవస్థను పటిష్టం చేసేందుకు విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నామని పాలకులు చెబుతున్నా.. క్షేత్రస్థాయి పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. విద్యాశాఖలో నూతన నియామకాలు లేక పర్యవేక్షణ కొరవడుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రెగ్యులర్ మండల విద్యాశాఖాధికారులు (ఎంఈవో)లు లేకపోవడంతో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులే ఇన్‌చార్జ్ ఎంఈవోలుగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో ఒకవైపు పని ఒత్తిడి, మరోవైపు పాఠశాలల్లో అదనపు బాధ్యతలతో వారు విధుల నిర్వహణలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 78 మండలాలుండగా ఒక్క రెగ్యులర్ ఎంఈవో కూడా లేరంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇక మొత్తంగా 21మంది హెచ్ఎంలు ఆయా మండలాలకు ఇన్‌చార్జ్ ఎంఈవోలుగా కొనసాగడం గమనార్హం.

జిల్లాల వారీగా ఇలా..

ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విధులు నిర్వహించే గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు ఇన్‌చార్జ్ ఎంఈవోలుగా అదనపు బాధ్యతలు అప్పజెప్పడంతో వివిధ ఫైళ్లపై సంతకాలు పెట్టడానికి కూడా సమయం సరిపోవడంలేదని వాపోతున్నారు. మహబూబాబాద్ జిల్లాలో 18 మండలాలకు ముగ్గురు, వరంగల్ జిల్లాలో 13 మండలాలకు నలుగురు, హన్మకొండ జిల్లాలో 14 మండలాలకు నలుగురు, జనగామ జిల్లాలో 12 మండలాలకు ఇద్దరు, భూపాలపల్లిలో 12 మండలాలకు ఇద్దరు, ములుగు జిల్లాలో 9 మండలాలకు ఆరుగురు ఇలా 78 మండలాలకు 21 మంది ఇన్‌చార్జ్ ఎంఈవోలుగా విధులు నిర్వహిస్తున్నారు.

పేరుకే బదిలీ.. విధులు యథాతథం..

ఎంఈవోల బదిలీలు కూడ ఒక ప్రహసనంగానే మారుతోంది. పేరుకే బదిలీ.. అవుతున్నా.. విధులు మాత్రం యథావిధిగా అవే మండలాల్లో కొనసాగుతున్నాయి. గతేడాది సెప్టెంబరు నెలలో జరిగిన బదిలీల్లో మహబూబాబాద్ జిల్లా నుంచి ముగ్గురు, జనగామ జిల్లాలో ఇద్దరితో పాటు మిగతా జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న కొంత మంది ఎంఈవోలను ఇతర జిల్లాలకు బదిలీచేశారు. అయినప్పటికి వారు పాత జిల్లాల్లోనే మండల విద్యాధికారులుగా విధులు నిర్వహిస్తుండటం విశేషం. అంతేకాకుండా జిల్లాల పునర్విభజన తర్వాత ఏర్పడిన మండలాలకు పాత మండలాల నుంచే ఎంఈవోలు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. సర్వశిక్షా అభియాన్ ద్వారా అమలవుతున్న కార్యక్రమాల పర్యవేక్షణ, స్కూల్ కాంప్లెక్స్ నిర్వహణ ఎంఈవోల ప్రధాన విధులు. పాఠశాలల్లో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తూనే ఇతర మండలాలకు విద్యాధికారిగా పర్యవేక్షణ చేస్తున్నారు. దీంతో విరామం లేకుండా పనిచేయడంతో ఒత్తిడికి లోనవుతున్నారు. పని చేస్తున్న ఒక మండలానికి వారానికి ఒక రోజు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందని, మండలంలో జరిగే ప్రత్యేక సమావేశాలకు మాత్రమే హాజరుకావాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం పర్యవేక్షణ, ఉపాధ్యాయుల అవసరాల రీత్యా అందుబాటులో ఉండకపోవడం, బియ్యాన్ని గోదాముల నుంచి పాఠశాలలకు తరలించేందుకు తీవ్ర ఒత్తిడికి లోనుకావాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు.





లింగనిర్ధారణ, గర్భస్రావాలు చేస్తున్న ముఠా అరెస్టు

ముఠా నుంచి స్కానింగ్ మిషన్ స్వాధీనం

వివరాలు వెల్లడించిన హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

హనుమకొండ టౌన్, జూన్ 25 : ఎలాంటి అనుమతులు లేకుండా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, గర్భస్రావాలకు పాల్పడుతున్న ముఠా ను హనుమకొండ పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు హనుమకొండ ఏసీసీ దేవేందర్‌రెడ్డి మంగళవారం సాయంత్రం హనుమకొండ పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. కుమార్‌పల్లికి చెందిన జంగా రాజమణి ఓ మహిళకు లింగనిర్ధారణ పరీక్షలు చేయాలని హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో గతంలో నర్సుగా పనిచేసిన కాజీపేట మండలం కడిపికొండకు చెందిన బస్కె స్రవంతిని ఆశ్రయించింది. అక్రమంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న ములుగుజిల్లా పత్తిప ల్లికి చెందిన కాశిరాజు దీలిప్ సహకారంతో వేయి స్తంభాల ఆలయం సమీపంలోని ఓ ఏరియాలో బాధిత మహిళకు లింగనిర్ధారణ పరీక్షలు చేయ గా అమ్మాయిగా నిర్ధారణ అయింది. దీంతో గర్భస్రావం చేయించాలని రాజమణి స్రవంతిని కోరడంతో కాశిబుగ్గలోని ఓ ప్రేవేట్ ఆసుపత్రిలోని ల్యాబ్‌టెక్నీషియన్‌గా పనిచేస్తున్న ఏకుల నరేశ్ అనే వ్యక్తి నుంచి గర్భస్రావం అయ్యేందుకు మాత్రలు తీసుకొని బాధిత మహిళకు అందజేశారు. టాబ్లెట్స్ వేసుకున్న బాధిత మహిళకు ఆరోగ్యం క్షిణించడంతో మహిళను చికిత్స కోసం హనుమకొండలోని ఓ ఆసుపత్రిలో చేర్పించి అక్కడి నుంచి తప్పించుకున్నారు. జరిగిన వి షయం బాధిత మహిళ వైద్యురాలికి తెలపడంతో జిల్లా వైద్యాధికారికి సదరు వైద్యురాలు సమాచారం చేరవేసింది. వైద్యాధికారి ఇచ్చిన ఫిర్యాదుతో హనుమకొండ పోలీసులు దర్యాప్తు చేపట్టి గర్భస్రావాలకు పాల్పడుతున్న ముఠా సభ్యులను ఆదుపులోకి తీసుకొని నిందితుల నుంచి స్కానింగ్ మిషన్, 3 సెల్‌ఫోన్‌లు, ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. కాగా, నిందితురాలు స్రవంతి గతంలో ఇదే తరహాలో గర్భస్రావాలకు పాల్పడటంతో ఇంతేజార్‌గంజ్ పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ ఇన్స్‌పెక్టర్ సతీష్, ఎస్సై శ్రావణ్, సిబ్బంది పాల్గొన్నారు.







ఇళ్ల మధ్యలో గెస్ట్‌హౌస్?

రాత్రి సమయాల్లో డీజేల మోతలు

గ్రీవెన్స్‌లో కమిషనర్‌కు ఎల్బీనగర్ కాలనీ వాసుల ఫిర్యాదు

ఇంటి పేరిట అనుమతులు.. చాపకింద నీరులా కమర్షియల్ బిజినెస్

పోలీసులకు ఫిర్యాదు చేసిన బల్దియా అధికారులు

నిర్వాహకుడికి నోటీసులు జారీ



గెస్ట్‌హస్ మూసివేయాలని నిరసన తెలుపుతున్న స్థానికులు, ఇళ్ల మధ్యలో గెస్ట్‌హౌస్ నిర్వహిస్తున్న భవనం

వరంగల్ కార్పొరేషన్, జూన్ 25 : నిత్యం ప్రజల పలకరింపులు, రాకపోకల నడుమ ఉండే ప్రదేశం కలుషితంగా మారింది. ప్రజలు నివసించే ఇళ్ల మధ్య ఓ గెస్ట్‌హౌస్ హఠాత్తుగా పుట్టుకొచ్చింది. ఎలాంటి అనుమతులు లేకుండా త్రిబుల్ బెడ్ రూం ఇంటిని గెస్ట్ హౌస్‌గా మార్చి విందులు, వి నోదాలకు అప్పగించడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతే కాకుండా రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో కాలనీవాసులు ముందుగా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోక పోవడంతో ఏకంగా నగర పాలక సంస్థ కమిషనర్‌కు సోమవారం గ్రీవెన్‌సెల్‌లో కలిసి ఫిర్యాదు చేశారు. గెస్ట్‌హౌస్‌కు అనుమతులు ఎవరు ఇచ్చారు ? ఏలాంటి అనుమతులు ఇచ్చారు ? ఇంటి కోసమా లేక లాడ్జీ కోసం అనుమతులు ఇచ్చారా ? అని వి నతి పత్రం ఇచ్చారు. రంగంలోకి దిగిన బల్దియా అధికారులు పూర్తి వి వరాలు సేకరించి ఇంతేజార్‌గంజ్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. బాధితులు, పోలీసులు, మున్సిపల్ అధికారులు తెలిసిన వివరాల ప్రకారం.. గ్రేటర్ వరంగల్ 21వ డివిజన్ ఎల్బీనగర్ సమీపంలోని టెలికాం కాలనీలో ఎమ్డీ అయూబ్ అనే వ్యక్తి ఇంటిని గెస్ట్‌హౌస్‌గా మార్చారు. ఈ ఇంటికి బల్దియా నుంచి ఇంటికి హౌస్ పర్పస్‌గా అనుమతులు పొందాడు. అప్పటి జీడబ్ల్యుఎంసీ అధికారులు ఇంటి నెంబర్ 11-23-1171 జారీ చేశారు. ఇంటి నిర్వాహకుడు ప్రస్తుతం దుబాయ్‌లో ఉంటుండగా అతడి సోదరుడు ఇంటి నిర్వహణ చూసుకుంటు అద్దెలు వసూలు చేస్తున్నాడు. గతంలో ఈ ఇంటిని పైన, కింద రెండు అంతస్తులు కలిపి కుటుంబాలకు అద్దెకు ఇచ్చే వారు. కానీ యజ మానికి డబ్బు ఆశ కలిగి ఇంటిని ఒక్క సారిగా గెస్ట్ హౌస్‌గా మార్చారని చెబుతున్నారు. డబుల్ బెడ్‌రూం ఇంటిని కమర్షియల్ బిజినెస్ చేస్తూ నాలుగు రాళ్ల వెనకేసుకునే ప్రయత్నం చేశారు. గత మూడు మాసాలుగా గెట్ టూ గెదర్ పార్టీలకు, మీటింగులకు, అద్దెకు ఇస్తున్నట్టు ప్రచారం జరిగింది. శుభకార్యాలు లేని రోజు రాత్రి సమయాల్లో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి అసాంఘిక కార్యకలాపాలుకు పాల్పడూ పెద్దగా అరుపులు, కేకలతో కునుకు లేకుండా చేస్తున్నారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు.

రాత్రి సమయాల్లో నిద్ర పోనివ్వరు!

ఇంటిని రాత్రి సమయాల్లో గెస్ట్‌హౌస్‌గా మార్చుతున్నారు. ప్రతీ రోజు దావత్‌లు, డీజేలు పెట్టి డ్యాన్స్‌లు చేస్తూ చుట్టుపక్కల వారికి నిద్ర లేకుండా చేస్తున్నారు. ఇదేమిటి? అని అడిగిన వారిపై దురుసుగా ప్రవర్తించడంతో పాటు దుర్భాషలాడుతున్నట్టు స్థానికులు వెల్లడించారు. రోజుకు రూ. 10 వేలు అద్దె ఇస్తే ఏదైనా చేసుకోవచ్చని అన్ని తాము చూసుకుంటామని నిర్వాహకులు హామీ ఇవ్వడంతో మూడు మాసాలుగా ఆ ఇంటిలో అసాంఘికం పెచ్చు మీరుతుందని స్థానికులు చెప్పారు.

గ్రీవెన్స్‌లో కాలనీవాసుల ఫిర్యాదు..

నగర నడి ఒడ్డున కాశిబుగ్గ ప్రాంతంలో అక్రమ గెస్ట్‌హౌస్ నిర్వహణపై స్థానిక టెలికం కాలనీ ప్రజలు బల్దియా గ్రీవెన్స్‌లో కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే కమిషనర్ పూర్తిస్థాయిలో విచారణ జరిపి తగిన చర్యలు చేపట్టాలని పబ్లిక్ హెల్త్ సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేష్‌ను ఆదేశించారు. నేరుగా సీఎంహెచ్‌వో రంగంలోకి దిగి సంబంధిత అధికారులు, సిబ్బందితో కలిసి దర్యాప్తు చేశారు. ప్రస్తుతం ఏఎస్ గెస్ట్‌హౌస్ నడుస్తున్న ఇంటికి రెసిడెన్సియల్ అనుమతి ఉందని ఇంకా ట్రేడ్‌లైసెన్స్, కమర్షియల్ నిర్వహణకు సంబంధించిన ఏలాంటి అనుమతులు లేవని గుర్తించారు. నిర్వాహకునికి నోటీసులు జారీ చేయాలని శానిటరి సిబ్బందిని సీహెంహెచ్‌వో ఆదేశించారు. నిర్వాహన నిలిపివేయాలని లేదంటే ఇంటి అనుమతులు రద్దు చేసి సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇండ్ల మధ్యలో గెస్ట్‌హౌస్ నిర్వహిస్తూ అక్రమ దందా సాగిస్తునట్టు, వెంటనే నిలిపి వేయించాలని సీఎంహెచ్‌వో రాజేష్ మంగళవారం ఇంతెజర్‌గంజ్ పోలీ సులకు ఫిర్యాదు చేశారు. నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించినట్టు తెలిపారు.

గెస్ట్‌హౌస్ తీయించండి

ఇళ్ల మధ్యలో మూడు మాసాల క్రితం గెస్ట్‌హౌస్ ఏర్పాటు చేసి రాత్రి సమయాల్లో డీజేలు, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో మాదిరిగానే డబుల్‌బెడ్ రూం ఇల్లును కుటుంబాలు నివసించేందుకు అద్దెకు ఇస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని కాలనీ వాసులు అంటున్నారు. మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి గెస్ట్‌హౌస్ ముందు నిరసనకు దిగారు. నిర్వాహకునికి డబ్బు, రాజకీయ అండదండలతో ఇదంతా చేస్తున్నాడని ఆరోపిస్తున్నారు. పోలీసులు స్పందించి చర్యలు చేపట్టకపోతే సీపీని కలిసి ఫిర్యాదు చేస్తామని కాలనీవాసులు హెచ్చరిస్తున్నారు.


రైతులకు సబ్సిడీపై డ్రిప్ పరికరాలు

అర్హులైన వారి నుంచి దరఖాస్తుల స్వీకరణ

బాలసముద్రం, జూన్ 25: ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం సబ్సిడీలో డ్రిప్ అందిస్తుందని జిల్లా పట్టు, ఉద్యాన వన శాఖ అధి కారి సుద్దాల శంకర్ మంగళవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పాం, ఇతర ఉద్యానవన పంటల రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. గతంలో పండ్ల తోటలు, కూరగాయలు, మామిడి, మిరప, పలు రకాల పంటలు సాగు చేస్తున్న రైతులకు సబ్సిడీ ద్వారా డ్రిప్ పరికరాలు గతంలో అందక పోవడంతో సొంత డబ్బులతో ఏర్పాటు చేసుకోవడంతో రైతులకు రుణభారం కలిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీ, ఎస్సీ, ఎస్టీ రైతు లకు 100 శాతం సబ్సిడీ, పెద్ద రైతులకు 80 శాతం సబ్సిడీపై డ్రిప్ పరికరాలను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వివిధ కూరగాయలు, పండ్ల తోటలు, ఆయిల్ పాం సాగు చేస్తున్న రైతులు మీ సేవల ద్వారా పట్టా పాసు బుక్, ఆధార్‌కార్డుతో దరఖాస్తు చేసిన రసీదుతో పాటు బ్యాంకు డీడీలు సదర్ కార్యాలయంలో అందించాలని తెలిపారు. దరఖాస్తులు చేసుకున్న 15 రోజులలో రైతులకు సబ్సిడీ సంబంధించిన డ్రిప్ మంజూరు చేయడం జరుగు తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు.

డెంగీ.. కలవరం!

- 'నాలుగు వేరియంట్ల' వార్తలతో జనం బెంబేలు
- ఉమ్మడి జిల్లాలో గతేడాది 821 పాజిటివ్ కేసుల నమోదు
- ఈ ఏడాది ఇప్పటి వరకు 100 కేసులు వెలుగులోకి!



వరంగల్ మెడికల్, జూన్ 25 : వానాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలే కాలం. ముఖ్యంగా డెంగీ, మలేరియా లాంటి విష జ్వరాలు విజృంభించే కాలం. ప్రతీ ఏడు లాగే ఈ సారి కూడా డెంగీ, మలేరియా కేసులు ప్రజలను భయపెడుతున్నాయి. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పాజిటివ్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. గతంలో ఏజెన్సీకి పరిమితమైన దోమకాటు వ్యాధులు పట్టణీకరణ వాతావరణ మార్పులతో నగరాల్లోనూ విజృంభిస్తున్నాయి. రాష్ట్రానికి డెంగీ ముప్పు పొంచి ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేయడంతో పాటు డెంగ్యూ కారక నాలుగు వేరియంట్లు రాష్ట్రంలో కనిపిస్తున్నట్లు వైద్య వర్గాలు వెల్లడిస్తున్నాయి. డీఈఎన్‌వి 1, డీఈఎన్‌వీ 2, డీఈఎన్‌వీ 3, డీఈఎన్‌వీ 4 ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది. కొన్ని సార్లు రెండు మూడు వేరియంట్లు ఒకేసారి దాడి చేసే ప్రమాదం ఉన్నట్టు హెచ్చరించింది. ఫలితంగా డెంగీ బారిన పడినవారంతా తీవ్రమైన ఇబ్బందులు పడతారని తెలిపింది. ఈ వార్తల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఆస్పత్రిలో అవసరమైన కిట్లు, మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు 100కు పైగా డెంగీ పాజిటివ్ కేసులు నమోదైనట్టు గణాంకాల ద్వారా తెలుస్తోంది.

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుత పరిస్థితిలా..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డెంగీ పాజిటివ్ కేసులు నమోద వుతూనే ఉన్నాయి. గతేడాది జిల్లా వ్యాప్తంగా 93 మలేరియా పాజిటివ్ కేసులు, 821 డెంగీ పాజిటివ్ కేసులు నమోదయిన ట్టు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఏడాది జనవరిలో వరంగల్‌లో 12, హనుమకొండలో 6, ములుగు 5, మహబూబాబాద్ 2, భూపాలపల్లి 4 డెంగీ కేసులు నమోదయ్యాయి. ఫిబ్రవరి నెలలో వరంగల్‌లో 4, హనుమకొండలో 5, ములుగులో ఒకటి, జనగామలో 4, మహబూబాబాద్‌లో 5, భూపాలపల్లిలో ఒక కేసు నమోదైంది. మార్చిలో వరంగల్‌లో 6, హనుమకొండలో 3, ములుగులో 4, మహబూబాబాద్‌లో 4, భూపాలపల్లిలో 3 కేసులు వెలుగులోకి వచ్చాయి. ఏప్రిల్‌నెలలో వరంగల్‌లో 6, హనుమకొండ 2, మహబూబాబాద్ 2, భూపాలపల్లి 5, మే నెలలో వరంగల్‌లో 3, హనుమకొండలో 2, జనగామలో ఒకటి, మహబూబాబాద్ 2 నమోదయ్యాయి. జూన్‌లో ఇప్పటి వరకు వరంగల్‌లో 3, హనుమకొండలో 3, ములుగు, జనగామ ఒక్కొక్క కేసు, భూపాలపల్లిలో రెండు డెంగీ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి.

వైద్య పరీక్షలే కీలకం

డెంగీ నిర్ధారణలో వైద్య పరీక్షలే కీలకంగా మారాయి. ఐజీఎం పరీక్షలోనే కచ్చితత్వం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. కేవలం ప్లేట్‌లెట్ కౌంట్, డెంగీ స్ట్రిప్ టెస్ట్, సీరమ్ టెస్ట్ విధానంలో డెంగీని నిర్ధారించడం శాస్త్రీయం కాదని వైద్య ఆరోగ్యశాఖ స్పష్టం చేస్తోంది. ప్లేట్ లెట్ సంఖ్య 20వేల లోపు పడిపోతే ప్రమాదకరమని గుర్తించాలని 15వేల కన్నా తగ్గితే మరణాలు సంభవిస్తాయని వైద్యులు చెబుతున్నారు. డెంగీ జ్వరం వస్తే తీవ్రతలు తగ్గించేందుకు చల్లని నీటిలో మెత్తని వస్త్రం లేదంటే స్పాంజీని ముంచి శరీరాన్ని తుడవాలి. తక్షణ శక్తినిచ్చే పొడర్లు, పండ్ల రసాలు తాగించాలి. దీని వల్ల జ్వరతీవ్రత తగ్గి ప్లేట్‌లెట్స్ అదుపులోకి వస్తాయి. విధిగా ఫ్రైడేను ఫ్రైడేగా పాటించి పరిశుభ్రతను పాటించాలి. పగటిపూట దోమలు కుట్టకుండా చూసుకోవాలి. డెంగీ జ్వరం వచ్చిన వారిలో ఉన్నట్లుండి తీవ్ర జ్వరం, భరించలేని తలనొప్పి వస్తుంది. కళ్లు తెరవడం కూడా కష్టంగా ఉంటుంది. కదిపితే నొప్పి వస్తుంది. చర్మంపై దద్దర్లు అయినట్లు కనిపించడం, కీళ్లనొప్పులు, కండరాల నొప్పులు ఉంటాయి. అధిక దాహం రక్తపోటు పడిపోవడం ఉంటుంది. డెంగీని గుర్తిస్తే 80 శాతం వరకు ఎటువంటి ప్రమాదం లేకుండా చికిత్స పొందవచ్చని వైద్యులు చెబుతున్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో దోపిడీ

ప్రతీ సంవత్సరం సీజన్ జ్వరాలతో బాధపడే రోగులను ప్రైవేట్ ఆస్పత్రులు దోపిడీ చేస్తున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. డెంగీ విషయంలో సాధారణంగా ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకపోతే 20 వేల వరకు ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గిన నష్టం లేదని, అనారోగ్య సమస్యలు ఉన్నప్పుడు 50 వేల వరకు ప్లేట్లెట్లు తగ్గిన ఇబ్బంది లేదని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. చాలా కేసుల్లో సాధారణ జ్వరానికి చేసిన విధంగానే వైద్యం చేస్తే పరిపోతుందని అంటున్నారు. కానీ ప్రైవేట్ ఆస్పత్రులు 50 వేలకు పైగా ప్లేట్‌లెట్స్ ఉన్నప్పటికీ ఐసీయూలో ఉంచి ప్లేట్లెట్లు ఎక్కిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. నాలుగైదు రోజులు ఉంచుకొని రూ.50వేల నుంచి రూ.2లక్షల వరకు ఫీజు వసూలు చేస్తున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. సాధారణ రోగులకు అవసరం లేకున్నా ఆస్పత్రుల్లో ఉంచుకొని రూ. 30 నుంచి 50 వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నట్లు సైతం ఆరోపణలు ఉన్నాయి. తప్పుడు డెంగ్యూ రిపోర్టులతో, ప్లేట్‌లెట్స్ తగ్గిపోతున్నాయని భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు ఫిర్యాదులు ప్రభుత్వానికి చేరుతున్నాయి.

ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గినా ఆందోళన వద్దు

డాక్టర్ కె.వెంకట రమణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి. వరంగల్



ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గినా రోగులు ఆందోళన చెందవద్దు. 50వేల లోపు సంఖ్య తగ్గితే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం మేమంతా అప్రమత్తంగా ఉన్నాం. సరిపడా మందులు అందుబాటులో ఉన్నాయి. నిర్లక్ష్యం చేస్తేనే షాక్ సిండ్రోమ్‌లోకి వెళతారు. దోమతెరలు వాడాలి. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాం. నర్సంపేట, వరంగల్, వర్ధన్నపేటలను యూనిట్లుగా తీసుకొని కీటక జనిత వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టాం. దోమల నివారణకు ఉపయోగించే స్ప్రే అందుబాటులో ఉంది. ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నాం. పాజిటివ్ కేసులున్నచోట చుట్టుపక్కల ఉన్న 50 మంది నుంచి రక్త నమూనాలు సేకరిస్తున్నాం. ఎంజీఎం, నర్సంపేటలలో బ్లడ్ బ్యాంకులున్నాయి. కేఎంసీలోని వైరాలజీ ల్యాబ్‌లో ఎన్ఎస్ 1, ఐజీఎం డెంగీ నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ ల్యాబ్‌లలో మాత్రమే పరీక్షలు చేయించుకుంటే మంచిది.

నిట్‌తో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఎంవోయూ



ఎంవోయూ మార్చుకుంటున్న నిట్ డైరెక్టర్ సుబుధి, ఏఏఐ డైరెక్టర్ హజారీ, తదితరులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 25 : వరంగల్ జాతీయ సాంకేతిక సంస్థతో ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా సివిల్ ఏవియేషన్ రీసెర్చ్ ఆర్గనైజేషన్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. మంగళవారం నిట్ క్యాంపస్‌లో నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి, ఏఏఐ, బేగంపేట డైరెక్టర్ పీకే. హజారీలు ఎంవోయుపై సంతకాలు చేశారు. ఈ ఎంవోయూతో రెండు సంస్థల ఉద్యోగులు, విద్యార్థులు, ఇంజనీర్లు, రీసెర్చ్ ఫెలోలు, అధ్యాపకుల మధ్య పరస్పర సంబంధాలు మెరుగుపడుతాయని సుబుధి పేర్కొన్నారు. రెండు సంస్థలు సంయుక్తగా జ్ఞానాన్ని పంచుకోవడం, వృత్తిపరమైన అభివృద్ధి సమావేశాలు, వర్క్‌షాప్‌లు తదితర కార్యక్రమాలకు అంకురార్పణ జరుగుతందన్నారు. నిట్ విద్యార్థులు ఏఏఐలో శిక్షణ పొందుతూ విమానయాన రంగానికి సంబంధిత అవసరాలపై దృష్టిసారిస్తారన్నారు. రన్‌వే డిజైన్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్, సేఫ్టీ, ఇంటలిజెంట్ ట్రాన్స్‌పోర్టేషన్ సిస్టమ్ తదితర అంశాలపై పరిశోధనలు, పరిష్కారాలు చేసే అవకాశం మెరుగుపడుతందన్నారు. ఈ కార్యక్రమంలో నిట్ వివిధ విభాగాల ప్రొఫెసర్లు, పరిశోధకులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మందగించిన అన్నారం బ్యారేజీ పనులు

మహదేవపూర్, జూన్ 25: గత కొద్ది రోజులుగా ముమ్మరంగా సాగిన సరస్వతీ బ్యారేజీ (అన్నారం) పనులు మందగించాయి. వర్షాలు ప్రారంభం కావడంతో నెమ్మదించాయి. ఈనెల న పూణే నుంచి వచ్చిన నిపుణుల బృందం ఇక్కడే మకాం వేసి వివిధ పరీక్షలు చేపడుతోంది. సోమవారం సుందిళ్ల బ్యారేజీ వద్దకు వెళ్లి తిరిగి మంగళవారం అన్నారం చేరింది. పది రోజులపాటు పరీక్షలు చేపట్టాల్సి ఉండగా ఇప్పటికే ఐదు రోజులు పూర్తయ్యాయి. వర్షాల కారణంగా ఈ పనుల్లో వేగం తగ్గినట్టు తెలుస్తోంది.

'మేడిగడ్డ' వద్ద కొనసాగుతున్న మరమ్మతులు

మహదేవపూర్ రూరల్, జూన్ 25 : భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీలోని 7వ బ్లాకులో చేపట్టిన తాత్కాలిక మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. సీసీ బ్లాకుల పునరుద్ధరణ పనులు పూర్తి కాగా షీట్‌ఫైల్ అమరిక పనులు పూర్తికావొచ్చాయి. బ్యారేజీకి దిగువన సీసీబ్లాకులతో పాటు దాని కింద ఉన్న కంకర రాళ్లపై ఐరన్ నెట్ వేసే పనులు కొనసాగుతున్నాయి. మట్టి నమూనాల సేకరణతో పాటు గ్రౌటింగ్ పనులు కొసాగున్నాయి.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


మృతి చెందిన సంఘటన స్థలంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ నరేష్‌కుమార్, ఎస్సై సుధాకర్, ఇన్‌సెట్‌లో విస్లావత్ సుమతి (ఫైల్)

- ఇంటి సమీపంలో మృతదేహం లభ్యం
- మేతకు తీసుకెళ్లిన గొర్రెపిల్ల కూడా మృత్యువాత
- భర్తే హతమార్చాడని ఆరోపిస్తున్న కుటుంబ సభ్యులు
- భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఘటన

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జూన్ 25: అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందింది. తన ఇంటి సమీపంలోనే ఆమె మృతదేహం లభ్యమైంది. భర్తే ఆ మహిళను హతమార్చాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ సంఘటన భూపాలపల్లి జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగింది. మల్హర్ మండలం ఆన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన గుగులోతు రాజు, సమ్మక్కల కుమార్తె సుమత (28) వివాహం భూపాలపల్లి పట్టణ పరిధిలోని ఫక్కీర్‌గడ్డకు చెందిన విస్లావత్ హతిరాంతో 2016లో జరిగింది. వీరికి ఒక కుమారుడు సౌమిత్, కుమార్తె తేజల్ ఉన్నారు. మంగళవారం ఉదయం ఇంటి సమీపంలోని ఓపెన్‌కాస్ట్-2 పరిసరాల వద్ద గొర్రెపిల్లను మేపడానికి సుమత వెళ్లింది. కొద్దిసేపటికే ఆ ప్రదేశంలో సుమత విగతజీవిగా కనిపిం చింది. మృదేహం మెడలో చున్నీ చుట్టేసి ఉండగా, ఆమె వెంట తీసుకెళ్లిన గొర్రె పిల్ల కూడా చనిపోయి ఉంది. ఈ విషయాన్ని భర్త హతిరాం గ్రామస్థులకు వచ్చి చెప్పాడు. తన భార్యతోపాటు గొర్రెను ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారని హతిరాం చెప్పడంతో ఇంటి చుట్టుపక్కల వారు అక్కడికి వెళ్లి చూడగా సుమత విగత జీవిగా కనిపించింది. పక్కనే గొర్రె పిల్ల కళేబరం పడి ఉంది.

భర్తే హత్య చేశాడా..?

సుమత మృతిపై ఆమె కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇది ముమ్మాటికీ హత్యే అని ఆరోపిస్తున్నారు. సుమతతో ఏడాది కాలంగా హతిరాం చీటికిమాటికి గొడవ పడుతున్నాడని, మరో మహిళతో అతడికి వివాహేతర సంబంధం ఉందని అంటున్నారు. ఈ క్రమంలోనే అతడు భార్యను హత్య చేశాడని ఆరోపిస్తున్నారు. ఇంటి సమీపంలోని ఓసీ-2 పరిసర ప్రాంతానికి తన వెంట గొర్రెపిల్లను మేపడానికి సుమత వెళ్లిందని, కొద్దిసేపటికి హతిరాం కూడా అక్కడికి వెళ్లి ఆమెతో గొడవపడ్డాడని, మెడ చుట్టూ చున్నీ బిగించి హత్య చేశాడని అంటున్నారు. వెంట ఉన్న గొర్రెపిల్లను కూడా చంపేశాడని ఆరోపిస్తున్నారు. సుమత హత్య నెపాన్ని వేరే వ్యక్తుల మీద నెట్టేసేందుకు అతడు ప్రయత్నిస్తున్నాడని అంటున్నారు.

సంఘటన స్థలాన్ని భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, భూపాలపల్లి, చిట్యాల సీఐలు నరేష్‌కుమార్, మల్లేష్ యాదవ్, ఎస్సై సుధాకర్ సందర్శించారు. సుమత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. హతిరాంను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరేష్ కుమార్ తెలిపారు.

డిసెంబరు నాటికి అమృత్ భారత్ రైల్వేస్టేషన్‌గా వరంగల్

- సికింద్రాబాద్ డీఆర్ఎం భరతేష్ కుమార్ జైన్
- విజయవాడ వరంగల్ మార్గంలో పనుల పరిశీలన

గిర్మాజిపేట, జూన్ 25 : అమృత్ భారత్ రైల్వేస్టేషన్ పథకం కింద రూ.18 కోట్లతో చేపట్టిన వరంగల్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు డిసెంబరు నాటికి, విజయవాడ-వరంగల్ లైన్ పనులు మార్చి 2025 నాటికి పూర్తవుతాయని సికిందరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్ఎం) భరతేష్ కుమార్ జైన్ చెప్పారు. మంగళవారం డీఆర్ఎం విజయవాడ- వరంగల్ రైల్వేమార్గంలో విజయవాడ, మధిర, డోర్నకల్, మహబూబాబాద్, వరంగల్ రైల్వేస్టేషన్‌లలో జరుగుతున్న అభివృద్ధి పనులతోపాటుగా, రైల్వేస్టేషన్లలో వసతులను పరిశీలించారు. డోర్నకల్, మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లను పరిశీలించిన అనంతరం ప్రత్యేక రైలులో సాయంత్రం వరంగల్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. నాల్గవ ప్లాట్‌ఫాం, తినుబండరాల స్టాల్‌ను తనిఖీ చేసి చేశారు ప్రధాన ద్వారం వద్ద కాకతీయ తోరణం తరహాలోనే ఏనుగు విగ్రహాలతో కూడిన స్తంభాలు అద్భుతంగా తీర్చిదిద్దుతున్నట్లు అధికారులు డీఆర్ఎంకు వెల్లడించారు. మొదటి ప్లాట్‌ఫాంపై నూతనంగా అభివృద్ధి చేస్తున్న స్టేషన్ మేనేజర్ గది, వీఐపీ లాంజ్, ప్రయాణికుల వసతి మందిరాల నిర్మాణం పనులను పరిశీలించారు. అనంతరం డీఆర్ఎం మాట్లాడుతూ అమృత్ భారత్ రైల్వేస్టేషన్ పథకం కింద రూ.18 కోట్లతో రైల్వేస్టేషన్ అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. రెండు ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు సరిపోక పోతుండటంతో రూ.12కోట్ల జీఆర్‌పీ స్టేషన్ ముందు 3వ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులు జరుగుతున్నాయన్నారు. మిగిలిన రూ.6కోట్లతో నాలుగు ప్లాట్‌ఫారాలపై కవర్ షెడ్‌లు, ప్రయాణికుల విశ్రాంతి మందిరాలు, ప్రయాణికుల భోజన వసతుల కోసం రైల్వే కోచ్ రెస్టారెంట్ ఏర్పాటు చేస్తున్నట్లు డీఆర్ఎం వివరించారు. డీఆర్ఎం పర్యటనలో ఏడీఆర్ఎం (నిర్మాణాలు) నాయుడు, సికిందరాబాద్, కాజీపేటలకు చెందిన వివిధ విభాగాల రైల్వే అధికారులు, వరంగల్ రైల్వేస్టేషన్ మేనేజర్ బాలరాజు, సీసీఐ రాజ్‌గోపాల్ అధికారులు పాల్గొన్నారు.


వరంగల్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులపై అధికారులతో మాట్లాడుతున్న డిఆర్ఎం


డోర్నకల్‌లో క్రూ బుకింగ్ లాబీలో రికార్డులను పరిశీలిస్తున్న బర్తేష్‌కుమార్‌జైన్


వరంగల్ రైల్వేస్టేషన్ అమృత్ భారత్ అభివృద్ధి పనులు పరిశీలిస్తున డీఆర్ఎం

అప్రమత్తతోనే రైలు ప్రమాదాల నివారణ

డోర్నకల్ (మహబూబాబాద్ జిల్లా): విధి నిర్వహణలో ఉండే ఉద్యోగులు, లోకోపైలెట్‌లు, అసిస్టెంట్ లోకోపైలెట్‌లు అప్రమత్తంగా వ్యవహరించినప్పుడే ప్రమాదాలను నివారించవచ్చునని దక్షిణమధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ బర్తేష్‌కుమార్‌జైన్ అన్నారు. మంగళవారం విజయవాడ నుంచి ప్రత్యేక రైలు ద్వారా డీఆర్ఎం డోర్నకల్ జంక్షన్‌కు చేరుకున్నారు. జంక్షన్‌లోని రైల్వే క్రూ బుకింగ్ లాబీని సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం లోకో పైలెట్‌లు, అసిస్టెంట్ లోకో పైలెట్‌లు, రన్నింగ్‌స్టాఫ్‌ను ఉద్దేశించి ఆయన మాట్లాడారు.

రైళ్లను పునరుద్ధరించాలని వినతి..

డోర్నకల్ రైల్వే జంక్షన్‌కు వచ్చిన డీఆర్ఎంకు మాజీ డీఆర్‌యూసీసీ మెంబర్ ఖైనుపాష రైళ్లను పునరుద్దరించాలని కోరుతూ వినతి పత్రం అందించారు. కాజీపేట -డోర్నకల్, డో ర్నకల్-విజయవాడ, పెద్దపల్లి-విజయవాడ, విజయవాడ-పెద్దపల్లి, కాజీపేట-మణుగూరు, మణుగూరు-కాజీపేట ప్యాసింజర్ రైళ్లను గతంలో రద్దు చేశారని, వాటిని పునరుద్ధరించాలని కోరారు. ఏడీఆర్ఎం గోపాల్‌నాయక్, సీనియర్ డీసీ ఎం బాలాజీకిరణ్, సీనియర్ డీవోఎం మణికుమార్, సీనియర్ డీఈ టీఆర్ఎస్‌వో విష్ణువర్ధన్, ఎస్ఎం శోభన్‌ప్రసాద్, సీఅండ్‌డబ్ల్యూ బాబు, డీఆర్‌యూసీసీ మాజీ సభ్యులు ఖాద ర్, జైన్‌సమాజ్ ప్రతినిధులు మహేందర్‌కుమార్‌జైన్, సుమీర్‌చందర్‌జైన్, పదం కుమార్‌జైన్, అభిషేక్‌జైన్ పాల్గొన్నారు.

- గార్ల : మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుదల చేసి ప్రయాణికుల ఇబ్బందులను తీర్చాలని కోరుతూ డీఆర్ఎం భరత్‌కుమార్ జైన్‌కు మండల వాసులు కలిసి, వినతిపత్రం అందజేశారు.

కారు, ఆటో ఢీకొని వ్యక్తి దుర్మరణం


మృతి చెందిన సుధాకర్‌రెడ్డి

నెల్లికుదురు, జూన్ 25 : కారు, ఆటోను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కాచికల్ శివారు ఆకేరువాగు బ్రిడ్జి సమీపంలో మంగళవారం జరిగింది. ఎస్సై క్రాంతికిరణ్ కథనం ప్రకారం. తొర్రూరు మండలం చెర్లపాలెం గ్రామానికి చెందిన అనుమాండ్ల సుధాకర్ రెడ్డి (45) తొర్రూరు అమృత బేకరిలో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆటోలో బ్రెడ్ ప్యాకెట్‌లను తొర్రూరు నుంచి నెల్లికుదురుకు తరలిస్తున్న క్రమంలో భద్రాది కొత్తగూడెం జిల్లా టేకులపెల్లి మండలం గోల్యతండాకు చెందిన మలోత్ వెంకటేష్ కారులో తొర్రూరు నుంచి నెల్లికుదురు వైపునకు వెళ్తుండగా, ఆటోను ఢీకొట్టడంతో ఆటోబోల్తా పడి సుధాకర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య అనుమాండ్ల సరిత ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కారును పోలీస్‌స్టేషన్‌కు తరలించి, సుధాకర్‌రెడ్డి మృతికి కారకుడైన మాలోత్ వెంకటేష్ పై కేసు నమోదు చేశారు. మృతదేహన్ని పోస్టు మార్టంకు తరలించినట్లు ఎస్సై క్రాంతికిరణ్ పేర్కోన్నాడు.

మామను హతమార్చిన అల్లుడికి జీవిత ఖైదు

వరంగల్ లీగల్, జూన్ 25: కూతుర్ని వేధింపులకు గురి చేయడాన్ని నిలదీసిన మామను హత్య చేసిన నిందితుడు పోతరాజు వెంకటేశ్‌కు యావజ్జీవ కారాగార శిక్ష, రెండు వేల రూపాయల జరిమానా విధిస్తూ హ నుమకొండ జిల్లా మొదటి అదనపు సెషన్సు జడ్జి బి.అపర్ణాదేవి మంగళ వారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. హసన్‌పర్తికి చెం దిన నిందితుడు పోతరాజు వెంకటేశ్‌తో నడికూడ మండలం కంఠాత్మకూరు గ్రామానికి చెందిన జక్కు ఎల్లయ్య కూతురు స్వాతితో 2013లో వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు. పెళ్లి సమయంలో మెడికల్ షాపులో పనిచేసే తర్వాత ఖాళీగా ఉండి తరుచూ చిన్న చిన్న విషయాలకు భార్యతో గొడవ పడుతుండేవాడు. స్వాతి తండ్రి అప్పుడప్పుడు కూతురు ఇంటికి వెళ్లి ఖర్చుల నిమిత్తం డబ్బులు కూడా ఇస్తుండేవాడు. రెండుసార్లు పంచాయి తీలు కూడా నిర్వహించి గొడవ లేకుండా కలిసి ఉండాలని పెద్ద మనుషు లు సూచించారు. ఇదిలా ఉండగా 2020 అక్టోబరు 6న తన ఇంటికి వచ్చిన మామ ఎల్లయ్యను మద్యం తాపించేందుకు చెరువువద్దకు తీసుకెళ్లాడు. అనంతరం తనతో తెచ్చుకున్న గొడ్డలితో కట్టి చంపి చెరువులో పడేశాడు. మరునాడు పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితుడు పోతరాజు వెంకటేశ్ తన మామ జక్కు ఎల్లయ్యను చంపినందుకు హత్యా కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువైనందున నిందితుడికి జీవితఖైదు, రెండు వేల రూపాయల జరిమాన విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి


తనిఖీ నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం

వరంగల్ మెడికల్, జూన్ 25 : అన్ని ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లు, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం 2010లో పేర్కొన్న నియమ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని నాల్గవ జోన్ టాస్క్ ఫోర్స్ బృందం అధికారి డాక్టర్ వి.రాజేశఖర్ తెలిపారు. మంగళవారం బృందం సభ్యులతో కలిసి హనుమకొండ, వరంగల్ జిల్లాలోని పలు ఆస్పత్రులు, క్లినిక్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఆస్పత్రి యాజమాన్యం తాము అందిస్తున్న సేవలు వివరాలు, డాక్టర్ల వివరాలు, సేవలకు సంబంధించిన ధరల పట్టికను అందరికి కనిపించేలా ప్రదర్శించాలన్నారు. ఫైర్ సేఫ్టీ, మెడికల్ వ్యర్థాలకు సంబంధించి ప్రమాణాలకు అనుగుణంగా ఏర్పాట్లు ఉం డాలన్నారు. రికార్డులు సైతం సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బృం దం సభ్యులు కిరణ్‌రెడ్డి, నిరంజన్‌రావు, జి.ప్రసన్న కుమార్, వి.అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ డిపో నుంచి కొత్త బస్సు సర్వీసులు

బాలసముద్రం, జూన్ 25: వరంగల్ డిపో నుంచి గుంటూరు, కూకట్‌పల్లి, శ్రీశైలంలకు అదనంగా కొత్త ఏసీ రాజధాని సర్వీస్‌లను, సూపర్ లగ్జరీ బస్సులను ప్రారంభిస్తున్నట్లు వరంగల్-1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి హనుమకొండ నుంచి ఉదయం 7 గంటల నుంచి గుంటూరుకు సర్వీస్ నడుపనున్నట్లు తెలిపారు. హనుమకొండ నుంచి కూకట్‌పల్లికి ఉదయం 5.30గంటలకు, సాయంత్రం 4.15 గంటలకు కూకట్‌పల్లి నుంచి హనుమకొండకు సర్వీస్ నడుపనున్నట్లు తెలిపారు. హనుమకొండ నుంచి శ్రీశైలంకు ఉదయం 7 గంటలకు, 10.30 గంటలకు శ్రీశైలం నుంచి హనుమకొండకు ఉదయం 7.40 గంటలకు, 8 గంటలకు కొత్త సూపర్ లగ్జరీ బస్సులు నడుపనున్నట్లు డిపో మేనేజర్ మహన్‌రావు తెలిపారు. ఈ కొత్త సర్వీసు బస్సులను ప్రయాణీకులు వినియోగించుకోవాలన్నారు.


బీపీఈడీ రీ షెడ్యూల్ పరీక్షల టైంటేబుల్ విడుదల

కేయూ క్యాంపస్, జూన్ 25 : కాకతీయ యూనివర్సిటీ బీపీఈడీ నాల్గవ సెమిస్టర్ పరీక్షల రీషెడ్యూల్‌ను మంగళవారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికారెడ్డిలు విడుదల చేశారు. జూన్ 29, జూలై 1, 3, 5వ తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. కేయూ క్యాంపస్‌లోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

అటవీ భూములను కాపాడాలి

గూడూరు, జూన్ 25 : అటవీ భూములు ఆక్రమణకు గురికాకుండా అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని అడ్వకేట్ బొడ్డు కిరణ్, వెంగంపేట కాంగ్రెస్ గ్రామపార్టీ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం వెంగంపేట గ్రామంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అటవీ భూములను యథేచ్ఛగా ఆక్రమించుకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వెంగంపేట శివారులో గ్రామానికి సంబంధంలేని వ్యక్తులు అటవీ భూమిని ఆక్రమించాలని చూస్తున్నారని ఆరోపిం చారు. గ్రామా నికి సంబంధించిన కొంతమందికి ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. అధికారుల పర్యవేక్షణ లోపం తోనే ఈ తరహా హక్కుపత్రాల జారీ జరిగిందని ధ్వజమెత్తారు. తునికాకు కూలీలకు సంబంధించిన బోనస్ డబ్బుల చెల్లింపుల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. కూలీల అకౌంట్లలో పడాల్సిన డబ్బులు మధ్య దళారుల అకౌంట్లలో పడ్డాయని పేర్కొన్నారు. అటవీశాఖ అధికారులు పారదర్శకంగా వ్యవహరించి, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో బొడ్డు వెంకటయ్య, సాయిలు, స్వామి, యాకస్వామి పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బొడ్డు కిరణ్



ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేను కలిసిన కావ్య, శ్రీహరి

హనుమకొండ సిటీ, జూన్ 25 : ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను వరంగల్ లోకసభ సభ్యురాలు డాక్టరు కడియం కావ్య, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ఢిల్లీలో కలిసి శాలువాతో సన్మానించారు. ఎంపీగా కడియం కావ్య ప్రమాణ స్వీకారం చేయనున్న క్రమంలో ఖర్గే ఆమెను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియచేశారు.

ఆర్య వైశ్య విద్యార్థినులకు హాస్టల్ వసతి

వాసవి హాస్టల్ ట్రస్ట్ జాయింట్ సెక్రటరీ గట్టు మహేశ్‌బాబు



వరంగల్ కల్చరల్, జూన్ 25 : ఆర్య వైశ్య విద్యార్థినులకు హైదరాబాద్‌లో హాస్టల్ వసతి కల్పిస్తున్నట్లు వాసవి హాస్టల్ ట్రస్ట్ జాయింట్ సెక్రటరీ గట్టు మహేశ్‌బాబు తెలిపారు. వాసవి ఆర్య వైశ్య హాస్టల్ ట్రస్ట్ ఛైర్మన్ గంజి రాజమౌళి గుప్తా ఆధ్వర్యంలో నూతనంగా ఆధునిక వసతులతో బాలికల కోసం ప్రత్యేకంగా వసతి గృహం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ముషిరాబాద్, హైదరాబాద్‌లలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. జులై 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే హాస్టల్‌లో ప్రవేశాల కోసం డిగ్రీ, పీజీ చదివే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అర్హులైన వైశ్య ప్రతిభావంతులైన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 8099839966, 8341785462 మొబైల్ నెంబర్లలో సంప్రదించాలని గట్టు మహేశ్‌బాబు సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు కల్పించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 25 : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. నర్సింహారావు అన్నారు. ఈ మేరకు హనుమకొండలో డీఈవో అబ్దుల్ హైని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం నరసింహారావు మాట్లాడుతూ... ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. పాఠశాలలు ప్రారంభమై 15 రోజులు కావస్తున్నా పాఠశాలల్లో సమస్యలు అలాగే ఉన్నాయన్నారు. పారిశుధ్య కార్మికులు లేకపోవడంతో పాఠశాలల ఆవరణలు మురికిగా ఉంటున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, రాజ్‌కుమార్, ఉదయ్, రమేష్, అనిల్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

పదోన్నతుల్లో జరిగిన అక్రమాలను అరికట్టాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 25 : హనుమకొండ జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల్లో జరిగిన అక్రమాలను అరికట్టాలని పీఆర్టీయూ హసన్‌పర్తి మండల మాజీ కార్యదర్శి ఎం. రమేష్‌కుమార్ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌ఏ ఇంగ్లీష్‌లో అక్రమంగా పదోన్నతి కల్పించారని పేర్కొన్నారు. ఖాళీల జాబితాలో ఊరుగొండ స్కూల్ పోస్టు లేనప్పటికీ ఈ నెలలో పదవీ విరమణ పొందబోతున్న ఓ ఉపాధ్యాయుడికి అక్రమంగా పదోన్నతి కల్పించారని ఆయన పేర్కొన్నారు. ఈ విషయమై డీఈవోను వివరణ ఇవ్వాలని కోరినా సరియైన వివరణ ఇవ్వడం లేదని తెలిపారు. అక్రమ పదోన్నతిని రద్దు చేసి సీనియారిటీ జాబితాలో ఉన్న అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించాలని ఆయన ప్రకటనలో డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, జూన్ 25 : విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా బుధవారం న్యూశాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సిటిజన్ క్లబ్, మెడికోవర్ ఆస్పత్రి ఏరియాలో, ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు నందిహిల్స్, జూపార్కు ఏరియా, హంటర్‌హిల్స్, ఆర్కా స్కూల్ ఏరియాలో విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ డిఈ జి. సాంబరెడ్డి తెలిపారు.

మహిళా కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షురాలిగా స్వాతి



హసన్‌పర్తి, జూన్ 25: కాంగ్రెస్ పార్టీ హసన్‌పర్తి మండల మహిళా ఉపాధ్యక్షురాలిగా మునిపల్లికి చెందిన బత్తుల స్వాతి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా స్వాతి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల ను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ పటిష్టతకు కృషిచేస్తానన్నా రు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే నాగరాజు, జిల్లా అధ్యక్షురాలు బంక సరళ, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు పి.వెంకట్రాంనర్సింహారెడ్డి, మండలపార్టీ అధ్యక్షుడు పి.మహేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు టి.తిరుపతి, జిల్లా నాయకుడు ఎం.మధన్‌గౌడ్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగుల సమస్యలపై వెంటనే స్పందించాలి

టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, జూన్ 25 : సహకార సంఘాల్లో పని చేస్తున్న ఉద్యోగుల సమ స్యలపై వెంటనే స్పందించి ఆ మేరకు పరిష్కార చర్యలు చేపట్టాలని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు డీసీవోలకు సూచించారు. మంగళవారం హనుమకొండ నక్కల గుట్టలోని డీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో రవీందర్‌రావు అధ్యక్షతన డిస్ట్రిక్ లెవెల్ ఎంపవర్డ్ కమిటీ సమావేశం జరిగింది. ఉద్యోగుల హెచ్ఆర్ పాలసీ అమలుతో పాటు ఇతర సమస్యలు, ఆర్థిక ప్రయోజనాల అంశాలను సమావేశం చర్చించింది. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దని రవీందర్‌రావు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లాలోని డీసీవోలు సంజీవరెడ్డి, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, రాజేందర్‌రెడ్డి, శైలజ, డీసీసీ బ్యాంకు సీఈవో ఎండీ వజీర్ సుల్తాన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

అంబేద్కర్ భరోసా పథకాన్ని అమలు చేయాలి

డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్

వడ్డెపల్లి, జూన్ 25: అంబేద్కర్ భరోసా పథకాన్ని అమలు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంబేద్కర్ అభయ హస్తం (భరోసా) పథకాన్ని వెంటనే అమలు చేసి ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ డీబీఎఫ్ ఆధ్వర్యంలో హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేకంగా దళితుల, సమగ్ర అభివృద్ధి, రక్షణలపై చర్చించాలని అన్నారు. కాంగ్రెస్ పా ర్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో చేవెళ్లలో జరిగిన సభలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను అమలు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన దళిత బంధు స్థానంలో కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్ అభయ హస్తం పథకాన్ని రూ. 12 లక్షలకు పెంచి అమలు చేస్తామన్న హామీ ఆచరణలో విఫలమైందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, జిల్లా కార్యదర్శులు చుంచు నరేష్, మేకల అనిత, రాష్ట్ర జిల్లా నాయకులు బొర్ర సంపూర్ణ, పోలెపాక మల్లేశం, కలకోటి మహేందర్, ఐలయ్య రాజు, సురేందర్, క్రాంతి, సామాజిక వేత్త కేడెల ప్రసాద్ పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రదర్శన నిర్వహిస్తున్న డీబీఎఫ్ నేతలు

విధుల నిర్వహణలో అలసత్వం వద్దు

అదనపు డీసీపీ సురేష్ కుమార్

వరంగల్ క్రైం, జూన్ 25 : వ్యక్తిగత భద్రతా సిబ్బంది విధుల నిర్వహణలో అలసత్వం వహిం చకూడదని అదనపు డీసీపీ సురేష్ కుమార్ సూచించారు. మంగళవారం హనుమకొండలోని కమిషనరేట్ కార్యాలయంలో కమిషనరేట్ పర్సనల్ సెక్యూరిటీ వింగ్ ఇన్‌చార్జి డీఏస్పీ నర్సిరెడ్డి ఆధ్వర్యంలో వ్యక్తిగత భద్రతా సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. భద్రత కల్పిస్తున్న వ్యక్తులను శత్రువుల నుంచి ఎలాంటి ప్రాణాపాయం లేకుండా పరిరక్షించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ సురేష్ కుమార్ మాట్లా డుతూ.. వ్యక్తిగత భద్రతా సిబ్బందిగా విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది నిరంతరం అప్రమ త్తంగా ఉండాలన్నారు. శత్రువులకు ఏ మాత్రం అవకాశం కల్పించినా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. వ్యక్తిగత భద్రతా సిబ్బంది అన్ని రకాల ఆయుధాలను వినియో గించడంలో నిష్ణాతులై ఉండాలన్నారు. ఆరోగ్య రక్షణకు నిరంతరం వ్యాయామం, యోగా అవస రమని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు స్పర్జన్ రాజ్, శ్రీనివాస్, శ్రీధర్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు శోభన్‌గౌడ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్ కుమార్

రన్నింగ్ స్టాఫ్ నిరసనకు తరలిన రైల్వే కార్మికులు

కాజీపేట, జూన్ 25: లోకో రన్నింగ్ స్టాఫ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ఆధ్వర్యంలో మంగళవారం సికింద్రాబాద్‌లో నిర్వహించిన నిరసనకు కాజీపేట నుంచి రైల్వే కార్మికులు పెద్దఎత్తున తరలివెళ్లారు. ఈ నిరసనలో కాజీపేటకు చెందిన సంఘ్ డివిజనల్ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ పాక రాజ్‌కుమార్ హాజరై మాట్లాడారు. రన్నింగ్ స్టాఫ్ సమస్యలపై రైల్వే జాతీయ కార్మిక నాయకుడు, ఎన్ఎఫ్ఐఆర్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మర్రి రాఘవయ్య ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. రన్నింగ్ స్టాఫ్ కార్మికుల డిమాండ్ అయిన 46 గంటల రెస్ట్‌ను సాధించడానికి సంఘ్ తరఫున పూర్తి సహకారం ఉంటుందన్నారు. ఈ నిరసనలో రైల్వే కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కబ్జాకు గురైన స్థలాలు తిరిగి స్వాధీనం చేసుకోవాలి

తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించిన కాంగ్రెస్ నాయకులు

కాజీపేట, జూన్ 25: బీఆర్ఎస్ ప్రభుత్వంలో కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాలను తిరిగి తీసుకోవాలని కోరుతూ కాజీపేట తహసీల్దార్ బావుసింగ్‌కు మంగళవారం మాజీ కార్పొరేటర్ గుంటి కుమార స్వామి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ భూములను, ఎఫ్‌టీఎల్ స్థలాలను, సీలింగ్ ల్యాండ్‌లను, కోట్లు విలువ చేసేప్రభుత్వ ఆస్తులను బీఆర్ఎస్ నాయకులు కబ్జాలు చేశారని పేర్కొన్నారు. కొందరు నాయకులు రియాల్టర్లతో కుమ్మక్కై తెలంగాణ ఆస్తులను దోచుకున్నారని, ఆ స్థలాలను తిరిగి తీసుకోవాలన్నారు. హనుమకొండ, కాజీపేటలో బీఆర్ఎస్ నాయకులు కబ్జాలు చేసిన స్థలాల వివరాలను స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వాటిని సర్వే చేసి స్వాధీనం చేసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీచేశారని తెలిపారు. వినతిపత్రం సమర్పించిన వారిలో మాజీ కార్పొరేటర్ సుంచుఅశోక్, 62వ డివిజన్ అధ్యక్షుడు పాలడుగుల ఆంజనేయులు, 47వ డివిజన్ అధ్యక్షుడు షేక్ అజ్గర్, నాయకులు ఇప్ప శ్రీకాంత్, చిలకపాటి శివ, తమ్మడి మానస, కొండా శివ, తిరుపతి, శ్రీనివాస్, జి.రమేశ్, క్రాంతి, బన్నీ పాల్గొన్నారు.



వినతి పత్రం సమర్పిస్తున్న నాయకులు

నగదు రహిత సేవల నిలిపివేత

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

వరంగల్ మెడికల్, జూన్ 25 : హనుమకొండ బాలసముద్రంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో ప్రైవేట్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ వారు నగదు రహిత చికిత్స సేవలు నిలిపివేశారు. 'హెల్త్ ఇన్సూరెన్స్ పేరుతో నయా మోసం అనే ఆంధ్రజ్యోతి కథనం గత ఏప్రిల్ 11న, క్లెయిమ్స్‌పై మౌనమేల అనే శీర్షికతో ఏప్రిల్ 12న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఈ కథనం ప్రకారం హనుమకొండ బాలసము ద్రంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రి 18 నెలల్లో రూ. 2.67 లక్షలు స్వాహా చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ప్రముఖ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ ఈ కథనంపై సమగ్ర విచారణ జరిపి సదరు ఆస్పత్రికి నోటీసులు జారీ చేసింది. సమాధానం సంతృప్తికరంగా లేకపోవడంతో నగదు రహిత సేవల సౌకర్యాన్ని తక్షణమే ఉపసంహరించుకుంటున్నట్లు సదరు ఆస్పత్రికి లేఖ పంపారు. అదే విధంగా పాథాలజీస్టులు, మైక్రో బయాలజిస్టులు, రేడియాలజిస్టులు లేకుండానే మెడికల్ రిపోర్టులు తయారు చేస్తున్నట్లు ప్రాథమికంగా ధృవీకరించారు. సదరు ఆస్పత్రిలో నగదు రహిత సేవలను ఉపసంహరించుకుంటున్నట్లు కంపెనీ ప్రతినిధులు లేఖలో పేర్కొన్నారు.

ఉద్యమకారులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలి

భారత్ సురక్షా సమితి జిల్లా అధ్యక్షుడు శ్యాంప్రసాద్

వడ్డెపల్లి, జూన్ 25: ఉద్యమకారులకు, స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న వారికి ఇస్తున్నట్లుగానే 1975లో ఫ్రీడం మూవ్‌మెంట్‌లో పాల్గొన్న తమకు కేంద్ర ప్రభుత్వ పెన్షన్ సౌకర్యం కల్పించాలని భారత్ సురక్షా సమితి వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సీహెచ్. శ్యాంప్రసాద్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సరగు సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు పొలుసాని కేశవరెడ్డిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారితో పాటు ఉపాధ్యక్షులు డాక్టర్ ఎ. సమ్మిరెడ్డి, సెక్రటరి కృష్ణారావులు మాట్లాడారు. తమను స్వతంత్ర సేనానులుగా గుర్తించాలని అన్నారు. 1975లో ఎమర్జెన్సీ విధించిన రోజును ప్రజాస్వామ్య రాజ్యాంగ పరిరక్షణ దినంగా ప్రకటించాలని అన్నారు. ఉద్యమంలో పాల్గొన్న వారందరికీ వారి సేవలను గుర్తించి తామర పత్రాలను అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సమితి సభ్యులు కోటేశ్వర్‌రావు, బూర రాంచందర్, మార్గం ఎల్లయ్య, మనోహర్, అశోక్‌రెడ్డి, నర్సింగరావు, చిలుకయ్య, నాగభూషణం, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



ప్రెస్ క్లబ్‌లో మాట్లాడుతున్న సీహెచ్ శ్యాంప్రసాద్

ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి ప్లాట్ కబ్జా

కోర్టు ఆర్డర్ ధిక్కరించి నిర్మాణం

డిప్యూటీ కమిషనర్‌ను కలిసిన బాధితుడు

బాలసముద్రం, జూన్ 25: హనుమకొండ జిల్లాలో భూకబ్జాదారుల ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. అధికారులు మామూళ్లు తీసుకొని ఇష్టారాజ్యంగా అనుమతులు ఇవ్వడంతో హనుమకొండకు చెందిన ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి ప్రదీప్‌కుమార్ ప్లాటును కేసిరెడ్డి రాకేష్ కబ్జా చేసి నిర్మాణం చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రదీప్ కుమార్ మంగళవారం డిప్యూటీ పోలీసు కమిషనర్ సలీమాకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ తాను 2007లో తన తల్లి ఇందిరా పేరు మీద లష్కర్ సింగారం సర్వే నంబర్ 294లో 287 గజాల ప్లాటును లింగారెడ్డి అనే వ్యక్తి వద్ద నుంచి కొనుగోలు చేసి మునిసిపాలిటీ అనుమతితో కరెంటు మీటర్, కాంపౌండ్ వాల్, ఒక రూం నిర్మించి ప్లాటులో ఉంటున్నట్లు తెలిపారు. 2022లో కేసిరెడ్డి రాకేష్ అనే వ్యక్తి ఆ భూమి తనదంటూ నకిలీ పత్రాలు సృష్టించి ప్లాటులో ఉన్న ఇంటి గోడలు కూల్చి రూ. 4 లక్షల వరకు నష్టం చేసి తన ప్లాటును కబ్జా చేశాడని పోలీసులకు ఫిర్యాదు చేస్తే పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. తప్పుడు పత్రాలతో ప్లాటు కబ్జా చేయడంతో కోర్టులో కేసు వేసినట్లు ప్రదీప్‌కుమార్ తెలిపారు. అయినా కోర్టును దిక్కరించి కేసిరెడ్డి రాకేష్ తన ప్లాటులో అక్రమ నిర్మాణం చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని బాధితుడు వాపోయాడు. జిల్లా కలెక్టర్, పోలీసు అధికారులు పట్టించుకుని తనకు న్యాయం చేసి కబ్జాచేసిన రాకేష్‌పై చర్యలు తీసుకోవాలని అధికారులను వేడుకున్నాడు.



విలేకరులకు పత్రాలు చూపిస్తున్న ఎయిర్ ఫోర్స్ ఉద్యోగి ప్రదీప్‌కుమార్, తల్లి ఇందిరా

అనుమతిలేని పాఠశాలల వివరాలు ప్రకటించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 25: జిల్లాలో అనుమతి లేని పాఠశాలల వివరాలను వెంటనే వెల్లడించాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాలోత్ రాకేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలో డీఈవో అబ్దుల్ హైని కలిసి వినతి పత్రం అందజేశారు. అంతకుముందు డీఈవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ... ఎలాంటి అనుమతులు లేకుండానే విద్యా వ్యాపారం చేస్తున్న యాజమన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనుమతి లేని పాఠశాలల వివరాలను ప్రకటించకపోవడం జిల్లా విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుందన్నారు. పాఠశాలల్లోనే బుక్స్, నోట్‌బుక్స్ తదితర వస్తువులను విక్రయిస్తూ వ్యాపారాలు కొనసాగిస్తున్న పాఠశాలలపై విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకుపోవడం పట్ల ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. అనుమతులు లేకుండా, విద్యావ్యాపారం చేస్తున్న పాఠశాలలపై ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారన్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాకేష్, మహేష్, రాజేష్, వెంకటేష్, మహేష్, రంజిత్, రాజ్‌కుమార్ తదతరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది

టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి



ప్రశంసాపత్రాలు, బహుమతులతో క్రీడాకారులు

హసన్‌పర్తి, జూన్ 25 : క్రీడలతో క్రమశిక్షణ, స్నేహభావం పెంపొందుతాయని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ, డబ్ల్యూడీబీఏ జాయింట్ సెక్రటరీ డాక్టర్ ఎం.జితేందర్‌రెడ్డి అన్నారు. ఎర్రగట్టుగుట్ట వద్ద గల కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ క్రీడల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో మానసిక ప్రశాంతత, శరీర ధారుడ్యం, క్రమశిక్షణ, స్నేహభావం పెంపొందుతాయన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, పాల్గొనడమే ముఖ్యమన్నారు. అనంతరం డబ్ల్యూడీబీఏ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.రమేశ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతిభావంతులైన క్రీడాకారులు తమ నైపుణ్యాలను ప్రదర్శించేందుకు ఈ టోర్నమెంట్ వేదికవుతుందన్నారు. క్రీడాకారుడికి పోరాట పటిమ ఉండాలన్నారు. అనంతరం డబ్ల్యూడీబీఏ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు పింగిళి రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. సాధన లేకుండా క్రీడాకారుడు ఏదీ సాధించలేరన్నారు. నిరంతం క్రమశిక్షణతో కూడిన సాధనతోనే విజయం వరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూడీబీఏ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.మోహన్‌రావు, కోశాధికారి డి.నాగకిషన్, సభ్యుడు పి.వెంకటేశ్వర్‌రావు, పీడీ శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్వో దాసరోజు ప్రభాకరాచారి తదితరులు పాల్గొన్నారు.

ఐక్యత కోసం యువత కృషి చేయాలి

మెపా రాష్ట్ర అధ్యక్షుడు దేవేందర్ ముదిరాజ్

ధర్మసాగర్, జూన్ 25: ముదిరాజ్ యువత ఐక్యత కోసం కృషి చేయాలని మెపా వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ అన్నారు. మంగళవారం ధర్మసాగర్ మండల కేంద్రంలో మెపా హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి అమ్మగారి శ్యామ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముదిరాజ్‌లు రానున్న రోజుల్లో రాజకీయంగా పోరాడ వలసిన అవసరం ఉందన్నారు. ముదిరాజ్ కుల అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు. అనంతరం ధర్మసాగర్ మండలం మెపా అధ్యక్షుడిగా నారాయణగిరి గ్రామానికి చెందిన దాసరి రాజ్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో మెపా రాష్ట్ర కార్యదర్శులు రామకృష్ణ, చిరంజీవి, రాజు, సాయి శివ, నవీన్, మహేందర్ పాల్గొన్నారు.

ముంపు ముప్పు తప్పదా?

(5వ పేజీ తరవాయి)

విద్యానగర్, వికాస్‌నగర్, శ్రీనగర్ కాలనీ, బాలసముద్రం, యాదవనగర్, బ్రాహ్మణవాడ, జులైవాడ, కాజీపేట డీజిల్‌కాలనీ, బాపూజీనగర్ తదితర 40 కాలనీలకు పైగా ఏటా ముంపు ముప్పు తప్పడం లేదు. వీటితో పాటు అనేక లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. వేలాది ఇళ్లు నీట మునిగి వరద నీటిలో ప్రజలు బిక్కుబిక్కుమనే పరిస్థితి నెలకొంది. ప్రధాన నాలాలతో పాటు కాలనీల్లో అంతర్గత మురుగు కాలువలు లేకపోవటం కూడా ముంపుకు ప్రధాన సమస్యగా మారుతుంది.

వరద ముంపు పరిష్కారానికి వరంగల్ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైయినేజీని నిర్మించడమే శాశ్వత పరిష్కారమని అందరూ భావిస్తున్నారు. 30ఏళ్లుగా నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ నిర్మించాలని చేస్తున్న ప్రయత్నాలు ఫలించకపోవటంతో ఏటికేడు వరద ముంపు సమస్య పెరుగుతోంది. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం తెలంగాణ పట్టణ మౌళిక వసతుల కల్పన సంస్థ (టీయూఎఫ్ఐడీసీ) ద్వారా గ్రేటర్ వరంగల్‌కు రూ.250కోట్ల నిధులు కేటాయించి.. గ్రేటర్ పరిధిలో 25 పనులు చేపట్టేందుకు అనుమతిచ్చింది. అయితే వీటిలో ప్రధానంగా ఉర్సు, బీబీనగర్ నుంచి బొందివాగు వరకు వరద కాలువ నిర్మాణానికి రూ.55కోట్లు, సాకరాశికుంట నుంచి ఎస్ఆర్ఆర్ తోట, సీఆర్ నగర్ మీదుగా వరద కాలువకు రూ.24.5కోట్లు, కాశిబుగ్గ నుంచి దేశాయిపేట వరకు వరద కాలువ కోసం రూ.30.15కోట్లు, హనుమకొండ అమృత టాకీస్ నుంచి పెద్దమ్మగడ్డ వరకు కాలువ లైనింగ్ కోసం రూ.12కోట్లు, నయీంనగర్ వద్ద నాలాపై వంతెనకు రూ.9కోట్లు, వరంగల్ రైల్వే ట్రాక్ నుంచి బొందివాగు నాలా వరకు రూ.10కోట్లతో పాటు 25 చోట్ల నాలాల అభివృద్ధి, రివిట్‌మెంట్, కొత్త వంతెనల తదితర పనుల కోసం కేటాయించిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. అయితే రూ.250కోట్లు ఖర్చు చేసి నాలాలను ఆధునికీకరించినా వరద ముంపు తగ్గేది 30శాతం నుంచి 40శాతమే అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భూగర్భ డ్రైయినేజీతోనే ముంపు సమస్యకు పూర్తి పరిష్కారం లభిస్తుందన్న అభిప్రాయాలు ఉండగా.. ఇందుకోసం గత 30ఏళ్లుగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళుతున్నా పట్టించుకునే వారు లేక మరుగున పడుతున్నాయి. పెరుగుతున్న జనాభా, కాలనీలకు అనుగుణంగా భూగర్భ డ్రైయినేజీ ఏర్పాటుపై ప్రణాళిక రూపొందించారు. సుమారు రూ.125కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు తయారు చేసి అప్పటి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ఆ తరువాత 2016లో అప్పటి కలెక్టర్ ఆమ్రపాలి నేతృత్వంలో భూగర్భ డ్రైయినేజీ వ్యవస్థపై ఈజీఐఎస్ సంస్థతో కలిసి కార్పొరేషన్ అధికారుల బృందం సర్వే నిర్వహించింది. నగరంలో విలీనమైన 42గ్రామాలతో పాటు నగరం మొత్తం భూగర్భ డ్రైయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సుమారు రూ.2,500కోట్లతో ప్రాథమికంగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు అందజేశారు. కానీ గత ప్రభుత్వం దీనిపై దృష్టిసారించకపోవటంతో అది మరుగున పడింది.

హసన్‌పర్తి ఎమ్మార్పీఎస్ కమిటీ నియామకం



నూతనంగా ఎన్నికైన ఎమ్మార్పీఎస్ కమిటీ

హసన్‌పర్తి, జూన్ 25: మండల కేంద్రంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ హసన్‌పర్తి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎమ్మెస్పీ జాతీయ నాయకులు వేల్పుల సూరన్న, రాజారపు భిక్షపతిల ఆధ్వర్యంలో కమిటీ నియామకం ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా ఆకుపనూరి సురేందర్, ప్రధానకార్యదర్శిగా గడిపె శివాజీ, అధికార ప్రతినిధిగా వెంకటేష్, ఉపాధ్యక్షుడిగా తాళ్ల తిరుపతి, కోశాధికారిగా జన్ను శేఖర్, కార్యదర్శిగా సునీల్, ప్రచార కార్యదర్శిగా ఈసంపెల్లి రాజేష్, ఎంవైఎస్ మాదిగ యువసేన అధ్యక్షుడిగా సందెల శివ, అధికార ప్రతినిధిగా మట్టెడ రామ్, ప్రధానకార్యదర్శిగా మట్టెడ లక్ష్మణ్‌లను ఎన్నుకున్నారు.

మాడ వీధుల పనులను పరిశీలించిన అధికారులు

వరంగల్ కల్చరల్, జూన్ 25: భద్రకాళి అమ్మవారి ఆలయానికి మాడ వీధుల నిర్మా ణ పనుల్లో భాగంగా ఆలయ నిర్మాణపు పనులను మంగళవారం డీఈ రమేష్‌బాబు పరిశీలించారు. ఈ మేరకు ఆలయ ఈవో శేషు భారతితో కలిసి పనులను పర్యవేక్షించారు. త్వరగా పనులు పూర్తి కావాలని సిబ్బందిని ఆదేశించి మాడ వీధుల నిర్మాణం జరిగే ప్రాం తాలను తిరిగి పర్యవేక్షించారు.



మాడ వీధుల నిర్మాణపు పనులను పరిశీలిస్తున్న డీఈ రమేష్‌బాబు

ప్రభుత్వపాలన విభాగంలో హరితహారం

కేయూ క్యాంపస్, జూన్ 25 : కాకతీయ యూనివర్సిటీ ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగంలో మంగళవారం హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ పెదమళ్ళ శ్రీనివాసరావు నేతృత్వంలో విద్యార్థులు, పరిశోధకులు మొక్కలు నాటి క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పెదమళ్ళ శ్రీనివాసరావు మాట్లాడుతూ..కేయూ పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు అందరు ముందుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ తోపుచర్ల యాదగిరిరావు, డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్, డాక్టర్ చీకటి శ్రీను, డాక్టర్ బుర్రి ఉమాశంకర్, డాక్టర్ మోహన్‌తోపాటు ఇతర విద్యార్థులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను రెగ్యూలరైజ్ చేయాలి

బాలసముద్రం, జూన్ 25: గత 30 ఏళ్లుగా సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో రాష్ట్ర వ్యాప్తంగా టెక్నికల్, నాన్ టెక్నికల్ సిబ్బందిని రెగ్యూలరైజ్ చేయాలని మంగళవారం కాంట్రాక్టు కార్మికులు హైదరాబాద్‌లోని సీఎం కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎస్. శ్రీనివాస్, జె.శ్రీనివాస్, సీహెచ్. లక్ష్మి పాల్గొన్నారు.

హాస్టల్‌లో దిగిన 24గంటల్లోనే బాలుడి మృతి!

- రాత్రి భోజనం చేశాక గదిలో స్నేహితులతో కలిసి నిద్ర
- తెల్లారినా నిద్రలేవకపోవడంతో ఆస్పత్రికి తరలించిన యజమాన్యం
- అప్పటికే మృతి.. కొంపల్లిలోని ఓ రెసిడెన్షియల్ పాఠశాలలో ఘటన


మల్లికార్జున్ (ఫైల్)

పేట్‌బషీరాబాద్, అల్లాదుర్గం, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): కొత్త విద్యాసంవత్సరం కోసం వేసవి సెలవుల తర్వాత తాను చదువుకుంటున్న రెసిడెన్షియల్ స్కూల్‌లో దిగిన ఆ 12 ఏళ్ల అబ్బాయి 24 గంటల్లోనే అనుమానాస్పద రీతిలో మృతిచెందాడు. అబ్బాయిని హాస్టల్‌లో వదిలిపెట్టి, ఇంటికెళ్లిన తర్వాత 12 గంటల్లోపే చిన్నారి ఇక లేడంటూ ఫోన్ రావడంతో ఆ తల్లిదండ్రులు కంటికీమంటికి ధారగా రోదించారు. హైదరాబాద్ కొంపల్లిలోని ఓ రెసిడెన్షియల్ పాఠశాలలో ఈ విషాద ఘటన జరిగింది. మృతుడు మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం చిల్వర్ గ్రామానికి చెందిన గొడ్డె బీరప్ప-మాధవి దంపతుల కుమారుడు మల్లికార్జున్ (12). సోమవారం సాయంత్రం మల్లికార్జున్‌తో కలిసి తల్లిదండ్రులు హాస్టల్‌కు వచ్చారు. బాబును హాస్టల్ నిర్వాహకులకు అప్పజెప్పి ఇంటికి వెళ్లిపోయారు. మల్లికార్జున్ ఆ రోజు రాత్రి భోజనం చేసిన తర్వాత తనకు కేటాయించిన గదిలో నలుగురు స్నేహితులతో కలిసి నిద్రపోయాడు. మంగళవారం తెల్లవారుజామున నిద్రలేచిన స్నేహితులు, మల్లికార్జున్‌ను లేపేందుకు ప్రయత్నించారు. అతడు లేవకపోవడంతో వార్డెన్‌కు సమాచారమిచ్చారు. కంగారుపడిన నిర్వాహకులు, బాలుడిని దగ్గర్లోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు చెప్పారు. ఈ సమాచారాన్ని స్కూల్ యాజమాన్యం ద్వారా తెలుసుకున్న తల్లిదండ్రులు హతాశులయ్యారు. బంధువులు, గ్రామస్థులను వెంటబెట్టుకొని పాఠశాల వద్దకొచ్చి ఆందోళన నిర్వహించారు. అబ్బాయిని సరిగా చూసుకోకపోవడంతోనే చనిపోయాడని నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు మృతుడి కుటుంబానికి, బంధువులకు మద్దతుగా అక్కడికొచ్చి ఆందోళన చేపట్టారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు ఆందోళన చేస్తున్న వారికి నచ్చజెప్పారు. స్కూల్ యాజమాన్యంతో మృతుడి బంధువులు, విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడారు. అనంతరం బాధిత కుటుంబానికి నష్టపరిహారం కింద రూ.10 లక్షల చెక్కును అందజేసినట్లు విద్యార్థి సంఘాల నాయకులు వెల్లడించారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సన్నాల జాబితా సిద్ధం



హైదరాబాద్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో సర్కారు బోనస్ అందించే సన్న రకం వరి వంగడాల జాబితా సిద్ధమైంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఛైర్మన్‌గా.. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ ఈమేరకు కసరత్తు పూర్తిచేసింది. ఎంపిక చేసిన విత్తన వెరైటీల జాబితాకు ఆమోద ముద్ర వేసి బుధవారం ప్రకటించే అవకాశాలున్నాయి. సన్నాల్లో 40 పబ్లిక్ వెరైటీలతోపాటు మరికొన్ని ప్రైవేటు వెరైటీలను కూడా జోడించి తుది జాబితా ప్రకటించనున్నారు. దీంతో రైతులకు సన్నాల సాగుపై స్పష్టత రానుంది.

పూర్తయిన కమిటీ కసరత్తు..

ఈ ఖరీఫ్ నుంచి సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అది కూడా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన వారికి మాత్రమే వర్తిస్తుంది. 2024-25 పంట కాలానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇటీవల కనీస మద్దతు ధరలను ప్రకటించింది. వరి సాధారణ రకానికి రూ.2,300, ఏ-గ్రేడుకు రూ.2,320 చొప్పున నిర్ణయించింది. దీనికి బోనస్ కలిపితే సన్నాలకు క్వింటా రూ.2,800 వరకు గిట్టుబాటు అవుతుంది. ఇదిలా ఉండగా సన్న రకాలు, దొడ్డు రకాల విషయంలో రైతులకు కొన్ని అనుమానాలున్నాయి. కొన్ని దొడ్డు వెరైటీలు కూడా సన్నాలుగా చలామణి అవుతున్నాయి. ఈ క్రమంలో ఏయే రకాలు సన్నాలు..? వేటికి బోనస్ ఇస్తారు.? అనే అంశాలపై రైతులకు స్పష్టత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగియక ముందు నిర్వహించిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సన్న రకాల జాబితాను అధికారికంగా ప్రకటించాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్/డైరెక్టర్ ఛైర్మన్‌గా నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఆచార్య జయశంకర్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు, రాష్ట్ర వ్యవసాయ, పౌర సరఫరాల శాఖ అధికారులు, ఆదర్శ రైతులతో కమిటీని వేసింది. ఆ కమిటీ కసరత్తుచేసి సన్నాల జాబితాను తయారు చేసింది.

జాబితాలో ఉన్నవి ఇవే..

కమిటీ రూపొందించిన జాబితాలో ఆర్ఎన్ఆర్-15048(తెలంగాణ సోనా), కేఎన్ఎం-1638, జేజీఎల్-1798, వరంగల్-962, జేజీఎల్-3844, జేజీఎల్-11118, కేఎన్ఎం-733, వరంగల్-1119, ఆర్ఎన్ఆర్-21278, జేజీఎల్-17004, వరంగల్-44, బీపీటీ-5204, జేజీఎల్-11470, జేజీఎల్-384, జేజీఎల్-3828, జేజీఎల్-3855, జేజీఎల్-11727, వరంగల్-347, వరంగల్-14, వరంగల్-32100, ఆర్ఎన్ఆర్-2458, కేపీఎస్-2874, ఆర్ఎన్ఆర్-2354, ఆర్ఎన్ఆర్-2465, వరంగల్-697, జేజీఎల్-28545, జేజీఎల్-27356, హెచ్ఎంటీ సోనా, బీపీటీ-2595, బీపీటీ-5204, ఎంటీయూ-1064, ఎంటీయూ-1121, ఎంటీయూ-1224, ఎంటీయూ-1262, ఎంటీయూ-1271, ఎంటీయూ-1282, ఎన్‌డీఎల్ఆర్-7, ఎస్ఎల్ఆర్-34449 తదితర ఫైన్ వెరైటీలు ఉన్నాయి. వీటితో పాటు కొన్ని ప్రైవేటు కంపెనీలు 'ట్రూత్ ఫుల్ లేబుల్' తో విక్రయించే వెరైటీలు కూడా నిపుణుల కమిటీ ఎంపిక చేసిన జాబితాలో ఉన్నాయి. రైతులు ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకమైన ప్రైవేటు విత్తనాలను సాగు చేస్తున్నారు. వాటిలో కొన్ని ప్రాచుర్యం పొందిన వెరైటీలు ఉన్నాయి. కొన్నేమో అంతగా తెలియనివి ఉన్నాయి. అన్నింటినీ పరిగణనలోకి తీసుకొని జాబితా రెడీ చేశారు. ఇక పబ్లిక్ వెరైటీల జాబితాలో మాత్రం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధ్రువీకరించిన విత్తనాలు వెరైటీ నంబర్లతో సహా ఉంటాయి. సన్నాల జాబితాలో 6 మి.మీ కంటే తక్కువ పొడవున్న వెరైటీలను తీసుకుంటారు. గింజ పొడవు, వెడల్పుల నిష్పత్తి 2.5 కంటే ఎక్కువగా ఉంటుంది. రాష్ట్ర మంత్రి మండలి ఆదేశాలకు అనుగుణంగా నిపుణుల కమిటీ బుధవారం సన్న వెరైటీల జాబితాను ఫైనల్ చేసి ప్రకటించే అవకాశాలున్నాయి.

ప్రధాని నరేంద్ర మోదీ రామభక్తులకు క్షమాపణ చెప్పాలి

- టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్

హైదరాబాద్, జూన్ 25(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో లబ్ధి పొందాలనే దురుద్దేశంతో ఆదరా బాదరాగా రామ మందిరాన్ని ప్రారంభించి ఘోరమైన అపచారం చేసిన ప్రధాని మోదీ రామ భక్తులకు, భారత ప్రజలకు క్షమాపణలు చెప్పాలని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ డిమాండ్ చేశారు. జనవరి 22న మోదీ చేతుల మీదుగా బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరిగిన అయోధ్య ఆలయ గోపురం నుంచి సోమవారం వర్షపు నీరు లీక్ కావడం యావత్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచిందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడిన ఆయన... ఆలయ నిర్మాణంలో నిర్లక్షంగా వ్యవహరించారని, ఆలయ ప్రాంగణం నుంచి నీరు పోయేటట్లు సరైన ఏర్పాట్లు చేయలేదని ఆరోపించారు. పనులు పూర్తికాకపోయినా కేవలం ఎన్నికలలో లబ్ధి పొందడానికే ప్రాణ ప్రతిష్ఠ చేశారన్నారు. నిర్మాణం పూర్తికాకముందే ప్రాణప్రతిష్ఠ చేయవద్దని పలువురు ఆగమ శాస్త్ర పండితులు చెప్పినా పెడచెవిన పెట్టారని విమర్శించారు.

వన్‌కాయిన్ పేరుతో.. రూ.300 కోట్లకు టోకరా

తెలంగాణ, ఏపీ, కర్ణాటకల్లో బాధితులు.. కర్ణాటకలో కేసు నమోదు

- కర్నూలుకు చెందిన పాత్రధారికి బేడీలు
- ఈ ఒక్క ఏజెంట్ పరిధిలో 3,600 మంది బాధితులు



మహబూబ్‌నగర్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'వన్‌కాయిన్ వర్చువల్ కరెన్సీ పేరుతో కేటుగాళ్లు పాలమూరు సహా.. సరిహద్దుల్లోని రెండు రాష్ట్రాల ప్రజలను రూ.300 కోట్ల మేర మోసగించిన ఉదంతమిది. వన్‌కాయిన్‌పై పెట్టుబడి పేరుతో 2014లో దుబాయ్, బల్గేరియా కేంద్రంగా చైనీయులు ప్రారంభించిన మోసాలు.. 2018లోనే కీలక సూత్రధారి రుజా ఇగ్నటోవ అరెస్టయినా.. భారత్‌లో.. ప్రత్యేకించి, తెలంగాణలో ఈ దందా కొనసాగడం గమనార్హం.! బాధితుల కథనం ప్రకారం.. వన్‌కాయిన్ ఎకో సిస్టమ్ పేరుతో సాగిన ఈ దందాలో.. ఏపీ, తెలంగాణతోపాటు.. కర్ణాటకకు చెందిన సుమారు 3,600 మంది బాధితులు ఉన్నట్లు.. వీరంతా రూ.300 కోట్ల మేర మోసపోయినట్లు సమాచారం. ఒక్క గద్వాల జిల్లాలోనే 80 మంది బాధితులు రూ.70 కోట్ల వరకు మోసపోయినట్లు తెలిసింది. కర్నూలుకు చెందిన వన్‌కాయిన్ మర్చంట్(ఏజెంట్) వీరితో పెట్టుబడులు పెట్టించారు. 2016లో ఈ దందా భారత్‌లో ప్రారంభమైంది. గొలుసుకట్టు(మల్టీ-లెవల్ మార్కెటింగ్) తరహాలో ఒకరి నుంచి మరొకరికి ప్రచారం జరిగింది. "బిట్‌కాయిన్స్ తర్వాతి స్థానం వన్‌కాయిన్‌దే.! ఆలసించిన ఆశాభంగం" అంటూ ఊదరగొట్టిన కేటుగాళ్లు.. యూరోల్లోనే దందాను సాగించారు. అప్పట్లో 49.5 యూరోలకు ఒక కాయిన్‌ను విక్రయించారు. తొలినాళ్లలో కేటుగాళ్లు వన్‌కాయిన్ విలువను అమాంతం పెంచేస్తూ.. విత్‌డ్రాకు అవకాశమిచ్చారు. 2018లో వన్‌కాయిన్ సూత్రధారి విదేశాల్లో అరెస్టవ్వడంతో.. పెట్టుబడిదారులకు విత్‌డ్రా ఆప్షన్ లేకుండా చేశారు. దీంతో బాధితులంతా కర్నూలులోని మర్చంట్‌ను నిలదీశారు. దాంతో అతను మరో మోసానికి తెరతీయడం గమనార్హం..! "డీల్ షేకర్ పెట్టుబడులను ఆహ్వానిస్తున్నాం. వర్చువల్‌గా మీ దగ్గరున్న వన్‌కాయిన్లతోపాటు.. రూ.లక్ష, రూ.2లక్షలు.. ఇలా పెట్టుబడి పెట్టాలి" అని సూచించాడు. దీంతో బాధితులు మర్చంట్ చెప్పిన మొత్తం చెల్లించారు. అయితే, విత్‌డ్రా అవకాశం ఇవ్వకపోవడంతో బాధితులు అతణ్ని నిలదీయగా.. "ఆత్మహత్య చేసుకోవడమే నాకు మార్గం. వియత్నాంలో వన్‌కాయిన్ హెడ్‌క్వార్టర్ ఉంది. అక్కడి వారితో మాట్లాడుతున్నా. ఇప్పటికే నా సొంత డబ్బుతో షేర్‌మార్కెట్‌లో సంపాదించి, బాధితులకు రూ.300 కోట్లు చెల్లించాను. ఇంకా రూ.287 కోట్లు చెల్లించాలి" అంటూ నచ్చజెప్పినట్లు బాధితులు చెబుతున్నారు. అయితే.. కర్ణాటకలోని చిత్రదుర్గకు చెందిన బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కర్నూలు మర్చంట్‌ను అరెస్టు చేశారు. ఈ విషయమై గద్వాల డీఎస్పీ సత్యనారాయణను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. ఇప్పటి వరకు తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని చెప్పారు.

హుజూరాబాద్‌లో ఉద్రిక్తత

- హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, కాంగ్రెస్ నేత ప్రణవ్ హౌస్ అరెస్టు
- నేతల సవాళ్ల నేపథ్యంలో పోలీసు చర్య
- చెల్పూర్ హనుమాన్ గుడి వద్ద లాఠీచార్జి


తడి దుస్తులతో హనుమాన్ చిత్రపటంపై ప్రమాణం చేస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్/హుజూరాబాద్ రూరల్, వీణవంక: జూన్ 25: కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య జరుగుతున్న మాటల యుద్ధం మంగళవారం ఉద్రిక్తతలకు దారి తీసింది. మంత్రి పొన్నం ప్రభాకర్ అండదండలతో ఎన్టీపీసీ నుంచి హుజూరాబాద్ మీదుగా ఖమ్మంకు ఫ్లైయాష్‌ను అక్రమంగా తరలిస్తున్నారని బీఆర్ఎస్ నేత, హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇటీవల ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలపై స్పందించిన హుజూరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ రెండ్రోజుల క్రితం విలేకరులతో మాట్లాడుతూ ప్రచారం కోసమే కౌశిక్ రెడ్డి ఈ ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే అవ్వకముందు ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగుల నుంచి, అలాగే మానేరు నుంచి ఇసుక తీసుకెళ్లే లారీల వద్ద నుంచి లక్షల రూపాయలు వసూలు చేశారని విమర్శించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయని, కౌశిక్ రెడ్డి చెల్పూర్‌లోని హనుమాన్ ఆలయానికి వస్తే నిరూపిస్తానని ప్రణవ్ సవాల్ విసిరారు. ఈ సవాల్‌ను స్వీకరించిన కౌశిక్ రెడ్డి ఆలయానికి వస్తానని ప్రకటించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు.. చెల్పూర్ ఆలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కౌశిక్ రెడ్డికి వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు రాత్రికిరాత్రే ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించారు. ఆలయం వద్దకు రావద్దని బీఆర్ఎస్ నాయకులను హెచ్చరించారు. కాంగ్రెస్ శ్రేణులు ఆలయానికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. అయితే తన పెళ్లి రోజు అని చెప్పి ఆలయానికి వెళ్లిన చెల్పూర్ మాజీ సర్పంచ్ నేరేళ్ల మహేందర్‌గౌడ్ పూజల అనంతరం మాట్లాడుతూ కౌశిక్‌రెడ్డి సవాల్‌కు రాలేదంటూ ఆరోపించారు. ఈ క్రమంలో ఆలయం వద్దకు వెళ్లేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు ప్రయత్నించగా లాఠీచార్జి చేసిన పోలీసులు వారిని చెదరగొట్టారు. సిగలత అనే మహిళా కార్యకర్తను అదుపులోకి తీసుకున్నారు. ప్రణవ్, కౌశిక్ రెడ్డి హనుమాన్ ఆలయానికి రాకుండా పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. హుజూరాబాద్ మండలం సింగాపూర్‌లో ప్రణవ్‌ను, కౌశిక్ రెడ్డిని స్వగ్రామమైన వీణవంకలోనే పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు హౌస్ అరెస్టు చేయడంతో కౌశిక్ రెడ్డి తన ఇంటి వద్దే తడి దుస్తులతో ఆంజనేయ స్వామి చిత్రపటంపై ప్రమాణం చేశారు. అనంతరం మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ తనను ఎందుకు అడ్డుకుంటున్నారో చెప్పాలన్నారు. ఫ్లైయాష్ రవాణా అంశంలో తన ఆరోపణలు అవాస్తవాలని ఎందుకు నిరూపించడం లేదని ప్రశ్నించారు.

నా కుమారుడిని రక్షించండి ప్లీజ్!

- బంగ్లాదేశ్‌లో కన్నతల్లే చిత్రహింసలు పెడుతోంది
- వికారాబాద్ వాసి మొర.. బండి సంజయ్‌కు విజ్ఞాపన పత్రం


విశాల్


సంజయ్‌కు వినతిపత్రం అందజేస్తున్న తిరుపతి (ఫైల్)

కరీంనగర్ క్రైం, జూన్ 25: మనస్పర్థల కారణంగా భర్త నుంచి భార్య విడిపోయినా కుమారుడి పట్ల ఆమెకున్న వాత్సల్యం ఆవిరవుతుందా? కన్నతల్లిననే సంగతి మరిచిపోయి చిన్నారికి చిత్రహింసలు పెడుతుందా? బంగ్లాదేశ్‌లో ఓ యువతి ఇదే ఉన్మాదం ప్రవర్తిస్తుంటే ఆ బాలుడి తండ్రి అయిన వికారాబాద్ జిల్లా వాసి మనసు తల్లడిల్లిపోతోంది. బాలుడికి చిత్రహింసలు పెడుతూ.. ఆ వీడియోలు భర్తకు పంపుతున్న ఆమె, డబ్బులు పంపితేనే చిన్నారిని భారత్‌కు పంపుతానంటూ బ్లాక్‌మెయిల్ చేస్తోంది. తన కుమారుడిని కన్నతల్లి చెర నుంచి విడిపించి.. బంగ్లాదేశ్ నుంచి సురక్షితంగా తన చెంతకు చేర్చాలని ఆ తండ్రి, కేంద్ర ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాడు. ఈ మేరకు ఇప్పటికే కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కలిసి విజ్ఞప్తి చేశాడు. మరోసారి కేంద్రమంత్రిని కలిసేందుకు కరీంనగర్‌కు వచ్చిన సందర్భంగా బాధితుడు 'ఆంధ్రజ్యోతి'తో తన గోడును వెళ్లబోసుకున్నాడు. బాధితుడి వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన తిరుపతి 2016లో ఉపాధి కోసం ముంబైకి వెళ్లాడు. అక్కడ మీరా రోడ్‌లో భవన నిర్మాణ కార్మికుడిగా పని చేసేవాడు. అతడికి అక్కడే రియా అనే బంగ్లాదేశ్ అమ్మాయి పరిచయమైంది. కొంతకాలానికి వారు పెళ్లి చేసుకున్నారు. తిరుపతి-రియా దంపతులకు కుమారుడు విశాల్ (5) పుట్టాడు. కొన్నాళ్లకు మనస్పర్థలు ఏర్పడటంతో దంపతులు విడిపోయారు. విశాల్‌ను వెంటబెట్టుకొని తిరుపతి, ముంబై నుంచి సొంతూరుకు తిరిగొచ్చేశాడు. కొంతకాలానికి తిరుపతికి రియా నుంచి ఫోనొచ్చింది. తాను తిరిగి బంగ్లాదేశ్‌కు వెళ్తున్నానని, తనకు విశాల్‌ను చూడాలనిపిస్తోందని, ముంబైకి తీసుకొస్తే చూసి వెళ్లిపోతానని తిరుపతికి చెప్పింది. ఆమె మాటలు నమ్మి కుమారుడిని వెంటబెట్టుకొని తిరుపతి ముంబైకి వెళ్లాడు. అక్కడ తిరుపతిపై దాడి చేసిన రియా, కుమారుడిని తీసుకొని బంగ్లాదేశ్ వెళ్లిపోయింది. ఈ ఘటనపై ముంబైలోని పోలీసులకు తిరుపతి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. కొన్నాళ్లకు.. రియా బంధువులు డబ్బులివ్వాలంటూ తిరుపతికి డిమాండ్ చేశారు. విశాల్‌కు చిత్రహింసలు పెడుతున్న వీడియోలు, ఫొటోలను వాట్సాప్ ద్వారా అతడికి పంపారు. డబ్బులిస్తేనే బాబును భారత్‌కు పంపుతామని, అప్పటిదాకా చిన్నారికి బాధలు తప్పవని అతడికి తేల్చి చెప్పారు. దిక్కుతోచని స్థితిలో పడిపోయిన తిరుపతి ఇటీవల కరీంనగర్‌కు వచ్చాడు. అక్కడ బండి సంజయ్‌ని కలిసి సమస్యను వివరించి.. విజ్ఞాపన పత్రం అందించాడు. బంగ్లాదేశ్‌లో ఉన్న కుమారుడిని క్షేమంగా తన చెంతకు చేర్చాలని బండి సంజయ్‌ను వేడుకున్నాడు.



అలపట.. దాపటకు డిమాండు!

- అద్దెకు కాడెడ్లు.. పత్తి, పసుపు సాగులో వినియోగం
- రోజుకు రూ.1800 దాకా.. ఎకరం వారీగా రూ.1000
- నాగలి, మనిషితోనైతే మరింత.. రూ.2,500 వరకు

జగిత్యాల, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): పంటల సాగు పరంగా ఎన్నో అధునాతన యంత్రాలు వచ్చినా.. కొన్నిచోట్ల విత్తనాలను నాగలి, గుంటుకతోనే విత్తుతున్నారు! ఫలితంగా కాడెడ్లకు గిరాకీ పెరిగింది. ఈ రోజుల్లో ఎడ్ల ధరలు బాగా పెరగడం, పోషణ భారమవడంతో మునుపటి తరహాలో పోషించడానికి రైతులు జంకుతున్నారు. ఫలితంగా గ్రామాల్లో కాడెడ్లు బాగా తగ్గిపోవడంతో అద్దె ధరలూ పెరిగాయి. ప్రత్యేకించి పత్తి, పసుపు సాగులో నాగలి, గుంటుకనే ఉపయోగిస్తున్నారు. కాడెడ్లను ఎకరం, రోజువారీగా అద్దెకు ఇస్తున్నారు. జగిత్యాల జిల్లాలో రోజువారీగా అద్దె కింద రూ. 1,500 నుంచి రూ. 1,800 వరకు వసూలు చేస్తున్నారు. అరక సామగ్రితో పాటు మనిషి అవసరమైతే రూ.2వేల నుంచి రూ.2,500 దాకా తీసుకుంటున్నారు. ఎకరం చొప్పునైతే రోజుకు రూ.800-1000 తీసుకుంటున్నారు. పంటల సాగు సీజన్ కావడంతో అవసరపడిన రైతుల్లో కొందరు కాడెడ్లను నెలల తరబడి అద్దెకు తీసుకుంటున్నారు. అప్పుడు పోషణ భారం ఆ రైతుదే కాబట్టి అద్దె భారం బాగా తగ్గుతోంది.

రోజుకు రూ. 2,500 చెల్లించాను



నాకున్న మూడు ఎకరాల్లో పసుపు సాగు చేస్తున్నా. ఎడ్లు కొనుగోలు చేసే స్థోమత లేదు. రోజుకు రూ. 2,500 అద్దెకు కాడెద్దులు తీసుకుని పసుపు సాళ్లు ఏర్పాటు చేసుకొని విత్తనాలు వేశాను.

- బండారి వెంకటేశ్, రైతు, పెంబట్ల, సారంగపూర్ మండలం

పోలీసుల అదుపులో గంజాయి ముఠా

- పంతంగి టోల్‌గేట్ వద్ద 300 కిలోలు పట్టివేత?
- నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో ఘటన

చౌటుప్పల్ రూరల్, జూన్ 25: గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న ముఠా సభ్యులను యాదాద్రిభువనగిరి జిల్లా పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌గేట్ వద్ద వీరిని అరెస్టు చేసి 300కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం నుంచి హైదరాబాద్‌కు ఇన్నోవా కారులో గంజాయి తరలిస్తుండగా సమాచారం అందుకున్న రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఎస్‌వోటీ పోలీసులు చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేటు వద్ద మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారినుంచి సుమారు 300 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఇన్నోవా వాహనం, ఎస్కార్ట్‌గా ఉన్న షిఫ్ట్ కారును స్వాధీనం చేసుకున్నారు. పూర్తి వివరాలు బుధవారం వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.


ఏకమైన ఉద్యోగ సంఘాల జేఏసీలు

- డిమాండ్ల సాధన కోసం 40 సంఘాల భేటీ

హైదరాబాద్, జూన్ 25(ఆంధ్రజ్యోతి): డిమాండ్ల సాధన కోసం తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీలు ఏకమయ్యాయి. తమ సమస్యలను పరిష్కరించాలని ఇప్పటి వరకు వివిధ సంఘాలు వేర్వేరుగా ప్రభుత్వానికి వినతి పత్రాలు అందించాయి. ఆరు నెలలుగా స్పందన లేకపోవడంతో.. ఐక్యంగా పోరాటం చేయాలని మంగళవారం సంఘాలు సమావేశమయ్యాయి. తెలంగాణ ఎన్జీవోల కేంద్ర సంఘం కార్యాలయంలో టీఎన్జీవో అధ్యక్షుడు మారం జగదీశ్వర్, టీజీవో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో సుమారు 40 సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పనిచేయాలని తీర్మానించారు. సమావేశంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పింఛనుదారుల సమస్యలపై చర్చించారు. సమస్యల పరిష్కారంపై ప్రభుత్వంతో చర్చించిన తర్వాత.. తదుపరి సమావేశంలో కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. 21 డిమాండ్లతో ప్రభుత్వానికి వినతి పత్రం అందించారు.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
బుధవారం • 26 జూన్ 2024
cinema@andhrajyothy.com

అధర్మాన్ని అణిచేయగా...



భారీ అంచనాల మధ్య 'కల్కి 2898 ఏడీ' చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమాపై భారీ అంచానాలు ఉన్నాయి. ప్రమోషనల్ కంటెంట్‌తో చిత్ర బృందం ఎప్పటికప్పుడు ఆ అంచనాలను రెట్టింపు చేస్తోంది. తాజాగా 'థీమ్ ఆఫ్ కల్కి' లిరికల్ వీడియోను మంగళవారం విడుదల చేశారు. 'అధర్మాన్ని అణిచేయగా' అంటూ చంద్రబోస్ రాసిన ఈ పాటను కాలభైరవ పాడారు. సంతోష్ నారాయణ్ స్వరాలు సమకూర్చారు. పాత్రల తాలుకు నేపథ్యం, వాటి సంఘర్షణ.. ఇవన్నీ పాటలో చూపించారు. ఇటీవల ఈ పాటను మధురలో ఆవిష్కరించారు. ప్రముఖ నటి, నర్తకి శోభనా చంద్రకుమార్ ఈ పాట కోసం గజ్జె కట్టారు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతీ మూవీస్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, ప్రభాస్, దీపిక, దిశా పటాని కీలక పాత్రలు పోషించారు.



నేతాజీ మార్గంలో నేను

'ఇది రెండో స్వతంత్ర పోరాటం... గాంధీజీ మార్గంలో మీరు, నేతాజీ మార్గంలో నేను' అంటున్నారు కమల్‌హాసన్. ఆయన కథానాయకుడిగా నటించిన 'ఇండియన్ 2' (తెలుగులో 'భారతీయుడు 2') చిత్రంలోనిదీ డైలాగ్. మంగళవారం చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. దేశంలో అవినీతిపరులను ఏరి పారేసేందుకు ఈ సారి సేనాపతి పాత్రలో కమల్‌హాసన్ ఎలాంటి సాహసాలు చేయబోతున్నాడో అనే ఆసక్తిని కలిగించేలా ట్రైలర్‌ను రూపొందించారు. కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్‌సింగ్, సిద్ధార్థ్ కీలకపాత్రలు పోషించిన ఈ చిత్రానికి శంకర్ దర్శకుడు. 1996లో వచ్చిన 'భారతీయుడు' చిత్రానికి ఇది కొనసాగింపు. జూలై 12న 'భారతీయుడు 2' ప్రేక్షకుల ముందుకు రానుంది. లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్ బానర్స్‌పై సుభాస్కరన్ నిర్మించారు.

శ్రీవారికి తలనీలాలు సమర్పించిన
గాయని సుశీల



సీనియర్ నేపథ్య గాయని పి. సుశీల మంగళవారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. సోమవారం రాత్రి తిరుమలకు చేరుకున్న ఆమె శ్రీవారికి తలనీలాలు సమర్పించి మంగళవారం ఉదయం ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు. ఆలయం ముందు సుశీలను చూసిన పలువురు అభిమానులు దగ్గరకు వెళ్లి పలకరించారు. కొందరు ఆమెతో సెల్ఫీలు తీసుకున్నారు. ఎన్నాళ్ల నుంచో స్వామి వారికి తలనీలాలు సమర్పించే మొక్కు ఉందనీ, ఇన్నాళ్లకు అది తీరిందని సుశీల చెప్పారు.

తిరుమల, (ఆంధ్రజ్యోతి)

సెప్టెంబర్‌లో ఎమర్జెన్సీ



బాలీవుడ్ హీరోయిన్ కంగనా రనౌత్ ఇందిరా గాంధీ పాత్రలో నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'ఎమర్జెన్సీ'. గతేడాదే చిత్రీకరణ పూర్తయింది. పలుమార్లు విడుదల తేదీని ప్రకటించినా ప్రేక్షకుల ముందుకు తీసుకురాలేకపోయారు. తాజాగా చిత్రబృందం కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటించింది. సెప్టెంబర్ 6న 'ఎమర్జెన్సీ' ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో ఇందిరాగాంధీ పాత్రలో కంగన లుక్ ఆకట్టుకుంది. 'మణికర్ణిక' చిత్రం తర్వాత కంగన దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. మాజీ ప్రధాని వాజ్‌పాయ్ పాత్రలో శ్రేయస్ తల్పడే, జయప్రకాశ్ నారాయణ్ పాత్రలో అనుపమ్ ఖేర్ కనిపించనున్నారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కంగనా రనౌత్ మధ్య ప్రదేశ్‌లోని మండి నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున ఎంపీగా గెలిచిన విషయం తెలిసిందే.

ఎలా ఉన్నావ్ శ్రీలీల

- బుగ్గ గిల్లి.. ఆప్యాయంగా పలకరించిన సంగీత దర్శకుడు తమన్



శ్రీవారి దర్శనార్థం వచ్చిన హీరోయిన్ శ్రీలీలను చూసిన సినీ సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్ ఆప్యాయంగా పలకరించారు. శ్రీలీల మంగళవారం స్వామిని దర్శించుకుని ఆలయం వెలుపలకు వస్తున్న క్రమంలో దర్శనానికి వెళుతున్న తమన్ మహాద్వారం వద్ద ఎదురుపడ్డారు. దీంతో తమన్ ఆగి శ్రీలను బుగ్గ గిల్లి.. ఎలా ఉన్నావ్ అంటూ పలకరించారు. అనంతరం శ్రీలీల తన కుటుంబ సభ్యులను తమన్‌కు పరిచయం చేసింది. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

తిరుమల, (ఆంధ్రజ్యోతి)

ఆయ్.. ఆగస్టులో వస్తున్నామండీ



నార్నే నితిన్, నయన్ సారిక జంటగా నటించిన 'ఆయ్' చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది. ఎన్నో విజయవంతమైన చిత్రాలను అందించిన ప్రముఖ సంస్థ జీఏ 2 పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ సినిమాతో అంజి కె మణిపుత్ర దర్శకుడిగా పరిచయమవుతున్నారు. డిఫరెంట్ ప్రమోషనల్ కంటెంట్‌తో ఈ సినిమా ఇప్పటికే అందరినీ ఆకర్షిస్తోంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు బన్నీ వాసు, విద్యా కొప్పినీడి మాట్లాడుతూ 'ఆగస్టు 15 గురువారం. ఆ తర్వాత రోజు నుంచి వీకెండ్ మొదలవుతుంది. ఇక సోమవారం రక్షా బంధన్. అందుకే ఆ డేట్‌ను ఎన్నుకున్నాం. గోదావరి బ్యాక్‌డ్రాప్‌తో ఈ సినిమా రూపుదిద్దుకుంది. ఈ ఫన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తో నార్నే నితిన్ ప్రేక్షకులను ఆకట్టుకుంటారు' అని చెప్పారు. అల్లు అరవింద్ సమర్పణలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి సంగీతం: రామ్ మిర్యాల, సినిమాటోగ్రఫీ: సమీర్ కల్యాణి.



అరవై ఏళ్ల అద్భుత చరిత్ర కలిగిన సురేశ్ ప్రొడక్షన్స్ సంస్థ రెండేళ్ల గ్యాప్ తర్వాత అందిస్తున్న చిత్రం '35.. చిన్న కథ కాదు'. ఇటువంటి ఆసక్తికరమైన టైటిల్‌తో న్యూ ఏజ్ ఫ్యామిలీ డ్రామాగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, తమిళ దర్శకుడు భాగ్యరాజా ముఖ్య పాత్రలు పోషించారు. నందకిశోర్ ఈమని దర్శకత్వంలో రానా దగ్గుబాటి, సృజన్

న్యూ ఏజ్ ఫ్యామిలీ డ్రామా

యరబోలు, సిద్దార్థ్ రాళ్లపల్లి నిర్మిస్తున్నారు. స్కూల్ ఎపిసోడ్స్ స్పెషల్ ఎట్రాక్షన్‌గా రూపుదిద్దుకున్న ఈ క్లీన్ ఎంటర్‌టైనర్‌ను ఆగస్టు 15న తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో ఒకేసారి విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: వివేక్ సాగర్, ఫొటోగ్రఫీ: నికేత్ బొమ్మి, ఎడిటింగ్: టీసీ ప్రసన్న.

కలయిక కుదిరిందా?

దక్షిణాదితో పాటు బాలీవుడ్‌లోనూ హిట్ చిత్రాలతో టాప్ కథానాయికగా ఎదిగారు రష్మిక మందన్న. అక్కడి అగ్ర దర్శకులు, నిర్మాతల నుంచి హీరోయిన్‌గా అవకాశాలు వెల్లువెత్తుతున్నా ఆమె మాత్రం ఆచి తూచి సినిమాలను ఎంచుకుంటున్నారు. అయితే రష్మిక ఓ కొత్త ప్రాజెక్ట్‌కు 'ఎస్' చెప్పారని ప్రస్తుతం బాలీవుడ్‌లో వినిపిస్తోంది. 'స్త్రీ, భేడియా, ముంజ్యా' లాంటి హారర్ చిత్రాలతో నిర్మాతగా వరుస విజయాలను దక్కించుకున్న దినేశ్ విజన్ గ్రామీణ



నేపథ్యంలో 'వాంపైర్స్ ఆఫ్ విజయ్ నగర్' పేరుతో ఓ హారర్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో ఆయుష్మాన్ ఖురానా కథానాయకుడిగా నటిస్తున్నారు. ఆయనకు జోడీగా రష్మికను ఎంపిక చేశారని అక్కడి పరిశ్రమ వర్గాల్లో వినిపిస్తోంది. అయితే అధికారిక ప్రకటన వస్తేనే ఈ కాంబినేషన్‌పై స్పష్టత వస్తుంది. ఈ ఏడాది చివర్లో ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది. రష్మిక ప్రస్తుతం అల్లు అర్జున్ 'పుష్ప 2: ది రూల్', సల్మాన్‌ఖాన్ 'సికందర్' చిత్రాల్లో నటిస్తున్నారు.



పవన్‌తో అల్లు అరవింద్ భేటీ



ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఎన్నికల్లో కూటమి అద్భుత విజయం సాధించిన నేపథ్యంలో పవన్ కల్యాణ్‌కు అభినందనలు తెలిపారు. ఏపీలో సినీ నిర్మాణ రంగం, ప్రదర్శన రంగం ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు చిత్ర పరిశ్రమ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను గురించి ఈ సమావేశంలో వారి మధ్య చర్చకు వచ్చినట్లు తెలిసింది.

డివోషనల్ థ్రిల్లర్



ఆది సాయికుమార్, అవికా గోర్ జంటగా రూపుదిద్దుకుంటున్న డివోషనల్ థ్రిల్లర్ 'షణ్ముఖ'. ఈ చిత్రానికి షణ్ముగం సాప్పని దర్శకుడు. ఇంతకుముందు 'శాసనసభ' చిత్రాన్ని నిర్మించిన తులసీరామ్ సాప్పని, షణ్ముగం సప్పని, రమేశ్ యాదవ్ ఈ సినిమాకు నిర్మాతలు. దర్శకుడు మాట్లాడుతూ 'ఇప్పటివరకూ ఎవరూ టచ్ చేయని ఓ అద్భుతమైన పాయింట్‌తో రూపుదిద్దుకుంటున్న డివోషనల్ థ్రిల్లర్ ఇది. అద్భుతమైన గ్రాఫిక్స్‌తో విజువల్ వండర్‌గా ఉంటుంది. ఇటీవల హైదరాబాద్‌లో నిర్మించిన భారీ సెట్‌లో చివరి షెడ్యూల్ పూర్తయింది. రవి బస్రూర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. హీరో ఆది కెరీర్‌లో ఓ మైలు రాయిగా నిలిచిపోతుంది' అని చెప్పారు.

అజర్ బైజాన్‌లో అజిత్ యాక్షన్



తమిళ హీరో అజిత్ కుమార్ మరోసారి తనలోని యాక్షన్ కోణాన్ని సరికొత్తగా చూపించబోతున్నారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న 'విడాముయార్చి' చిత్రం తాజా షెడ్యూల్ అజర్ బైజాన్‌లో మొదలైంది. 45 రోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో పతాక సన్నివేశాల్లో భాగంగా భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను అక్కడ చిత్రీకరించనున్నారు. మంగళవారం మేకర్స్ షూటింగ్‌కు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో విడుదల చేశారు. ప్రమాదకరమైన స్టంట్స్‌లోనూ అజిత్ డూప్‌ను వాడడం లేదు అని చిత్రబృందం తెలిపింది. తిరుమేని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో త్రిష కథానాయిక. అర్జున్ సర్జా, రెజీనా కసాండ్రా కీలకపాత్రలు పోషిస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందిస్తున్నారు.

ఎస్.. బాస్..
షూటింగ్ పూర్తయింది



'రాక్షసుడు', 'ఖిలాడీ' వంటి చిత్రాలను అందించిన నిర్మాత, కె.ఎల్ యూనివర్సిటీ ఛైర్మన్ కోనేరు సత్యనారాయణ నిర్మిస్తున్న తాజా చిత్రం 'ఎస్..బాస్'. మంగళవారం చిత్ర కథానాయకుడు హవీస్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుంచి ఆయన స్టైలిష్ లుక్ విడుదల చేశారు. 'భాగమతి' వంటి బ్లాక్ బస్టర్ చిత్రాన్ని రూపొందించిన దర్శకుడు అశోక్ పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రూపుదిద్దుకుంటున్న 'ఎస్ బాస్' షూటింగ్ పూర్తయింది. ఈ చిత్రానికి కథ, మాటలు: ఆకుల శివ, సంగీతం: అనూప్ రూబెన్స్, ఫొటోగ్రఫీ: కబీర్‌లాల్.

వచ్చే ఐదేళ్లలో

2025-26లో పబ్లిక్ ఇష్యూకి..

వచ్చే ఏడాది మంత్రాలయం ప్లాంట్ విస్తరణ పూర్తి

రూ.2,000 కోట్ల పెట్టుబడులు

ఎంఐపీపీఎల్ సీఈఓ అభిషేక్ అగర్వాల్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న మారుతి ఇస్పాత్ అండ్ పైప్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎంఐపీపీఎల్) వచ్చే ఐదేళ్లలో రూ.2,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. మంగళవారం నాడిక్కడ కంపెనీ కొత్త ఉత్పత్తి 'ఎంఎస్ వాయు' విడుదల చేసిన సందర్భంగా సంస్థ సీఈఓ అభిషేక్ అగర్వాల్ మాట్లాడుతూ.. కార్యకలాపాల విస్తరణ కోసం ఈ మొత్తాలను వెచ్చించనున్నట్లు తెలిపారు. కంపెనీ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని మంత్రాలయం,నాయుడుపేట, తెలంగాణలోని హైదరాబాద్ సమీపంలో ప్లాంట్లను నిర్వహిస్తోంది. ఈ ప్లాంట్లలో స్పాంజ్ ఐరన్, బిల్లెట్స్, టీఎంటీ బార్స్, ఎంఎస్ రౌండ్, బైండింగ్ వైర్స్‌ను ఉత్పత్తి చేస్తున్నట్లు అగర్వాల్ చెప్పారు.

కార్యకలాపాల విస్తరణలో భాగంగా 300 ఎకరాల్లో విస్తరించి ఉన్న మంత్రాలయం ప్లాంట్ కార్యకలాపాలను మరింతగా విస్తరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా మరో 300 ఎకరాలను కొనుగోలు చేయటంతో పాటు కొత్త ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన చెప్పారు. వచ్చే ఏడాది డిసెంబరు నాటికి ఈ కొత్త ప్లాంట్ అందుబాటులోకి రానుందన్నారు. అంతేకాకుండా ప్లాంట్ మొత్తం ఉత్పత్తి సామర్థ్యం 1.8 లక్షల టన్నుల నుంచి 2.86 లక్షల టన్నులకు పెరగనుందని చెప్పారు. ఉత్తరాది మార్కెట్లో కార్యకలాపాలను విస్తరించేందుకు గాను నోయిడా సమీపంలోని ఘజియాబాద్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌ల్లో ప్లాంట్లను ఏర్పాటు చేయాలని చూస్తున్నట్లు అగర్వాల్ తెలిపారు. విస్తరణకు అవసరమైన మొత్తాలను రుణాలు, అంతర్గత వనరులతో పాటు పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించనున్నట్లు ఆయన చెప్పారు.

ఐపీఓ ద్వారా రూ.400 కోట్ల సమీకరణ: వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో కంపెనీ పబ్లిక్ ఇష్యూకి రానుందని అగర్వాల్ వెల్లడించారు. ఈ ఇష్యూ ద్వారా రూ.400 కోట్లు సమీకరించాలని చూస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇష్యూలో భాగంగా కంపెనీలో 25 శాతం వాటాలను విక్రయించాలని యోచిస్తున్నట్లు తెలిపారు. ఈ మొత్తాలను కార్యకలాపాల విస్తరణకు వెచ్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ మొత్తం టర్నోవర్ రూ.1,200 కోట్లుగా ఉండగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.1,500 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు.

మన విదేశీ అప్పులు రూ.55.38 లక్షల కోట్లు

ముంబై : ఈ ఏడాది మార్చి నెలాఖరుకు నాటికి ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలతో సహా భారత విదేశీ రుణ భారం 66,380 కోట్ల డాలర్లకు (సుమారు రూ.55.38 లక్షల కోట్లు) చేరింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 3,970 కోట్ల డాలర్లు (సుమారు రూ.3.31 లక్షల కోట్లు) ఎక్కువ. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మంగళవారం ఇందుకు సంబంధించిన వివరాలు విడుదల చేసింది. జీడీపీపరంగా చూస్తే ఇదే కాలంలో విదేశీ రుణ భారం 19 శాతం నుంచి 18.7 శాతానికి తగ్గింది. మొత్తం 18.7 శాతం విదేశీ రుణ భారంలో ప్రభుత్వ వాటా 4.2 శాతం మాత్రమే. మిగతాదంతా ప్రభుత్వేతర సంస్థలు చేసిన రుణాలు.

సెన్సెక్స్ @ 78,000

- 23,700 ఎగువకు నిఫ్టీ
- సరికొత్త శిఖరాలకు సూచీలు



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు మంగళవారం సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. సెన్సెక్స్ తొలిసారిగా 78,000 మైలురాయిని చేరగా.. నిఫ్టీ 23,700 స్థాయిని దాటింది. మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎస్‌బీఐతో పాటు ప్రైవేట్ బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, ఐటీ రంగ షేర్లలో కొనుగోళ్లు మార్కెట్ ర్యాలీకి దోహదపడ్డాయి. సెన్సెక్స్ ఒక దశలో 823.63 పాయింట్లు పెరిగి 78,164.71 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును తాకి చివరికి 712.44 పాయింట్ల లాభంతో 78,053.52 వద్ద సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపును నమోదు చేసింది. ఈ నెల 10న తొలి సారిగా 77,000 మార్క్‌కు చేరిన సెన్సెక్స్.. గడిచిన 15 రోజుల్లోనే మరో 1,000 పాయింట్లు పుంజుకోవడం గమనార్హం. నిఫ్టీ విషయానికొస్తే, 216.3 పాయింట్ల వృద్ధితో 23,754.15 వద్ద సరికొత్త ఇంట్రాడే రికార్డును, చివర్లో 183.45 పాయింట్ల లాభంతో 23,721.30 వద్ద ఆల్‌టైం గరిష్ఠ ముగింపును నమోదు చేసింది.

ఈ ఏడాదిలో ఇప్పటివరకు నిఫ్టీ సరికొత్త రికార్డు గరిష్ఠాన్ని నమోదు చేయడం ఇది 34వ సారి. కాగా, ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.435.76 లక్షల కోట్లకు (5.22 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో 15 లాభపడ్డాయి.

నెఫ్రో కేర్ ఐపీఓ ధరల శ్రేణి రూ.85-90

నెఫ్రో కేర్ ఇండియా లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ఈ నెల 28న ప్రారంభమై జూలై 2న ముగియనుంది. ఐపీఓ ద్వారా కంపెనీ 45.84 లక్షల తాజా ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. షేరు ధరల శ్రేణిని రూ.85-90గా నిర్ణయించింది. తద్వారా రూ.41.26 కోట్ల వరకు సమీకరించనుంది.

1:5 నిష్పత్తిలో కిమ్స్ షేర్ల విభజన!

హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న కృష్ణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్) తన షేర్లను విభజించనుంది. రూ.10 ముఖవిలువ కలిగిన ఒక్కో షేరును రూ.2 ముఖవిలువతో కూడిన 5 షేర్లుగా విభజించాలని ప్రతిపాదించింది. ఈ నెల 28న (శుక్రవారం) కంపెనీ బోర్డు సమావేశమై ఈ ప్రతిపాదనపై తుది నిర్ణయం తీసుకోనుందని స్టాక్ ఎక్స్ఛేంజీలకు కిమ్స్ సమాచారం అందించింది. దాంతో కంపెనీ షేరు ఒక దశలో 6.40 శాతం వరకు పెరిగి రూ.2,187.45 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 3.6 శాతం లాభంతో రూ.2,128.50 వద్ద ముగిసింది.

ఏడాది గరిష్ఠానికి అమర రాజా షేరు

హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ షేరు మంగళవారం ఇంట్రాడే ట్రేడింగ్‌లో దాదాపు 20 శాతం ఎగబాకి రూ.1,655.20 వద్ద సరికొత్త ఏడాది గరిష్ఠాన్ని నమోదు చేసింది. బీఎస్ఈలో ట్రేడింగ్ నిలిచేసరికి, కంపెనీ షేరు ధర 19.40 శాతం లాభంతో రూ.1,647 వద్ద స్థిరపడింది. లిథియం అయాన్ సెల్స్ టెక్నాలజీ కోసం స్లొవేకియాకు చెందిన జీబీ ఎనర్జీతో అమర రాజా పూర్తి అనుబంధ విభాగమైన అమర రాజా అడ్వాన్స్‌డ్ సెల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ లైసెన్సింగ్ అగ్రిమెంట్‌ను కుదుర్చుకోవడం షేర్ల ర్యాలీకి కారణమైంది. అంతేకాదు, ఈ ఏడాదిలో ఇప్పటివరకు అమర రాజా షేరు ధర రెట్టింపైంది. 2014లో 144 శాతం వృద్ధిని నమోదు చేసిన కంపెనీ షేరుకు ఆ తర్వాత ఇదే అత్యుత్తమ ప్రదర్శన.

100 బిలియన్ డాలర్ల క్లబ్‌లోకి ఐసీఐసీఐ బ్యాంక్

ప్రైవేట్ రంగానికి చెందిన ఐసీఐసీఐ బ్యాంక్ తాజాగా మరో రికార్డును సృష్టించింది. బీఎస్ఈలో బ్యాంక్ షేరు మంగళవారం రెండున్నర శాతం వరకు వృద్ధి చెంది రూ.1,199 వద్దకు ఎగబాకింది. దాంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.8.44 లక్షల కోట్లకు (100 బిలియన్ డాలర్లు= 10,000 కోట్ల డాలర్లు) చేరుకుంది. ఇప్పటివరకు దేశీయ స్టాక్ మార్కెట్లో 100 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువను సాధించిన ఆరో సంస్థగా ఐసీఐసీఐ బ్యాంక్ నిలిచింది. ఐసీఐసీఐ కంటే ముందు ఈ మైలురాయికి చేరుకున్న కంపెనీల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్ ఉన్నాయి.

ముడి చమురు మళ్లీ పైపైకి..

న్యూయార్క్: ముడి చమురు ధర మళ్లీ సెగలు కక్కుతోంది. న్యూయార్క్ మార్కెట్లో బ్యారల్ బ్రెంట్ రకం చమురు ధర మంగళవారం రెండు నెలల గరిష్ఠ స్థాయి 86 డాలర్లకు చేరింది. ఎర్ర సముద్రంలో చమురు రవాణా నౌకలపై కొనసాగుతున్న హౌతీల దాడులు, క్రిమియాలోని రష్యా స్థావరాలపై ఉక్రెయిన్ దాడుల నేపథ్యంలో అమెరికా-రష్యా మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు ఇందుకు ప్రధాన కారణమని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో బ్యారల్ బ్రెంట్ ముడి చమురు ధర వచ్చే కొద్ది నెలల్లో 85-100 డాలర్ల మధ్య ట్రేడయ్యే అవకాశం ఉందని ఎస్ అండ్ పీ గ్లోబల్ అంచనా.

స్పెక్ట్రమ్ వేలంలో తొలిరోజు
రూ.11,000 కోట్ల బిడ్లు

న్యూఢిల్లీ: దేశంలో మంగళవారం నుంచి ప్రారంభమైన స్పెక్ట్రమ్ వేలంలో తొలిరోజు బిడ్ల ప్రక్రియ ముగిసే సమయానికి టెలికాం కంపెనీలు రూ.11,000 కోట్ల విలువ గల బిడ్లు దాఖలు చేశాయి. ఈ విడతలో ప్రభుత్వం రూ.96,238 కోట్ల విలువ గల 10,500 మెగాహెడ్జ్ స్పెక్ట్రమ్‌ను వేలానికి పెట్టింది. మంగళవారం ప్రధానంగా 900, 1800 మెగాహెడ్జ్ బ్యాండ్లకు అధిక బిడ్లు దాఖలయ్యాయి.

- **ఐఎస్‌బీ-రూట్‌లెడ్జ్ నుంచి మరో పుస్తకం**

ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)-రూట్‌లెడ్జ్ పబ్లిక్ పాలసీ బుక్ సిరీస్‌లో భాగంగా భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ మరో పుస్తకం విడుదల చేసింది. 'ఇన్నోవేషన్స్, ప్రాక్టీస్ అండ్ ఫ్యూచర్ ఆఫ్ పబ్లిక్ పాలసీ ఇన్ ఇండియా' పేరుతో ఈ పుస్తకం విడుదలైంది. టెక్నాలజీ, పాలసీ అండ్ ఇంక్లూజన్ వంటి అనేక అంశాలపై ఈ పుస్తకంలో చర్చించారు. ఆసక్తి ఉన్న పాఠకులు ఆన్‌లైన్‌లోనూ ఈ పుస్తకాన్ని ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,200 ▼	66,200 ▼	95,500 ▼
ముంబై	71,739 ▲	65,713 ▲	88,515 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



26వ తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	515
వరంగల్	517	గోదావరి	515
చిత్తూరు	573	విశాఖపట్నం	525
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	119	విజయవాడ	132
వరంగల్	119	గుంటూరు	132
కరీంనగర్	119	ఒంగోలు	132
మహబూబ్‌నగర్	119	చిత్తూరు	129
కర్నూలు	119	నెల్లూరు	129
విశాఖపట్నం	138	అనంతపురం	132
గోదావరి	132		

సిడ్స్ ఫామ్ రూ.83 కోట్ల సమీకరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న సిడ్స్ ఫామ్.. రూ.83 కోట్లు (కోటి డాలర్లు) సమీకరించింది. ఓమ్నివోర్, నరోతం సెక్సారియా ఫ్యామిలీ ఆఫీస్ (ఎన్ఎస్ఎఫ్ఓ) నుంచి ఈ మొత్తాలను సమీకరించినట్లు వెల్లడించింది. హైదరాబాద్, బెంగళూరు మార్కెట్లలో స్థానాన్ని పటిష్ఠం చేసుకోవటంతో పాటు హై-క్వాలిటీ డెయిరీ ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి సామర్థ్యాలను పెంచుకునేందుకు ఈ మొత్తాలను వెచ్చించనున్నట్లు సిడ్స్ ఫామ్ వ్యవస్థాపకుడు కిశోర్ ఇందుకూరి వెల్లడించారు. 2016లో కార్యకలాపాలు ప్రారంభించిన సిడ్స్ ఫామ్‌కు ఈ రెండు నగరాల్లో 25,000 పైగా కస్టమర్లు ఉన్నారు.

సౌర, పవన విద్యుత్‌పై అదానీ గ్రూప్ ఫోకస్

- 2030 నాటికి 50,000 మెగావాట్ల సామర్థ్యం
- రూ.2 లక్షల కోట్ల భారీ పెట్టుబడులు
- ఏపీలో 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్లాంట్

అహ్మదాబాద్: సౌర,పవన వంటి పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులపై అదానీ గ్రూప్ పెద్దఎత్తున పెట్టుబడులు పెడుతోంది. 2030 నాటికి ఈ రంగంలో విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని ప్రస్తుత 10,000 మెగావాట్ల నుంచి 50,000 మెగావాట్లకు విస్తరించాలని భావిస్తోంది. ఇందుకోసం రూ.2 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టనుంది. అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాగర్ అదానీ ఈ విషయం వెల్లడించారు. ఇందులో 80 శాతం సౌర విద్యుత్ ద్వారా, మిగతాది పవన విద్యుత్ ద్వారా ఉత్పత్తి చేస్తామని తెలిపారు. ఇందుకు అవసరమైన సౌర ఫలకాలు, టర్బైన్స్‌ను కూడా సొంతంగా తయారు చేస్తామన్నారు.

ఏపీలో పంప్డ్ స్టోరేజీ ప్లాంట్ పనులు షురూ

పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులతో పాటు రాత్రి సమయాల్లో ఉపయోగించుకునేందుకు వీలుగా 5,000 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు అదానీ గ్రీన్ ఎనర్జీ కంపెనీ సీఈఓ అమిత్ సింగ్ చెప్పారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ లో 500 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన పంప్డ్ స్టోరేజీ ప్లాంట్ నిర్మాణ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్రల్లో జల విద్యుత్ కేంద్రాల వద్ద విద్యుత్ నిల్వ కోసం పెద్ద ఎత్తున పంప్డ్ స్టోరేజీ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉందన్నారు. అదానీ గ్రూప్ కంపెనీలు అన్నీ కలిసి 2024-25లో వ్యాపార విస్తరణ కోసం రూ.1.3 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టనున్నాయి.

మా దేశంలో పెట్టుబడులు పెట్టండి: ఉజ్బెకిస్థాన్

హైదరాబాద్: భారత ఫార్మా, ఐటీ కంపెనీల నుంచి ఉజ్బెకిస్థాన్ పెట్టుబడులు ఆశిస్తోంది. ఇందుకోసం ఆ దేశ రాయబారి సర్దార్ ఎం రుస్తంబవె హైదరాబాద్‌లోని పలు ఐటీ, ఫార్మా కంపెనీల ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ రెండు రంగాలతో పాటు విద్య, వైద్యం, పారిశ్రామిక ఉత్పత్తి, ఇంధనం, పర్యాటక రంగాల్లోనూ భారత కంపెనీల నుంచి పెట్టుబడులు ఆశిస్తున్నట్టు తెలిపారు. భారత్‌లానే తమ దేశం కూడా స్టార్టప్ కంపెనీలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్టు రుస్తంబవె చెప్పారు.

స్పోర్ట్స్

సెమీఫైనల్స్ రేపు

దక్షిణాఫ్రికా x అఫ్ఘానిస్థాన్ (ఉ. 6 గం.)

భారత్ x ఇంగ్లండ్ (రా. 8 గం.)

వార్నర్ వీడ్కోలు



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా స్టార్ ఓపెనర్ డేవిడ్ వార్నర్ అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. గతంలోనే తను టెస్టు, వన్డే ఫార్మాట్ల నుంచి తప్పుకొని పొట్టి ఫార్మాట్‌కే పరిమితమయ్యాడు. ఇక టీ20 వరల్డ్‌కప్ తన కెరీర్‌లో చివరిదని వార్నర్ ఇదివరకే చెప్పాడు. 2009లో అరంగేట్రం చేసిన తను ఆడిన 110 టీ20ల్లో ఓ సెంచరీ, 28 హాఫ్ సెంచరీలతో 3277 పరుగులు సాధించాడు. 161 వన్డేల్లో 22 శతకాలు, 6932 రన్స్ ఉండగా.. 112 టెస్టుల్లో 26 సెంచరీలు, 8786 పరుగులు సాధించాడు.

ఆంధ్రకి మళ్లీ ఆడతా!

విహారి



అమరావతి (ఆంధ్రజ్యోతి): టీమిండియా క్రికెటర్, ఆంధ్ర రంజీ జట్టు మాజీ కెప్టెన్ హనుమ విహారి (30) తిరిగి ఆంధ్ర జట్టుకు ఆడతానని వెల్లడించాడు. మంగళవారం ఏపీ ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ ఆహ్వానం మేరకు ఆయనను విహారి మర్యాదపూర్వకంగా కలిశాడు. లోకేశ్‌ను కలవడం సంతోషంగా ఉందని ఈ సందర్భంగా విహారి అన్నాడు. 'ఆంధ్రకు తిరిగి ప్రాతినిథ్యం వహించాలని, తన పూర్తి మద్దతు ఉంటుందని లోకేశ్ భరోసా ఇచ్చారు. గతంలో నాకు జరిగిన అవమానాలు, బలవంతంగా నన్ను కెప్టెన్సీ నుంచి తప్పించడంలాంటి సంఘటనలతో ఆంధ్రకు ఆడకూడదనుకున్నా. కానీ, లోకేశ్‌ను కలిశాక నిర్ణయం మార్చుకున్నా' అని విహారి చెప్పాడు. అనంతరం విహారి ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను జనసేన కార్యాలయంలో కలిశాడు.

వాట్ ఏ మ్యాచ్! హైడ్రామా, సస్పెన్స్, సంబరాలు, భావోద్వేగాలతో పాటు వరుణుడి దోబూచులాట.. వెరసి అఫ్ఘాన్ సేన సగర్వంగా తలెత్తుకునేలా, అంతులేని ఆనందంతో ముగిసిన ఈ పోరు.. ఏ మసాలా సినిమాకూ తీసిపోని మలుపులతో సాగింది. సెమీస్ బెర్త్ కోసం బంగ్లాదేశ్‌తో గెలిచి తీరాల్సిన మ్యాచ్‌లో అఫ్ఘాన్ చేసింది 115 పరుగులే. ఇంకేం.. వారి ఆశలు గల్లంతైనట్టేనని అనుకున్న స్థితిలో బౌలర్లు పట్టు వదల్లేదు. సులువుగా నెగ్గాల్సిన బంగ్లాను ముప్పుతిప్పలు పెడుతూ పేసర్ నవీనుల్ హక్, స్పిన్నర్ రషీద్ ఖాన్ ముచ్చెమటలు పట్టించారు. ఆధిపత్యం అటూ.. ఇటూ మారుతూ వచ్చినా చివరకు తమ క్రికెట్ చరిత్రలోనే చిరస్మరణీయ విజయంతో అఫ్ఘాన్ సెమీస్ చేరింది. ఇక వీరి గెలుపుతో బంగ్లాతో పాటు ఆస్ట్రేలియా కూడా ఇంటిబాట పట్టక తప్పలేదు.

అఫ్ఘాన్ అద్భుతః

తొలిసారి సెమీస్‌కు

బంగ్లాదేశ్‌పై ఉత్కంఠ విజయం ● రషీద్, నవీనుల్‌కు నాలుగేసి వికెట్లు

ఆస్ట్రేలియా అవుట్

టీ20 వరల్డ్‌కప్



కింగ్‌స్టౌన్: తాజా టీ20 వరల్డ్‌కప్‌లో అఫ్ఘాన్ వీరులు మరోసారి తమ సత్తాను చాటుకున్నారు. మంగళవారం అత్యంత నాటకీయ పరిస్థితుల్లో బంగ్లాదేశ్‌తో జరిగిన సూపర్-8 ఆఖరి మ్యాచ్‌లో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిన 8 పరుగుల తేడాతో గెలిచిన ఈ జట్టు.. తొలిసారిగా సెమీఫైనల్లో అడుగుపెట్టింది. గురువారం రషీద్ సేన దక్షిణాఫ్రికాతో తొలి సెమీస్‌లో తలపడనుంది. 2022 మెగా టోర్నీలో ఒక్క విజయం కూడా అందుకోని అఫ్ఘాన్ ఈసారి మాత్రం న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలను మట్టికరిపిస్తూ టైటిల్ రేసులోనూ ఉన్నామంటూ చాటుకోవడం విశేషం. ఇక, మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన అఫ్ఘాన్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 115 పరుగులు మాత్రమే చేసింది. ఓపెనర్ గుర్బాజ్ (43) టాప్ స్కోరర్. స్పిన్నర్ రిషాద్‌కు మూడు వికెట్లు దక్కాయి. అనంతరం మ్యాచ్ మధ్యలో వర్షం కారణంగా 19 ఓవర్లకు కుదించగా లక్ష్యాన్ని 114కు మార్చారు. అయితే బంగ్లా 17.5 ఓవర్లలో 105 పరుగులకే పరిమితమైంది. ఓపెనర్ లిట్టన్ దాస్ (54 నాటౌట్) అజేయ పోరాటం ఫలితాన్నివ్వలేదు. రషీద్ (4/23), ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ నవీనుల్ (4/26) వణికించారు.

సమష్టిగా దెబ్బతీశారు..: వాస్తవానికి ఈ మ్యాచ్ గ్రూప్-1లోని అఫ్ఘాన్, బంగ్లా, ఆసీస్ జట్లకు కూడా సెమీస్ బెర్త్‌ను ఊరించింది. దీనికి తగ్గట్టుగానే బంగ్లా ముందు 116 పరుగుల లక్ష్యమే ఉండడంతో 12.1 ఓవర్లలో గెలిస్తే షంటో సేనకు సువర్ణావకాశం ఉండేది. దీన్ని దృష్టిలో ఉంచుకునే వారి ఛేదన సాగింది. కానీ వారి వ్యూహం బెడిసికొట్టింది. ముఖ్యంగా ఆరంభ, చివర్లో పేసర్ నవీనుల్ హక్ చెలరేగగా.. మిడిలార్డర్‌ను స్పిన్నర్ రషీద్ ఖాన్ దెబ్బతీశాడు. దీంతో ఎనిమిది మంది బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. తొలి ఓవర్‌లో లిట్టన్ 4,6తో 13 రన్స్ రాబట్టి ఆశలు రేపాడు. కానీ రెండో ఓవర్‌లో ఓపెనర్ తన్‌జీద్‌ను పేసర్ ఫరూఖి డకౌట్ చేయగా... తర్వాతి ఓవర్‌లో పేసర్ నవీనుల్ మరింత గట్టి షాక్ ఇస్తూ కెప్టెన్ షంటో (5), షకీబ్ (0)లను వరుస బంతుల్లో అవుట్ చేశాడు. ఈ దశలో పది నిమిషాలపాటు వర్షం అంతరాయం కలిగించింది. అటు బంగ్లా కూడా సెమీస్ కోసం కాకుండా ఓదార్పు విజయంపై దృష్టి పెట్టింది. కానీ రషీద్ రాకతో వీరి కష్టాలు మరింతగా పెరిగాయి. వరుస ఓవర్లలో కీలక నాలుగు వికెట్లు తీయడంతో బంగ్లా 80/7 స్కోరుతో ఒత్తిడిలో పడింది. అయినా అప్పటికీ 9 ఓవర్లలో కేవలం 34 పరుగులు చేస్తే చాలు. ఓవైపు లిట్టన్ చక్కటి షాట్లతో ఆకట్టుకున్నా మరో ఎండ్‌లో అతడికి తోడ్పాటు అందలేదు. బౌలర్లు పకడ్బందీగా బంతులు వేయడంతో వికెట్ కాపాడుకునేందుకు లిట్టన్ కూడా భారీ షాట్లు ఆడలేదు. నెమ్మదిగా సమీకరణం 12 బంతుల్లో 12 పరుగులకు మారడంతో అఫ్ఘాన్ మరింత పట్టు బిగించింది. 18వ ఓవర్‌లో నవీనుల్ వరుస బంతుల్లో చివరి రెండు వికెట్లు తీయడంతో బంగ్లా షాక్‌లో మునిగిపోగా.. అఫ్ఘాన్ సంబరాలు ఆకాశాన్నంటాయి.

గుర్బాజ్ ఒక్కడే..: టాస్ గెలిచిన అఫ్ఘాన్ బ్యాటింగ్ ఎంచుకోగా.. ఓపెనర్ గుర్బాజ్ మాత్రమే బంగ్లా బౌలర్లను ఎదుర్కోగలిగాడు. అయితే చివర్లో రషీద్ 3 సిక్సర్లతో కీలక పరుగులు అందజేశాడు. మరో ఓపెనర్ జద్రాన్ (18) కాస్త సహకారం అందించడంతో తొలి వికెట్‌కు 59 పరుగుల భాగస్వామ్యంతో మంచి స్థితిలోనే నిలిచింది. కానీ ఆ తర్వాత స్పిన్నర్ రిషాద్, పేసర్ ముస్తాఫిజుర్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. దీంతో ఓవర్లు కరుగుతున్నా స్కోరు కదల్లేదు. 93/5 స్కోరుతో ఇబ్బందుల్లో పడిన దశలో రషీద్ 18వ ఓవర్‌లో సిక్స్, ఆఖరి ఓవర్‌లో రెండు సిక్సర్లతో జట్టు స్కోరు వంద దాటింది.

సంక్షిప్త స్కోర్లు

అఫ్ఘానిస్థాన్: 20 ఓవర్లలో 115/5 (గుర్బాజ్ 43, రషీద్ 19 నాటౌట్, జద్రాన్ 18; రిషద్ 3/26).

బంగ్లాదేశ్: 17.5 ఓవర్లలో 105 ఆలౌట్ (లిట్టన్ దాస్ 54 నాటౌట్, హ్రిదయ్ 14; రషీద్ 4/23, నవీనుల్ హక్ 4/26).

గుల్బదిన్... తూనే క్యా కియా..



బంగ్లాతో మ్యాచ్‌లో అఫ్ఘాన్ ఫీల్డర్ గుల్బదిన్ నైబ్ ప్రవర్తించిన తీరు వివాదాస్పదంగా మారింది. 11.4 ఓవర్ల సమయంలో చినుకులు ఆరంభం కాగా అప్పటికి డ/లూ పద్ధతిన బంగ్లా విజయానికి 2 పరుగుల దూరంలోనే ఉంది. ఒకవేళ ఈ సమయంలో ఆ రన్స్ తీసి మ్యాచ్ రద్దయినా బంగ్లానే గెలిచేది. అందుకే డగౌట్ నుంచి కోచ్ ట్రాట్.. 'వర్షం కురుస్తోంది.. స్లోగా ఆడండ'ని సూచించాడు. దీంతో స్లిప్‌లో ఫీల్డింగ్ చేస్తున్న నైబ్ హఠాత్తుగా కండరాలు పట్టేసినట్టు కిందపడిపోయాడు. వెంటనే అంపైర్ మ్యాచ్‌ను ఆపేయగా.. అతడిని సిబ్బంది బయటికి తీసుకెళ్లారు. కానీ ఆ తర్వాత వర్షం ఆగి మ్యాచ్ సజావుగానే సాగింది. కానీ నైబ్ చేసిన పనికి మాత్రం నెట్టింట ట్రోలింగ్‌గా మారింది. కామెంటేటర్లు సైతం అతడికి ఆస్కార్ అవార్డు ఇవ్వచ్చంటూ సరదాగా కామెంట్స్ చేశారు.

బాంబుల మోతలు.. విధ్వంసాలు.. అణచివేతలు.. వినాశనాలు.. ఆంక్షలు.. అఫ్గానిస్థాన్ అంటే ఎక్కువగా గుర్తుకు వచ్చేది ఇవే. అలాంటి పరిస్థితుల నుంచి ప్రపంచమే నివ్వెరపోయేలా.. క్రికెట్‌లో తనకంటూ ప్రత్యేక అధ్యాయం లిఖించే స్థాయికి ఎదిగింది అఫ్గాన్ జట్టు. పరిస్థితులకు ఎదురీది.. పవర్‌ఫుల్‌గా మారింది.

స్ఫూర్తిదాయకం.. వీరి ప్రయాణం

శరణార్థి శిబిరాల నుంచి..: గత దశాబ్ద కాలంలో క్రికెట్‌లో అత్యంత వేగంగా వృద్ధి చెందిన జట్టు అఫ్గాన్. పాకిస్థాన్ శరణార్థి శిబిరాల్లో పరిచయమైన క్రికెట్.. ఇప్పుడు వారికంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చింది. ఆటపై మక్కువ పెంచుకొన్న అఫ్గాన్‌లు.. తమతోపాటు క్రికెట్‌నూ తీసుకెళ్లారు. జట్టులో ఎక్కువ మంది 2001లో అమెరికా సేనల ప్రవేశానికి అటూఇటూగా పుట్టినవారే. వారిలో 25 ఏళ్ల కెప్టెన్ రషీద్ ఖాన్.. అఫ్గాన్ క్రికెట్ ముఖచిత్రంగా మారాడు. తన స్పిన్ మాయాజాలంతో ఫ్రాంచైజీ క్రికెట్‌లో స్టార్ ఇమేజ్ తెచ్చుకొన్నాడు.

అంతా ఒక కథలా..: 2021లో పాలన మళ్లీ తాలిబన్ల చేతిలోకి వెళ్లడం.. ఆటకు పెద్ద దెబ్బగా భావించారు. అయితే, జట్టు ఆడుతున్న తీరు, ఆటగాళ్ల నిబద్ధతను చూసిన పాలకులు కఠిన వైఖరి వీడడం ఒక రకంగా అఫ్గాన్ క్రికెట్ వేగంగా ఎదిగేందుకు దోహదం చేసింది. 'అఫ్గాన్ రిపబ్లిక్' జెండా కింద ఆడేందుకు కూడా అభ్యంతరం చెప్పలేదు. 2015లో తొలిసారి వరల్డ్‌కప్‌నకు అర్హత సాధించిన అఫ్గాన్.. క్రమంగా రాటుదేలింది. గతేడాది భారత్‌లో జరిగిన వన్డే ప్రపంచకప్‌లో పాకిస్థాన్, ఇంగ్లండ్ లాంటి జట్లను ఓడించి ఔరా అనిపించింది. ఇప్పుడు పొట్టికప్‌లో న్యూజిలాండ్‌కు షాకిచ్చిన రషీద్ సేన.. ఏకంగా కంగారూల కథనే ముగించింది.

అండగా బీసీసీఐ..: అఫ్గాన్ క్రికెట్ పురోభివృద్ధిలో బీసీసీఐ పాత్ర ఎనలేనిది. అసోసియేట్ సభ్యదేశం హోదా రావడానికి కృషి చేసిన బోర్డు.. ఆర్థిక సాయంతోపాటు భారత్‌లో సకల సౌకర్యాలున్న స్టేడియాల్లో శిక్షణ, మ్యాచ్‌లు ఆడేందుకు అనుమతించింది. లాల్‌చంద్ రాజ్‌పుత్, మనోజ్ ప్రభాకర్ లాంటి టీమిండియా మాజీలు అఫ్గాన్ కోచ్‌లుగా పనిచేశారు. 2014లో భారత ప్రభుత్వం కాందహార్‌లో స్టేడియం నిర్మాణానికి నిధులు కూడా అందించింది. ఐపీఎల్‌లో రషీద్, నూర్ అహ్మద్, రహ్మానుల్లా గుర్బాజ్, నవీనుల్ హక్‌లకు ఆడే అవకాశం కల్పించడం వారి కెరీర్‌లకు మలుపు. పొట్టికప్‌లో అఫ్గాన్ సెమీస్ చేరడంతో.. భారత్‌కు తాలిబన్ల అధికార ప్రతినిధి సుహైల్ షహీన్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పారు.

అంతా రషీద్ చుట్టూనే..: అఫ్గాన్ టీమ్ విజయాలు మొత్తం రషీద్ చుట్టూనే అల్లుకొన్నాయనడంలో సందేహం లేదు. ప్రపంచవ్యాప్తంగా లీగ్‌లు ఆడుతున్న రషీద్.. ఇప్పుడు అఫ్గాన్ యూత్ ఐకాన్. కెప్టెన్‌గా జట్టులో అనుక్షణం స్ఫూర్తిని నింపుతూ అద్భుతాలు సాధిస్తున్నాడు. అఫ్గాన్ క్రికెట్ స్వర్ణ యుగానికి ప్రతినిధిగా నిలుస్తున్నాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)



అతని నమ్మకాన్ని నిలబెట్టాం

మేం సెమీస్ చేరగలమని నమ్మిన ఒకేఒక్క వ్యక్తి బ్రియాన్ లారా. టోర్నీకి ముందు కలిసినప్పుడు.. మీ నమ్మకాన్ని మేం వమ్ము చేయం అని అతనితో చెప్పాం. ఇప్పుడదే నిజమైంది. దిగ్గజ ఆటగాళ్ల నుంచి అలాంటి గొప్ప మాటలు రావడం మాకెంతో శక్తినిస్తుంది. ఇప్పుడు మీ ముందు ఇలా గర్వంగా నిలబడినందుకు చాలా సంతోషంగా ఉంది. మా ఈ ప్రదర్శన అఫ్గానిస్థాన్‌లో యువతకు స్ఫూర్తినిస్తుందనుకుంటున్నా.

\- కెప్టెన్ రషీద్ ఖాన్

మిన్నంటిన సంబరాలు



టీ20 ప్రపంచకప్‌లో అఫ్గానిస్థాన్ జట్టు సెమీస్ చేరడంతో ఆ దేశంలో సంబరాలు అంబరాన్నంటాయి. తమ క్రికెట్ జట్టు అద్భుత విజయాన్ని పురస్కరించుకొని అభిమానులు వేలసంఖ్యలో వీధుల్లో గుమిగూడారు. మిఠాయిలు పంచుకోవడంతో పాటు ర్యాలీలు తీస్తూ సంతోషాన్ని పంచుకున్నారు. ఇప్పుడీ దృశ్యాలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి.

డీఎల్ఎస్ సహ రూపకర్త

డక్‌వర్త్ ఇకలేరు



న్యూఢిల్లీ: క్రికెట్‌లో వినియోగించే డక్‌వర్త్ లూయిస్ (డీఎల్ఎస్) పద్ధతి సహ రూపకర్త ఫ్రాంక్ డక్‌వర్త్ (84) కన్నుమూశాడు. మ్యాచ్‌లు జరుగుతున్నప్పుడు వర్షం పడితే, ఫలితం రాబట్టేందుకు ఉపయోగించే ఈ పద్ధతిని ఇంగ్లండ్‌కు చెందిన డక్‌వర్త్-టోనీ లూయిస్ రూపొందించారు. దీనిని 1997లో మొదటిసారిగా అంతర్జాతీయ క్రికెట్‌లో ఉపయోగించారు.

'రైతు భరోసా'పై అభిప్రాయ సేకరణ

- జీఎస్‌డీపీకి దోహదపడే రంగాలపై దృష్టి: భట్టి
- వ్యవసాయం, మార్కెటింగ్, చేనేతల బడ్జెట్‌పై సమీక్ష

హైదరాబాద్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా పథకంపై రైతుల అభిప్రాయాలు సేకరించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వ్యవసాయ శాఖాధికారులకు సూచించారు. రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) పెరుగుదలకు దోహదపడే రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. వ్యసాయం, మార్కెటింగ్, చేనత, జౌళి శాఖల బడ్జెట్ ప్రతిపాదనలపై మంగళవారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. భట్టి మాట్లాడుతూ రైతు భరోసా పథకంపై ఏ విధంగా ముందుకెళితే బాగుటుంది, ఎలాంటి నిబంధనలు ఉండాలి తదితర అంశాలపై రైతులు, సాధారణ ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించాలని చెప్పారు. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందితేనే ఉత్పత్తులు పెరిగి ఖజానాకు, రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. వ్యవసాయ కళాశాలలు లేని జిల్లాల వివరాలను భట్టి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటును విడుదల చేయడం ద్వారా కేంద్ర పథకాలు, నిధులను సద్వినియోగపర్చుకోవాలని తుమ్మల సూచించారు. డ్రిప్ ఇరిగేషన్‌కు నిధులిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని వ్యవసాయ అధికారులు తెలిపారు.



డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవంలో భట్టి విక్రమార్క, సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా

'డ్రగ్స్'పై కలిసికట్టుగా పోరాడాలి

- ప్రపంచ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవంలో భట్టి

హైదరాబాద్ సిటీ, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు నగరాలకే పరిమితమైన డ్రగ్స్ మహమ్మారి ఇప్పుడు గ్రామస్థాయి వరకు పాకిందని.. అందువల్ల ప్రజలంతా కలిసికట్టుగా పోరాడితే మహమ్మారిని తరిమికొట్టడం పెద్ద కష్టం కాదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. డ్రగ్స్ నిర్మూలన కోసం ఎంత బడ్జెట్ అయినా ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. మాదక ద్రవ్యాల ముఠాల వెనుక ఎంత పెద్దవారున్నా కఠినంగా వ్యవహరించాలని నార్కోటిక్ బ్యూరో అధికారులను ఆదేశించారు. జూన్ 26న ప్రపంచ డ్రగ్స్ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ నార్కోటిక్ బ్యూరో విభాగం ఆధ్వర్యంలో నెక్లెస్‌రోడ్‌లోని జలవిహార్‌లో మంగళవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ మహమ్మారికి వ్యతిరేకంగా భాస్కర్ రచించిన.. సంజనా సౌమ్య పాడిన 'రామసక్కని కొడుకా' గీతాన్ని డిప్యూటీ సీఎం ఆవిష్కరించారు. అనంతరం వందలాది మంది విద్యార్థులు, యువత చైతన్య ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి భట్టి విక్రమార్క మాట్లాడారు. స్కూల్, కాలేజీ, యూనివర్సిటీలతో పాటు.. గ్రామ స్థాయి వరకు యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

హైవేల నిర్మాణాలను వేగిరం చేయండి

- ఎన్‌హెచ్‌ఏఐ చైర్మన్‌ను కోరిన మంత్రి కోమటిరెడ్డి

న్యూఢిల్లీ, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో అపరిష్కృతంగా ఉన్న హైవేల నిర్మాణాలతో పాటు వివిధ రహదారుల నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించేలా చొరవ చూపాలని 'జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ)' చైర్మన్ సంతోష్‌కుమార్ యాదవ్‌ను రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. హైదరాబాద్- మన్నెగూడ (ఎన్‌హెచ్-163) రోడ్డుకు ఉన్న ఎన్‌జీటీ సంబంధిత సమస్యకు సత్వర పరిష్కారాన్ని కనుగొని, ఏడాదికి పైగా పెండింగ్‌లో ఉన్న నాలుగు లేన్ల నిర్మాణ పనులను ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్- విజయవాడ రహదారి (ఎన్‌హెచ్-65)కి సంబంధించి ఉన్న వివాద పరిష్కారం కోసం ఎదురుచూడకుండా ఆరు వరసలుగా విస్తరణ పనులు చేపట్టాలని కోరారు. మంగళవారమిక్కడి ఎన్‌హెచ్ఏఐ కార్యాలయంలో మంత్రి కోమటిరెడ్డి చైర్మన్ సంతోష్‌కుమార్‌తో భేటీ అయ్యారు. పెండింగ్‌లో ఉన్న రహదారుల నిర్మాణం.. పలు జాతీయ రహదారుల మంజూరుపై మంత్రి వివరించారు. వాహనల రద్దీతో తీవ్ర ప్రమాదాలకు కారణమవుతున్న హైదరాబాద్- కల్వకుర్తి (ఎన్‌హెచ్- 765) రోడ్డును నాలుగు వరసలుగా నిర్మించేందుకు కావాల్సిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక తయారీ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు.

రేపటితో ముగియనున్న అఫిడవిట్ల దాఖలు గడువు

- కాళేశ్వరం ప్రాజెక్టు విచారణలో కమిషన్

హైదరాబాద్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ముందు విచారణకు హాజరైన వారికి అఫిడవిట్ల దాఖలుకు ఇచ్చిన గడువు ఈ నెల 27వ తేదీతో ముగియనుంది. ఇంజనీర్లు/నిర్మాణ సంస్థల ప్రతినిధులను కమిషన్ ఇప్పటికే విచారించింది. ఈ విచారణ క్రమంలో చెప్పిన అంశాలే అఫిడవిట్ల రూపంలో అందించాలని కమిషన్ ఇదివరకే స్పష్టం చేసింది. వాటిని దాఖలు చేయడానికి 27వ తేదీని గడువుగా విధించింది. అఫిడవిట్లు అందాక వాటిలోని సారాంశాలను పరిశీలించిన తర్వాత నోటీసులపై కమిషన్ నిర్ణయం తీసుకుంటుందని జస్టిస్ పీసీ ఘోష్ ఇదివరకే స్పష్టం చేశారు. మరోవైపు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పూర్తిస్థాయి నివేదిక కమిషన్‌కు అందే అవకాశం ఉండగా... రానున్న జూలై 7వ తేదీలోగా జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్ఏ) కూడా పూర్తిస్థాయి నివేదికను సమర్పించే అవకాశాలున్నాయనే సమాచారం కమిషన్‌కు చేరింది.

అనాథలు, దళితుల పేరిట విరాళాలు..

రూ.300 కోట్ల దుర్వినియోగం

- 'ఆపరేషన్ మొబిలైజేషన్'పై ఈడీ దర్యాప్తు

హైదరాబాద్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): అనాథలు, దళిత వర్గానికి చెందిన చిన్నారుల విద్య, వసతి, వారి కోసం సేవాకార్యక్రమాల పేరుతో విదేశాల నుంచి విరాళాలను సేకరించిన ఆపరేషన్ మొబిలైజేషన్(ఓఎం) చారిటీ గ్రూప్.. రూ.300 కోట్ల నిధులను దారి మళ్లించిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) వెల్లడించింది. ఇటీవల ఈ సంస్థపై ఈడీ దాడులు నిర్వహించింది. "11 ప్రాంతాల్లో జరిపిన దాడుల్లో కీలక పత్రాలు, డిజిటల్ ఆధారాలను సీజ్ చేశాం. అమెరికా, బ్రిటన్, కెనడా, అర్జెంటీనా, డెన్మార్క్, ఆస్ట్రేలియా, జర్మనీ, ఐర్లాండ్, ఫిన్లాండ్, మలేసియా, నార్వే, ఫ్రాన్స్, సింగపూర్, స్విట్జర్లాండ్, స్వీడన్ దేశాలకు చెందిన దాతల నుంచి ఓఎం సంస్థ 'దళిత్ ఫ్రీడమ్ నెట్‌వర్క్' పేరుతో సుమారు రూ.300 కోట్ల నిధులను సేకరించింది. ఆ మేరకు స్వచ్ఛంద సేవ చేయకుండా.. నిధులను దారి మళ్లించింది" అని ఈడీ హైదరాబాద్ విభాగం అధికారులు వెల్లడించారు. ఈ వ్యవహారంపై తొలుత సీఐడీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. ఆ కేసు ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు చేపట్టింది. "అనాథలు, దళిత విద్యార్థుల పేరిట వసూలు చేసిన విరాళాలతో స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు, ఆఫీస్ బేరర్లు ఆస్తులను కూడబెట్టుకున్నారు. తెలంగాణతోపాటు.. గోవా, కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ తదితర రాష్ట్రాల్లో ఆస్తులను కొనుగోలు చేశారు. గోవాలో షెల్ కంపెనీని సృష్టించి, దాని ద్వారా నిధులను మళ్లించుకున్నారు. విద్యాహక్కు చట్టం కింద సేకరించిన విరాళాలకు సైతం సరైన రికార్డులు లేవు" అని ఈడీ అధికారులు వివరించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.

ఎస్జీటీలకు పదోన్నతుల్లో న్యాయం చేయండి

- బీజేపీ అధికార ప్రతినిధి రాణి రుద్రమ

హైదరాబాద్, జూన్ 25(ఆంధ్రజ్యోతి): పదోన్నతుల్లో ఎస్జీటీ(సెకండరీ గ్రేడ్ టీచర్)లకు న్యాయం చేయాలని బీజేపీ అధికార ప్రతినిధి రాణి రుద్రమ డిమాండ్ చేశారు. వారిని నియమించినప్పుడు ఒక నియమం, పదోన్నతి కల్పించే సమయంలో మరో నియమం ఎలా వర్తిస్తుందని ప్రశ్నించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులందరికీ సమన్యాయం జరిగేలా ఒక కమిటీని నియమించి విధివిధానాలు ఖరారు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్‌లాగే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఉపాధ్యాయుల హక్కులను కాలరాస్తోందని ఆమె మండిపడ్డారు. కాగా, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సూచన మేరకే ఆ పార్టీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, కుంభకోణాల నుంచి బయటపడేందుకు కేసీఆరే ఎమ్మెల్యేల ఫిరాయింపుల పర్వాన్ని నడిపిస్తున్నారన్నారు.

ఎన్‌హెచ్‌ఎం బకాయిలు 693 కోట్లు ఇవ్వండి

కేంద్రమంత్రి నడ్డాకు సీఎం రేవంత్ విజ్ఞప్తి



కేంద్రమంత్రి జేపీ నడ్డాతో సీఎం రేవంత్‌రెడ్డి

న్యూఢిల్లీ, జూన్ 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన బకాయిలను విడుదల చేయాలని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద చెల్లించాల్సిన బకాయిలు రూ.693.13 కోట్లు వెంటనే విడుదల చేయాలని కోరారు. మంగళవారం రేవంత్ రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో కలిసి పార్లమెంటులో నడ్డాతో భేటీ అయ్యారు. పెండింగ్‌లో ఉన్న ఎన్‌హెచ్‌ఎం 2023-24 మూడు, నాలుగు త్రైమాసికాల నిధులు రూ.323.73 కోట్లను విడుదల చేయాలని కోరారు. 2024-25 మొదటి త్రైమాసిక గ్రాంటు రూ.138 కోట్లను మంజూరు చేయాల్సి ఉందన్నారు. మౌలిక వసతులు, నిర్వహణ కాంపోనెంట్ కింద 2023-2024 సంవత్సరానికి రావల్సిన రూ.231.40 కోట్లు తక్షణమే ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యారోగ్య రంగంపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నందున కేంద్రం సహకరించాలన్నారు. అత్యవసర వైద్యసేవలకు అంతరాయం కలగకుండా, సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు రాష్ట్ర వాటాతో పాటు కేంద్రం నుంచి రావల్సిన మొత్తాన్ని గతేడాది అక్టోబరు నుంచి తామే విడుదల చేస్తున్నామని నడ్డా దృష్టికి తీసుకెళ్లారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనలను తాము ఈ ఏడాది జనవరి నుంచి అమలు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు 5,159 బస్తీ దవాఖానాలు సమర్థంగా నిర్వహిస్తున్నట్లు నడ్డాకు రేవంత్ వివరించారు. సీఎం వెంట రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్ రెడ్డి, రాజ్యసభ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ ఉన్నారు.

మరిన్ని సీట్లు ఆశించాం!

సీఎం రేవంత్ వద్ద సోనియా వ్యాఖ్య!.. ఎంపీల ప్రమాణ స్వీకారం వేదికగా.. ప్రియాంక, సోనియాతో రేవంత్ చర్చలు

న్యూఢిల్లీ, జూన్ 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ, ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీతో దాదాపు గంటసేపు చర్చలు జరిపారు. పార్లమెంటులో నూతన ఎంపీల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సోనియా, ప్రియాంక హాజరైన సందర్భాన్ని ఇందుకు వినియోగించుకున్నారు. అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రమాణ స్వీకారాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు వారిద్దరు రావడం, అంతకన్నా ముందే తెలంగాణ ఎంపీల ప్రమాణం ఉండడంతో వారితో కలిసి సీఎం రేవంత్, రాష్ట్రానికి చెందిన పలువురు నేతలు ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. కాగా, వీవీఐపీ గ్యాలరీలో కూర్చున్న వీరి మధ్య రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు చర్చకు వచ్చినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రం నుంచి మరిన్ని సీట్లు వస్తాయని ఆశించామని రేవంత్‌తో సోనియా అన్నట్లు తెలిసింది. ఇక రుణమాఫీపై కేబినెట్ నిర్ణయాన్ని సోనియా దృష్టికి సీఎం తీసుకెళ్లారని సమాచారం. ఈ సమయంలో మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నేత జానారెడ్డి, గడ్డం వివేక్ తదితరులు వారి వెంటే ఉన్నారు. రాహుల్ ప్రమాణ స్వీకారం తర్వాత సోనియా, ప్రియాంకతో కలిసి బయటకు వచ్చిన రేవంత్.. వారికి వీడ్కోలు పలికారు. అంతకుముందు రెండో రోజు ఢిల్లీ పర్యటనలో భాగంగా రేవంత్ మంగళవారం ఉదయం 11 గంటలకు కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో పార్లమెంటులో భేటీ అయ్యారు. అనంతరం కాంగ్రెస్, ఇతర పార్టీల ఎంపీలతో ఆయన ముచ్చటించారు. బారామతి ఎంపీ సుప్రియా సూలేకు అభినందనలు తెలిపారు. మధ్యాహ్న భోజనానికి తుగ్లక్‌రోడ్‌లోని అధికారిక నివాసానికి చేరుకుని తిరిగి తెలంగాణ ఎంపీల ప్రమాణస్వీకారంలో పాల్గొనేందుకు మధ్యాహ్నం 1:40 నిమిషాలకు తిరిగి పార్లమెంట్‌కు వెళ్లారు. తమిళనాడు ఎంపీల ప్రమాణస్వీకారాన్ని వీక్షించారు.

రాష్ట్ర అభివృద్ధికి పోరాడండి: రేవంత్

ఎన్నికల్లో ఏ పార్టీ నుంచి గెలుపొందినా, రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా లోక్‌సభలో పోరాడాలని రాష్ట్ర ఎంపీలకు సీఎం రేవంత్ సూచించారు. ప్రమాణ స్వీకారం చేసిన ఎంపీలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. రాజకీయ వైరుధ్యాలు వేరు, రాష్ట్ర ప్రయోజనాలు వేరు అనే అంశాన్ని గుర్తించి ముందుకు సాగాలని, రాష్ట్ర అభివృద్ధికి పార్లమెంట్‌ను వేదికగా చేసుకోవాలని అన్నారు. కాగా, కాంగ్రెస్ నుంచి గెలిచిన తెలంగాణ ఎంపీలకు పార్టీ వ్యవహారాల రాష్ట్ర ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ మంగళవారం రాత్రి విందు ఇచ్చారు. సీఎం అధికారిక నివాసం తుగ్లక్ రోడ్‌లో జరిగిన ఈ విందుకు సీఎం రేవంత్‌తోపాటు ఎంపీలు, వారి కుటుంబసభ్యులు, మంత్రులు, పార్టీ నేతలు హాజరయ్యారు.



పార్లమెంటు వెలుపల రాష్ట్ర కాంగ్రెస్ నాయకులతో సీఎం రేవంత్‌రెడ్డి

ఎంపీల తడబాటు

ప్రమాణస్వీకార సమయంలో పలువురు ఎంపీలు తడపడ్డారు. తెలుగులో ప్రమాణస్వీకారం చేసినప్పటికీ పలు పదాలను పలకడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బలరాం నాయక్.. 'సార్వభౌమాధికారం' అనే పదాన్ని పలకడంలో తడబడ్డారు. కాగా, వరంగల్ ఎంపీ కడియం కావ్య ప్రమాణ స్వీకారం సమయంలో భావోద్వేగానికి గురయ్యారు. రాజ్యాంగ ప్రతిని ప్రదర్శించారు.

ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా జితేందర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

న్యూఢిల్లీ, జూన్ 25(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా జితేందర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఉదయం 10 గంటలకు ఆయన తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ ఎంపీల సమక్షంలో బాధ్యతలు స్వీకరించనున్నారు. లోక్‌సభ ఎన్నికల ముందు వరకు బీజేపీలో కొనసాగిన ఆయన, ఆ పార్టీ ఎంపీ టికెట్‌ను ఇచ్చేందుకు నిరాకరించడంతో కాంగ్రెస్‌లో చేరిన సంగతి తెలిసిందే.

నేడు ఢిల్లీకి భట్టి, ఉత్తమ్

హైదరాబాద్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణ, బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేల చేరికలపై చర్చలకు ఢిల్లీ వేదికగా మారింది. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డితోపాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, జూపల్లి తదితరులు ఢిల్లీలో ఉన్నారు. మరోవైపు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రి ఉత్తమ్ కుమార్ బుధవారం ఉదయం ఢిల్లీ బయలుదేరి వెళ్తున్నారు. రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణ, బీఆర్ఎస్ చేరికలు, జీవన్ రెడ్డి అలక తదితర అంశాలపై అధిష్ఠానం అందరితో మాట్లాడనుందని సమాచారం.



రాహుల్‌గాంధీతో మంత్రి సీతక్క

పంచాయతీ భవనాలకు

నిధులివ్వండి

- రక్షిత మంచినీటి సరఫరాకు కూడా
- కేంద్రమంత్రులకు మంత్రి సీతక్క విజ్ఞప్తి

న్యూఢిల్లీ, జూన్ 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 6,176 గ్రామపంచాయతీలకు భవనాలు లేవని, వాటి నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని కేంద్ర పంచాయతీరాజ్ మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్‌కు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఢిల్లీలో మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్‌తో ఆమె భేటీ అయ్యారు. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ పథకం ద్వారా పంచాయతీ భవనాల నిర్మాణం కోసం రూ. 1544 కోట్లు మంజూరు చేయాలని విన్నవించారు. అనంతరం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి చంద్రకాంత్ రఘునాథ్ పాటిల్‌తో కూడా సీతక్క భేటీ అయ్యారు. జల్ జీవన్ మిషన్ పథకం కింద పది లక్షల గృహాలకు రక్షిత మంచినీటిని అందించేందుకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే 53.98 లక్షల గృహాలకు రక్షిత మంచినీరు అందుతోందని, కొత్తగా నిర్మించిన గృహాలకు నల్లాల ద్వారా మంచినీటి సరఫరాకు నిధులు మంజూరు చేయాలని కోరారు. మరోవైపు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ఏఐసీసీ కేంద్రకార్యాలయంలో మంత్రి సీతక్క మర్యాదపూర్వకంగా కలిశారు. రాహుల్ ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా శాలువా కప్పి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్రంలో కొత్తగా

18 ఆర్ట్ కేంద్రాలు

- ఏర్పాటు బాధ్యత టీశాక్స్‌కు
- ఎయిడ్స్ బాధితులకు ఊరట

హైదరాబాద్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ బాధితులకు వైద్యం కోసం రాష్ట్రంలో కొత్తగా 16 జిల్లాల్లో 18 చోట్ల యాంటీ రిట్రోవైరల్ థెరపీ(ఆర్ట్) కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ బాధ్యతలను తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ(టీశాక్స్)కి అప్పగించారు. ములుగు, గద్వాల, వనస్థలిపురంలోని ఏరియా ఆస్పత్రులు, మెదక్, యాదాద్రి భువనగిరి, నారాయణపేట, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఆస్పత్రులతో పాటు హన్మకొండ క్షయ ఆస్పత్రిలో ఈ ఆర్ట్ కేంద్రాలను కొత్తగా ఏర్పాటు చేయబోతున్నారు. వీటితో పాటు మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, వికారాబాద్, భువనగిరి ఎయిమ్స్, నాగర్ కర్నూల్, వనపర్తి, సిరిసిల్ల, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాలలోని మెడికల్ కాలేజీల్లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్(న్యాకో) గణాంకాల ప్రకారం ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 17 జిల్లాల్లో 26 ఆర్ట్ కేంద్రాలున్నాయి. కాగా, తెలంగాణలో 1.05 లక్షల మంది ఎయిడ్స్ బాధితులున్నట్లు న్యాకో లెక్కలు చెబుతున్నాయి. గతేడాది కొత్తగా పదివేలకు పైగా కేసులు నమోదయ్యాయి. ఇదిలా ఉండగా, ప్రతీ ప్రైవేట్ మెడికల్ కాలేజీలో తప్పనిసరిగా ఆర్ట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ) తాజాగా అన్ని రాష్ట్రాలను ఆదేశించింది. మన రాష్ట్రంలో మొత్తం 28 ప్రైవేటు మెడికల్ కాలేజీలు ఉండగా.. ఇప్పటికే అపోలో, మల్లారెడ్డి సహా ఐదు ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో ఆర్ట్ కేంద్రాలున్నాయి. మిగిలిన 23 ప్రైవేటు కాలేజీల్లో త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి. దాంతో ప్రభుత్వ, ప్రైవేటుతో కలిపి ఆర్ట్ కేంద్రాల సంఖ్య 67కు పెరగనుంది.

ఐపీఎస్ నేతృత్వంలో 'ఆస్తుల పరిరక్షణ విభాగం'?

హైదరాబాద్, శివారు ప్రాంతాల్లో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సీనియర్ ఐపీఎస్ అధికారి నేతృత్వంలో 'ఆస్తుల పరిరక్షణ విభాగం' పేరుతో ప్రత్యేక వింగ్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడటంతోపాటు ఇప్పటికే ఆక్రమణలకు గురైన ప్రభుత్వ ఆస్తుల్ని గుర్తించి స్వాధీనం చేసుకోవడంలో నూతన విభాగం కీలకంగా పని చేయనుంది. మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి నేతృత్వంలో నూతన విభాగం ఏర్పాటుకు సంబంధించి త్వరలో ఉత్తర్వులు వెలువడనున్నాయి.

నేడు బడుల బంద్‌కు ఏబీవీపీ పిలుపు

ఏబీవీపీ రాష్ట్ర శాఖ బుధవారం రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చింది. ఈమేరకు రాష్ట్ర శాఖ నాయకుడు జీవన్ తెలిపారు. ఏళ్ల తరబడి ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని ఆరోపించారు. మరోవైపు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు లక్షలకు లక్షలు ఫీజులు దండుకుంటున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఈ సమస్యల విషయంలో ప్రభుత్వం తీరును నిరసిస్తూ జూన్ 26వ తేదీన బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలియజేశారు.

కాంగ్రెస్‌లో జీవన్‌రెడ్డి తుపాను!

ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడానికి సిద్ధం.. మండలి చైర్మన్ అందుబాటులో లేక.. వాయిదా

- ఆయనతో మాట్లాడాల్సిందిగా భట్టికి అధిష్ఠానం, సీఎం సూచన
- జీవన్‌రెడ్డితో గంటకుపైగా మంతనాలు
- అలకవీడని జీవన్‌రెడ్డి
- ఫోన్‌లో మాట్లాడిన దీపాదాస్ మున్షీ

హైదరాబాద్, జూన్ 25(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరిక.. కాంగ్రెస్‌లో కలకలానికి కారణమైంది. తనకు సమాచారం ఇవ్వకుండా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌ని, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని పార్టీలో చేర్చుకోవడం పట్ల మనస్తాపం చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి.. తన పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమయ్యారు. తదుపరి కార్యాచరణపై ఆయన సోమవారమే జగిత్యాలలో తన అనుచరులతో మంతనాలు జరపడంతో.. మంత్రి శ్రీధర్‌బాబు, జిల్లాకు చెందిన పార్టీ ఎమ్మెల్యేలు వెళ్లి జీవన్‌రెడ్డిని బుజ్జగించే ప్రయత్నం చేశారు. మంగళవారం సీన్ హైదరాబాద్‌కు మారింది. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమైన జీవన్‌రెడ్డి.. అసెంబ్లీ కార్యదర్శికి ఫోన్ చేశారు. రాజీనామా పత్రాన్ని తీసుకునే అధికారం తనకు లేదని.. దాన్ని మండలి చైర్మన్‌కు ఇవ్వాలని ఆయన సూచించడంతో గుత్తా సుఖేందర్‌రెడ్డికి ఫోన్ చేశారు. తాను ప్రస్తుతం అందుబాటులో లేనని చైర్మన్ ఆయనకు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, అధిష్ఠానం పెద్దలు.. జీవన్‌రెడ్డితో మాట్లాడాల్సిందిగా డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కకు సూచించారు. దీంతో.. భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు హైదరాబాద్‌లోని జీవన్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనతో గంటన్నరపాటు మంతనాలు జరిపారు. అయితే అధిష్ఠానం నుంచి ఎలాంటి స్పష్టమైన హామీ లేక పోవడంతో జీవన్‌రెడ్డి అలకవీడలేదని సమాచారం. కాగా.. జీవన్‌రెడ్డితో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సైతం మాట్లాడారు. ప్రస్తుతం ఢిల్లీలో ఉన్న ఆమె.. బుధ లేదా గురువారం హైదరాబాద్‌కు రానున్నారు. ఆమెతో భేటీ తర్వాత జీవన్‌రెడ్డి కార్యాచరణపైన స్పష్టత రానుంది. కాగా.. జీవన్‌రెడ్డి సీనియారిటీకి, గౌరవానికి తగ్గట్టుగా నిర్ణయాలు తీసుకుంటామని.. ఏ నాయకుడినీ కోల్పోవడానికి పార్టీ సిద్ధంగా లేదని భట్టి విక్రమార్క తెలిపారు. జీవన్‌రెడ్డితో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జీవన్ రెడ్డి పార్టీలో సీనియర్ నాయకుడు, తమకందరికీ మార్గదర్శకుడని.. ప్రభుత్వాన్ని నడపడంలో ఆయన అనుభవాన్ని తప్పనిసరిగా ఉపయోగించుకుంటామని చెప్పారు.



మీడియాతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి, జీవన్‌రెడ్డి, చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు

జీర్ణించుకోలేకపోతున్నా..

పార్టీ మారితే వెంటనే సభ్యత్వం కోల్పోయేలా చట్టంలో మార్పులు తెస్తామంటూ ఏఐసీసీ హామీ ఇచ్చిందని.. దానికి భిన్నంగా రాష్ట్రంలో కాంగ్రెస్‌లోకి ఇతర పార్టీల ఎమ్మెల్యేల చేరికలను తాను జీర్ణించుకోలేకపోతున్నానని జీవన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 65 మంది ఎమ్మెల్యేలతో సుస్థిరంగా ఉందని.. మిత్రపక్షం సీపీఐకి ఒక సీటుందని ఆయన గుర్తుచేశారు. ఏడుగురు ఎమ్మెల్యేలున్న ఎంఐఎం.. బీజేపీతో కలిసి నడిచే పరిస్థితే లేదన్నారు. ఇలాంటి సమయంలో ప్రభుత్వం ప్రజల మెప్పును పొందడంపై దృష్టి పెట్టాలని జీవన్‌రెడ్డి సూచించారు. గత 40 ఏళ్లుగా క్రమశిక్షణ గల కార్యకర్తగా పార్టీలో ఉన్న తాను.. పార్టీపరంగా లభించిన హోదాలో ఉండి పార్టీ నిర్ణయాన్ని విభేదించడం సరికాదన్నారు. అందుకే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలన్న ఆలోచనకు వచ్చినట్లు చెప్పారు. పార్టీ మారే ఆలోచన తనకు లేదని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

అధిష్ఠానం ఆమోదంతోనే..

కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరికలన్నీ అధిష్ఠానం ఆమోదంతో జరిగినవేనని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. చేరికలపైన జీవన్‌రెడ్డి మనస్తాపం చెందడాన్ని, ఆయన రాజీనామాకు సిద్ధపడడాన్ని పెద్దగా పట్టించుకోలేదంటున్నాయి. అటు అసెంబ్లీ, ఇటు లోక్‌సభ ఎన్నికల్లోనూ జీవన్‌రెడ్డి ఓటమిపాలు కావడమూ ఈ ఎపిసోడ్‌కు అధిష్ఠానం అంతగా ప్రాధాన్యం ఇవ్వక పోవడానికి ఒక కారణంగా చెబుతున్నాయి. అధిష్ఠానం అంగీకారం లేకుండా ఎమ్మెల్యేలను చేర్చుకోవడం జరగదన్న విషయం తెలిసీ.. హైడ్రామాకు జీవన్‌రెడ్డి తెరలేపడం అంతిమంగా బీఆర్ఎస్ పార్టీకి మేలు చేకూరుస్తుందని పార్టీ పెద్దలు కొందరు అసహనం చెందుతున్నట్లు చెబుతున్నారు.

నాడు చేనేతలను పట్టించుకోలేదు

- దొంగే.. దొంగ, దొంగ అన్నట్లుగా కేటీఆర్ తీరు
- చేనేతలో సంక్షోభం బీఆర్ఎస్ సర్కారు పుణ్యమే: తుమ్మల



హైదరాబాద్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): "మాజీ మంత్రి కేటీఆర్.. ముఖ్యమంత్రికి రాసిన బహిరంగ లేఖ చూస్తుంటే దొంగే.. దొంగ దొంగ అన్నట్లు ఉంది, గత పదేళ్లలో చేనేత రంగాన్ని అన్నిస్థాయిల్లో అస్తవ్యస్తంచేసి, సొంత లాభాలకు వాడుకుని ఇప్పుడు లేఖ పేరిట రాజకీయం చేయడం విడ్డూరం" అని వ్యవసాయ, మార్కెటింగ్, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. గత ప్రభుత్వం చేనేత కార్మికులను పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత కార్మికులకు దీర్ఘకాలిక లబ్ధి చేకూరే పథకాల కోసం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం 2018లో పవర్ లూమ్ కార్మికులకు ఇన్‌పుట్ సబ్సిడీ లింక్డ్ వేతనాల పరిహార పథకం (10% యార్న్ సబ్సిడీ) ప్రవేశపెట్టి నిధులు విడుదల చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే యార్న్ సబ్సిడీకి టెస్కో నుంచి రూ.33.23 కోట్లు విడుదల చేసిందన్నారు. మరమగ్గాలు, చేనేత మగ్గాల ఆధునికీకరణకు బీసీ సంక్షేమశాఖ శాఖ నుంచి 2024-25 సంవత్సరానికి కేటాయించిన రూ.400 కోట్ల బడ్జెట్ వినియోగించుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అంగీకరించినట్లు తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల నుంచి సుమారు రూ.255.27 కోట్ల విలువైన ఆర్డర్లు టెస్కోకు వచ్చినట్లు తెలిపారు. 2023లో బతుకమ్మ చీరల పథకం కింద టెస్కోకు రూ.351.52 కోట్లు చెల్లించలేదన్నారు. ఈ బకాయిల్లో రూ. 100 కోట్లు కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసినట్లు తుమ్మల వివరించారు. జనవరి 2024 నుంచి ఇప్పటి వరకు సిరిసిల్లలో ఆత్మహత్య చేసుకున్న 6 మంది చేనేత కార్మికుల ఆత్మహత్యలపై విచారణ జరిపి అర్హులైన వారికి ఎక్స్ గ్రేషియా చెల్లించటానికి చర్యలు తీసుకుంటున్నట్లు తుమ్మల తెలిపారు.

అందరికి మేలు జరిగేలా రైతు భరోసా

రాష్ట్రంలోని రైతులందరికీ మేలు జరిగేలా రైతు భరోసా కార్యక్రమాన్ని చేపడతామని మంత్రి తుమ్మల తెలిపారు. ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం' కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడారు. ప్రభుత్వం రైతు భరోసాకు సంబంధించి విధానపరమైన నిర్ణయాలు ఇంకా తీసుకోలేదని చెప్పారు. అందరి అభిప్రాయాలు సేకరించి, శాసనసభలో సభ్యులతో చర్చించిన తర్వాతే పథకాన్ని అమల్లోకి తెస్తామన్నారు. రైతులకు పెట్టుబడి సాయం రూ.10 వేల నుంచి ఎకరాకు 15 వేలకు పెంచుతున్నామన్నారు. గతంలో సాగులో లేని భూములకు రైతుబంధు వర్తింపజేసి 12 విడతల్లో సుమారు .25,670 కోట్ల ప్రజాధనం వృధా చేశారని ఆరోపించారు. 93% ఉన్న సన్న, చిన్నకారు రైతుల వాటా రైతు బంధు మొత్తంలో కనీసం 68% కూడా లేదని పేర్కొన్నారు. 17.5% ఉన్న కౌలు రైతుల్ని గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు.

భర్తతో ఉండాలనే కోరిక లేదా?

- నాతో సఖ్యతగా ఉంటే కేసు పరిష్కారం
- భూ వివాదం విషయంలో స్టేషన్‌కు వచ్చిన మహిళకు ఎస్సై వేధింపులు
- ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితురాలు


ఎస్సై ప్రవీణ్‌కుమార్

నల్లగొండ క్రైం, జూన్ 25: భూ వివాదంలో న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన తనను ఎస్సై వేధించారంటూ ఓ మహిళ నల్లగొండ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. 'నీ భర్తతో దూరంగా ఎందుకు ఉంటున్నావు? నాతో సఖ్యతగా ఉంటే పూర్తిగా సహకరిస్తా. అలాగైతేనే కేసు పరిష్కరిస్తా' అని ఎస్సై పేర్కొన్నట్లు ఆమె ఆరోపించారు. వివరాలిలా ఉన్నాయి.. శాలిగౌరారం మండలానికి చెందిన ఓ మహిళ భూమి విషయంలో జరిగిన ఘర్షణపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేయకుండా, మళ్లీ ఫిర్యాదు ఇవ్వాలంటూ ఈ ఏడాది ఏప్రిల్ 16న శాలిగౌరారం ఎస్సై వాస ప్రవీణ్‌కుమార్ ఆమెను స్టేషన్‌కు పిలిపించారు. రెండు గంటలపాటు ఆయన చాంబర్‌లో ఉంచి, అభ్యంతరకరంగా మాట్లాడడంతోపాటు వేధింపులకు గురిచేశారు. 'ఈ కేసును పరిష్కరించాలంటే నేను చెప్పినట్లు చేయాలి. ఎప్పుడు పిలిస్తే అప్పుడు రావాలి. చేపల కూర, చికెన్ వండుకుని తేవాలి. నాకు కావల్సినప్పుడల్లా గ్రీన్ టీ చేసి పెట్టాలి. భర్తకు దూరంగా ఎందుకు ఉంటున్నావ్? అతనితో ఉండాలన్న కోరిక లేదా?' అని ప్రశ్నించాడని బాధిత మహిళ వాపోయారు. తనకు అనేకమంది అమ్మాయిలు తెలుసునని, తనతో సఖ్యతగా ఉంటే పూర్తి సహకారం ఉంటుందని ఎస్సై చెప్పినట్లు ఎస్పీ ఎదుట బోరున విలపించారు. అతను చెప్పినట్లు చేయకపోవడంతో తన కుటుంబ విషయాల్లో జోక్యం చేసుకొని, గొడవలు సృష్టించినట్లు ఫిర్యాదులో తెలిపారు. ఈ ఘటనపై ఎస్పీ విచారణకు ఆదేశించినట్లు సమాచారం. మహిళ ఫిర్యాదుపై ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ను వివరణ కోరగా.. భూ పంచాయితీ విషయమై ఆమెను ప్రశ్నించానే తప్ప, వేధించలేదని చెప్పారు.

ఆగివున్న లారీని ఢీకొన్న ప్రైవేటు బస్సు

- బస్సులో ప్రయాణిస్తున్నవారిలో ఒకరి మృతి
- మరో 2 వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి దుర్మరణం

ధర్మారం, కామారెడ్డి, పటాన్‌చెరు, జూన్ 25: రాష్ట్రంలో మంగళవారం మూడు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందారు. కామారెడ్డి జిల్లా క్యాసంపల్లి గ్రామ పరిధిలో ఆగివున్న లారీని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీ కొట్టింది. ఈ ఘటనలో బస్సు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. బస్సులో ప్రయాణిస్తున్నవారిలో అఫ్జల్ ఖాన్ (26) అనే యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. మరో 28 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. వీరిలో బస్సు డ్రైవర్ షేక్ రషీద్‌కు కుడి కాలు విరగ్గా.. ముబీన్ అనే ప్రయాణికుడికి తల పగిలింది. వీరి పరిస్థితి విషమంగా ఉంది. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం మల్లాపూర్ వద్ద మంచిర్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు, మినీ ట్రక్కు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో మినీ ట్రక్కులోని డ్రైవర్ అన్వర్ (25), అబ్బల్(55) అనే మరో వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందారు. ట్రక్కు నుజ్జునుజ్జుకావడం.. లోపల మృతదేహాలు ఇరుక్కుపోవడంతో గ్యాస్ కట్టర్ ద్వారా కట్ చేసి బయటకు తీయాల్సి వచ్చింది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పరిధిలో ఔటర్ రింగ్ రోడ్డు ముత్తంగి జంక్షన్ వద్ద ఆగివున్న లారీని ఓ వ్యాను ఢీకొట్టింది. ఈ ఘటనలో వ్యాను క్యాబిన్‌లో డ్రైవర్ పక్కన కూర్చున్న ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. మృతులిద్దరూ బిహార్ వలస కూలీలు.

కల్యాణలక్ష్మి చెక్కులు ఇచ్చేలా ఆదేశాలివ్వండి

- హైకోర్టులో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పిటిషన్

హైదరాబాద్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు సంబంధించిన చెక్కుల గడువు ఈ నెల 27తో తీరిపోతున్నా వాటిని పంపిణీ చేయనివ్వడం లేదని.. వాటిని పంపిణీ చేసేలా ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని పేర్కొంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై మంగళవారం జస్టిస్ సూరేపల్లి నందా ధర్మాసనం విచారణ చేపట్టింది. లబ్ధిదారులకు ఇప్పటికే జారీ అయిన చెక్కులను పంపిణీ చేయకుండా రెవెన్యూ అధికారులు అడ్డుకుంటున్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. ప్రభుత్వం తరఫున ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ.. చెక్కుల పంపిణీలో ఎలాంటి జాప్యం లేదని.. ఒకవేళ చెక్కుల గడువు తీరిపోయినా ప్రభుత్వం మళ్లీ జారీ చేస్తుందన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఈనెల 27 నాటికి చెక్కుల కాలపరిమితి తీరిపోయే పక్షంలో పిటిషనర్‌కు అనుకూలంగా మధ్యంతర ఆదేశాలిస్తామని.. దీనిపై ప్రభుత్వ వైఖరి తెలియజేయాలని పేర్కొంది. విచారణను బుధవారానికి వాయిదా వేసింది.

కోర్టు తీర్పు రాకుండానే ప్రభుత్వ భూములని ఎలా అంటారు?

- మియాపూర్ భూములపై పలు సొసైటీల అభ్యంతరం

హైదరాబాద్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): మియాపూర్‌లో సర్వే నంబరు 100, 101 లో ఉన్న భూములను అధికారులు ప్రభుత్వ భూములని ప్రకటనలు చేయడంపై రవీంద్ర సొసైటీ, దీప్తి సొసైటీ, మైత్రి సొసైటీ, అయ్యప్ప సొసైటీ, ప్రశాంత నగర్ సొసైటీల సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ భూములకు సంబంధించి ప్రభుత్వం, సొసైటీల మధ్య వివాదం నడుస్తోంది. ఈ వ్యవహారంపై సుప్రీం కోర్టులో కేసు కొనసాగుతోంది. ఈ క్రమంలో న్యాయస్థానం నుంచి తీర్పు రాకుండానే వాటిని ప్రభుత్వ భూములని అనడం సరికాదని సొసైటీల సభ్యులు పేర్కొన్నారు. మియాపూర్‌లోని 100, 101 సర్వే నంబర్లలో గతంలో వేసిన లే అవుట్‌లో ప్లాట్లు కొనుగోలు చేశామని, 1983-86 మధ్య నిబంధనల ప్రకారం వేసిన లే అవుట్లలోనే తాము ప్లాట్లు కొనుగోలు చేశామని వారు స్పష్టం చేశారు. సుప్రీం కోర్టు తుది తీర్పు కోసం ఎదురుచూస్తున్నామని, తీర్పు వచ్చే వరకు ఈ భూములకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని కోరారు.

జర్నలిస్టుల బస్‌పాస్ గడువు పొడిగింపు

హైదరాబాద్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అక్రిడిటెడ్ జర్నలిస్టుల రాయితీ బస్‌పాస్ గడువును సెప్టెంబరు 30 వరకు పొడిగించినట్లు టీజీఎస్ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ నెల 26 నుంచి జర్నలిస్టులు సమీపంలోని బస్‌పాస్ కేంద్రాలకు వెళ్లి బస్‌పాస్‌లను రెన్యూవల్ చేయించుకోవచ్చని వివరించారు. సాంకేతిక కారణాల వల్ల జర్నలిస్టుల రాయితీ బస్‌పాస్‌ల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించడం లేదని స్పష్టం చేశారు.

ఈ-టికెట్ల బుకింగ్‌పై ఆంక్షలు లేవు: ఐఆర్‌సీటీసీ

హైదరాబాద్ సిటీ, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): ఐఆర్‌సీటీసీ ఆన్‌లైన్ టికెట్ల బుకింగ్ నిబంధనలు మారాయంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదని భారతీయ రైల్వే అధికారులు స్పష్టం చేశారు. వ్యక్తిగత యూజర్ ఐడీ నుంచి కుటుంబసభ్యులకు మాత్రమే టికెట్లు బుక్ చేసుకోవాలని, అలాకాకుండా స్నేహితులకు, బంధువులకు టికెట్లు బుక్ చేస్తే జైలుశిక్ష, జరిమానా విధిస్తారంటూ రెండ్రోజులుగా సోషల్ మీడియాలో పోస్టులు వైరల్ అవుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఐఆర్‌సీటీసీ అధికారులతో పాటు ఇండియన్ రైల్వే అధికార ప్రతినిధి మంగళవారం ఎక్స్ వేదికగా స్పందించారు. ఇతర ఇంటిపేర్లున్న వారికి టికెట్లు బుక్ చేసే విషయమై ఆంక్షలు పెట్టినట్లుగా, ప్రయాణికులను తప్పుదోవ పట్టించేలా జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదని పేర్కొన్నారు.

విద్యుత్తు కమిషన్ చెల్లదు

దాని ఏర్పాటు చట్ట విరుద్ధం, అక్రమం.. విద్యుత్తు చట్టంపై అధికార పరిధి ఈఆర్సీదే

- ఆపై అప్పిలేట్ ట్రిబ్యునల్, సుప్రీంలోనే
- కమిషన్ వేసే అధికారం సర్కారుకు లేదు
- విద్యుత్తు కమిషన్ విచారణపై స్టే ఇవ్వండి
- హైకోర్టులో మాజీ సీఎం కేసీఆర్ పిటిషన్

హైదరాబాద్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): తన ప్రభుత్వ హయాంలో చేపట్టిన విద్యుత్తు కొనుగోళ్లు, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణాల్లో అక్రమాలు జరిగాయని పేర్కొంటూ కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ ఎల్. నర్సింహా రెడ్డి కమిషన్‌ను ఏర్పాటు చేయడం చెల్లదని, దాని ఏర్పాటు అక్రమమని, కమిషన్ విచారణపై స్టే విధించాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. తనను వ్యక్తిగతంగా హాజరు కావాలంటూ కమిషన్ నోటీసు జారీ చేసిందని, దానిని కొట్టివేయాలని కోరారు. కమిషన్ ఏర్పాటుపై తాను స్పష్టమైన అభ్యంతరాలు తెలియజేసినా చైర్మన్ హోదా నుంచి జస్టిస్ నర్సింహా రెడ్డి తప్పుకోకపోవడాన్ని చట్ట విరుద్ధంగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇది రిజిస్ట్రీ పరిశీలనలో ఉండటంతో ఇంకా రెగ్యులర్ నంబర్ కేటాయించలేదు. రిజిస్ట్రీ పరిశీలన తర్వాత రెగ్యులర్ నంబర్ కేటాయిస్తారు. ఆ తర్వాత సంబంధిత రోస్టర్ ఉన్న ధర్మాసనం ఎదుటకు పిటిషన్ విచారణకు వచ్చే అవకాశం ఉంది.

పిటిషన్‌లో కేసీఆర్ వాదన ఇదీ..

విద్యుత్తు కొనుగోళ్ల అంశంపై ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండలి, తెలంగాణ రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండలి (ఈఆర్సీలు) ఇప్పటికే విచారణ చేపట్టాయి. మళ్లీ అదే అంశంపై జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ ఏర్పాటుకు విద్యుత్తు శాఖ జీవో 9 జారీ చేయడం చెల్లదు. అధికార పరిధికి విరుద్ధంగా కమిషన్ ఏర్పాటు చేయడం చెల్లదు. ఎలక్ట్రిసిటీ చట్టం - 2003లోని సెక్షన్ 86 (1)(ఏ) ప్రకారం విద్యుత్తుకు సంబంధించిన వ్యవహారాలపై ఆయా రాష్ట్రాలకు చెందిన ఈఆర్సీలు విచారణ చేపట్టాల్సి ఉంటుంది. విద్యుదుత్పత్తి టారిఫ్, సరఫరా, ట్రాన్స్‌మిషన్, హోల్‌సేల్, బల్క్, రిటెయిల్ ధరలు తదితర అంశాలపై రెగ్యులేటరీ కమిషన్‌లకు మాత్రమే విచారణాధికారం ఉంటుంది. ఈఆర్సీ నిర్ణయాలు, తీర్పులపై మళ్లీ ఎంక్వైరీ కమిషన్ ఏర్పాటు చేసే అధికారం ప్రభుత్వానికి లేదు. విద్యుత్తు కొనుగోళ్లు, ధరల నిర్ణయం, పంపిణీకి సంబంధించిన లైన్లు, ప్రొక్యూర్‌మెంట్ ప్రాసెస్, రాష్ట్ర పరిధిలో విద్యుత్తు పంపిణీకి ఏర్పాట్లు వంటి అంశాలన్నీ ఈఆర్సీ పరిధిలోని అంశాలు.



అందుకే, విద్యుత్తు చట్టానికి విరుద్ధంగా.. అధికార పరిధి లేకుండా జారీ చేసిన ఎంక్వైరీ కమిషన్ ఏర్పాటు జీవో చెల్లదు. దాని ఏర్పాటు విషయంలో విద్యుత్తు చట్టం రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి అధికారాలు ఇవ్వలేదు. విద్యుత్తు వివాదాలను ఎలా పరిష్కరించాలో ఆ చట్టంలో స్పష్టంగా ఉంది. కాబట్టి.. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ యాక్ట్ - 1952 కింద ప్రభుత్వం తన అధికారాలను ఉపయోగించి ఈ కమిషన్‌ను ఏర్పాటు చేయడం చెల్లదు. కమిషన్ ఏర్పాటు నిర్ణయంతో విద్యుత్తు చట్టంలోని సెక్షన్ 61, 62, 86లను ఉల్లంఘించేలా ప్రభుత్వం వ్యవహరించింది. పార్లమెంట్ ఆమోదించిన విద్యుత్తు చట్టానికి ఇతర కేంద్ర, రాష్ట్ర చట్టాలపై ఓవర్ రైడింగ్ పరిధి ఉంటుంది. అంటే.. రాష్ట్ర విద్యుత్తు రెగ్యులేటరీ కమిషన్ ఇచ్చిన ఆదేశాలు నచ్చకపోతే అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు వెళ్లవచ్చు. అక్కడి నుంచి నేరుగా సుప్రీం కోర్టుకు వెళ్లాల్సి ఉంటుంది. అంతే తప్పితే, విద్యుత్తుకు సంబంధించిన వ్యవహారాల్లో ఎంక్వైరీ కమిషన్ ఏర్పాటు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదు. ఈ అంశంపై సుప్రీం కోర్టు, హైకోర్టులు గతంలో అనేక తీర్పులు వెలువరించాయి. జీవో జారీ చేసే ముందు ప్రభుత్వం చట్టాన్ని, సుప్రీంకోర్టు తీర్పులను పట్టించుకోలేదు. చట్టంలో చెప్పిన విధంగా కాకుండా ప్రభుత్వం తనకు ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరించింది. కమిషన్ చైర్మన్‌గా ఉన్న జస్టిస్ నర్సింహా రెడ్డిని తప్పుకోవాలంటూ ఇప్పటికే నేను లేఖ రాశాను. ముందస్తుగా నిర్ణయించుకున్న ప్రకారం.. ఆయన ఇప్పటికే తప్పు జరిగిపోయినట్లుగా మీడియా సమావేశాలు నిర్వహించి నాకు నష్టం కలిగేలా వ్యవహరించారు. విచారణ కమిషన్ చైర్మన్‌గా ఆయన తప్పుకోలేదు. సరికదా.. కమిషన్ ఎదుట వ్యక్తిగతంగా హాజరు కావాలంటూ నాకు నోటీసు జారీ చేశారు. తద్వారా, నాకు నష్టం కలగడమే కాదు.. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తుంది. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ చట్టంలోని సెక్షన్ 8బీ, 8సీకి విరుద్ధంగా ఎంక్వైరీ కమిషన్ నాకు నోటీసు జారీ చేసింది. చట్ట విరుద్ధంగా ఉన్న ఈ నోటీసును కొట్టేయాలి. చట్టాలను ఉల్లంఘిస్తూ కమిషన్ ఏర్పాటు చేసిన నేపథ్యంలో మరో ప్రత్యామ్నాయం లేక ఆర్టికల్ 226 కింద హైకోర్టు జోక్యాన్ని కోరుతున్నాను. ఈ నేపథ్యంలో కమిషన్ ఏర్పాటుపై స్పష్టమైన అభ్యంతరాలు తెలియజేసినా కమిషన్ చైర్మన్ హోదా నుంచి జస్టిస్ నర్సింహారెడ్డి తప్పుకోలేదు. దీనిని చట్టవిరుద్ధమని ప్రకటించడంతోపాటు కమిషన్ ఇచ్చిన నోటీసును కొట్టేయాలి. తుది ఆదేశాలు జారీ చేసే వరకు కమిషన్ విచారణపై స్టే విధిస్తూ మధ్యంతర ఆదేశాలు ఇవ్వండి.

కేసీఆర్ నిందితుడిగా ఉన్న రైల్ రోకో కేసుపై హైకోర్టు స్టే

మాజీ సీఎం కేసీఆర్ నిందితుడిగా ఉన్న 2011 నాటి రైల్ రోకో కేసుపై హైకోర్టు స్టే విధించింది. పోలీసులు దాఖలు చేసిన చార్జిషీట్ ప్రకారం రైల్‌రోకోలో కేసీఆర్ ప్రత్యక్షంగా పాల్గొన్నట్లు కనిపించడం లేదని పేర్కొంది. నేరం జరిగిన ప్రదేశంలో పిటిషనర్ లేరని పేర్కొంటూ తదుపరి విచారణ చేపట్టే వరకు ఈ కేసుకు సంబంధించిన అన్ని ప్రొసీడింగ్స్‌పైనా స్టే విధిస్తున్నట్లు జస్టిస్ బి.విజయ్‌సేన్ రెడ్డి ధర్మాసనం స్పష్టం చేసింది. 2011 సెప్టెంబర్ 15న అప్పటి జేఏసీ నాయకులు కేసీఆర్, కోదండరాం ఇచ్చిన పిలుపు మేరకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత, మరో 40 మంది నాయకులు, మౌలాలి రైల్వేస్టేషన్‌లో సికింద్రాబాద్ నుంచి వస్తున్న రైళ్లను నిలిపేసి రైల్‌రోకో నిర్వహించారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ సహా ఇతరులపై ఐపీసీ, పీడీపీపీ, రైల్వే చట్టాల్లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఇటీవల ఈ కేసులో పోలీసులు చార్జిషీట్ దాఖలు చేశారు. దాంతో, ఈ కేసును కొట్టేయాలంటూ కేసీఆర్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు.

విచారణకు రండి!

- కేసీఆర్‌కు జస్టిస్ ఎల్. నర్సింహా రెడ్డి కమిషన్ నోటీసులు
- మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి, ప్రభాకర్ రావులకు కూడా వారంలోపు వచ్చి వాస్తవాలను వివరించాలంటూ శ్రీముఖం



హైదరాబాద్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు ఒప్పందాలు, థర్మల్ ప్లాంట్ నిర్మాణాలపై మీరు లిఖితపూర్వకంగా పంపించిన వాదనలకు, వాటిని ఖండిస్తూ వివిధ వర్గాలు సమర్పించిన పత్రాలకు పొంతన లేదని, తమ ఎదుట హాజరై వాస్తవాలను వివరించాలంటూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు జస్టిస్ ఎల్.నర్సింహా రెడ్డి కమిషన్ నోటీసులు జారీ చేసింది. కేసీఆర్‌తోపాటు విద్యుత్తు శాఖ మాజీ మంత్రి జి.జగదీశ్ రెడ్డి, జెన్‌కో, ట్రాన్స్‌కో మాజీ సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావుకు కూడా కమిషన్ ఈనెల 19న నోటీసులు పంపింది. అవి ఈనెల 21న కేసీఆర్‌కు చేరినట్లు సమాచారం. నోటీసులు అందిన వారం రోజుల్లో (అంటే.. 21న నోటీసులు చేరితే.. ఈనెల 28వ తేదీలోపు) వాస్తవాలను తమకు వివరించాలని కమిషన్ స్పష్టం చేసింది. ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్తు ఒప్పందం, పోటీ బిడ్డింగ్ లేకుండా యాదాద్రి ప్లాంట్ నిర్మాణం, కాలం చెల్లిన టెక్నాలజీతో భద్రాద్రి పవర్ ప్లాంట్ నిర్మించారని ఆరోపిస్తూ వాటిపై విచారణకు జస్టిస్ నర్సింహా రెడ్డి కమిషన్‌ను రేవంత్ ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. 'రికార్డులన్నీ పరిశీలిస్తుంటే ఆ నిర్ణయాలన్నీ మీరే తీసుకున్నట్లు కనిపిస్తోంది' అంటూ కమిషన్ ఇప్పటికే కేసీఆర్‌కు నోటీసులు పంపింది. దీనికి కేసీఆర్ ఘాటుగా జవాబు ఇచ్చారు కూడా. మీ కమిషన్‌కే విచారణార్హత లేదని, విచారణ బాధ్యత నుంచి తప్పుకోవాలంటూ జస్టిస్ నర్సింహా రెడ్డికే తేల్చి చెప్పారు. తన ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాలను సమర్థించుకుంటూ ఆ లేఖలో వివరణ ఇచ్చారు. ఆ తర్వాత దీనిపై కమిషన్ వివిధ వర్గాల అభిప్రాయాలను సేకరించింది. తాజాగా కేసీఆర్‌తోపాటు జగదీశ్ రెడ్డి, ప్రభాకర్ రావుకు నోటీసులు పంపింది. ఈ నేపథ్యంలోనే, విద్యుత్తు కమిషన్ విచారణను నిలుపు చేయాలని కోరుతూ హైకోర్టులో కేసీఆర్ పిటిషన్ దాఖలు చేశారు. దాంతో, కమిషన్ ఎదుట కేసీఆర్ హాజరవుతారా!? లేదా!? అనే ఉత్కంఠ నెలకొంది.

ఢిల్లీలో మహిపాల్‌రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

కలిసేందుకు ఢిల్లీకి రాలేదని, వ్యక్తిగత పనిమీద లాయర్లను సంప్రదించేందుకు వచ్చానని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి వివరణ ఇవ్వడం గమనార్హం. కేసీఆర్ నిర్వహించిన అత్యవసర సమావేశానికి విదేశాల్లో ఉన్న బీఆర్ఎస్ నాయకులు సైతం ఆఘమేఘాలపై తిరిగి రాగా.. మహిపాల్ రెడ్డి మాత్రం ఢిల్లీకి వెళ్లడం రాజకీయంగా చర్చనీయాంశం అయింది. ఉమ్మడి మెదక్ జిల్లాలోనే బలమైన నేతగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి పేరుంది. మూడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఆయనను కాపాడుకోవడం బీఆర్ఎస్‌కు కీలకంగా భావిస్తున్నారు. ఈడీ దాడుల అనంతరం మాజీ మంత్రి హరీశ్‌రావు, పార్టీ ఎమ్మెల్యేలు మహిపాల్ రెడ్డి ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామంటూ ధైర్యం చెప్పారు. మరోపక్క కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలూ మహిపాల్‌రెడ్డిని టార్గెట్ చేసినట్లు కనిపిస్తోంది. గతంలో ఎమ్మెల్యే సోదరుడు మధుసూధన్‌రెడ్డిపై మైనింగ్, రెవెన్యూ శాఖలు కేసులు నమోదు చేయడంతో.. ఆయన జైలుకు వెళ్లాల్సి వచ్చింది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థ ఈడీ ఎమ్మెల్యే అక్రమాస్తులపై దృష్టి కేంద్రీకరించింది. ఈ నేపథ్యంలో పార్టీ మారాలంటూ.. మహిపాల్‌రెడ్డిపై కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు ఒత్తిడి తీసుకొస్తున్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. దీనికితోడు ఇటీవల మెదక్ లోక్‌సభ సీటు బీజేపీ కైవసం చేసుకోవడంతో ఆ పార్టీ జిల్లాలో బలోపేతం అయ్యేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ ఫిరాయింపు ప్రచారానికి బలం చేకూర్చే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో ఉన్న సమయంలోనే ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కూడా ఢిల్లీకి వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఆయన ఢిల్లీలో కాంగ్రెస్ నేతలను కలిసేందుకు వెళ్లారా.. లేదా బీజేపీ అధిష్ఠానం ఆశీస్సుల కోసం వెళ్లారా? అన్నదానిపై చర్చ జరుగుతోంది.

నయవంచనకు ప్రతిరూపం కాంగ్రెస్

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): ఎమర్జెన్సీ కాలం నాటి నుంచి నేటి వరకు నయవంచనకు ప్రతిరూపం కాంగ్రెస్సేనని.. ఓ వైపు రాజ్యాంగ పరిరక్షణ అంటూనే మరో వైపు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్ని దశాబ్దాలు గడిచినా ప్రజాస్వామ్యంపై కాంగ్రెస్ అదే దాడిని కొనసాగిస్తోందని మంగళవారం 'ఎక్స్' వేదికగా ఆరోపించారు. పౌర, ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ, ప్రజల గొంతుల్ని అణచివేస్తూ 49 ఏళ్ల కిందట ఇదే రోజు(జూన్ 25న) కాంగ్రెస్ పార్టీ దేశంలో ఎమర్జెన్సీ విధించిందన్నారు. 'ఓ వైపు రాజ్యాంగ పరిరక్షణ అంటూ పార్లమెంట్‌లో రాజ్యాంగం కాపీలను ఆ పార్టీ నేతలు చేత పట్టుకొని ప్రదర్శన చేస్తారు. మరోవైపు అదే పార్లమెంట్‌కు కొద్ది దూరంలోని వాళ్ల పార్టీ కార్యాలయంలో రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాసేలా పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తారు' అని కేటీఆర్ ఆరోపించారు.

రేవంత్ అబద్ధాలు మాట్లాడొద్దు: బి. వినోద్

తెలంగాణకు సైనిక్ స్కూల్ తేవడాన్ని కేసీఆర్ పట్టించుకోలేదని.. సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడం తగదని, అబద్ధాలు మాట్లాడొద్దని మాజీ ఎంపీ బి. వినోద్‌కుమార్ అన్నారు. గత ప్రభుత్వంలో కేంద్రానికి ఏయే ప్రతిపాదనలు వెళ్లాయో సీఎంవోలో చూసి తెలుసుకోవాలని సూచించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడుతూ అప్పటి రక్షణశాఖ మంత్రి మనోహర్ పారికర్‌ను పలుసార్లు కలిసి సైనిక్ స్కూల్ గురించి విన్నవించామని తెలిపారు.

తొందర పడొద్దు


ఎర్రవెల్లిలోని తన ఫామ్ హౌజ్‌లో మంగళవారం ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను కలిసిన కేసీఆర్

(మొదటి పేజీ తరువాయి)

చర్చలు జరిపారు. మాజీ మంత్రులు టి.హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డితోపాటు జీహెచ్ఎంసీ పరిధిలోని ఎమ్మెల్యేలు కేపీ వివేకానందగౌడ్, మాగంటి గోపీనాథ్, ముఠా గోపాల్, మాధవరం కృష్ణారావు, అరికపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్, ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, దండె విఠల్, మాజీ ఎమ్మెల్యేలు జోగు రామన్న, నాయకులు క్యామ మల్లేశ్, రావుల శ్రీధర్ రెడ్డి ఈ భేటీలో పాల్గొన్నారు. తొలుత తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ అంతర్గత విషయాలపై అందరు ఎమ్మెల్యేలతో చర్చించిన కేసీఆర్.. ఆ తర్వాత ఒక్కొక్కరితో ప్రత్యేకంగా భేటీ అయినట్లు సమాచారం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "నా దగ్గర ఒక ప్రణాళిక ఉంది. తొందరలోనే అనుకూల పరిస్థితులు వస్తాయి. అదీ నెలలోపే. ఎవరూ అధైర్యపడొద్దు.. కొన్ని తప్పుల వల్ల మనం ఓడిపోయాం. ఇప్పుడు దాని గురించి బాధపడితే ప్రయోజనం లేదు. మీరు నన్ను నమ్ముకున్నారు.. నేనూ విమ్మల్ని నమ్మాను. ఇలాంటి సమయంలో పార్టీ మారే ఆలోచన చేయొద్దు. కొన్ని రోజుల్లో కీలక పరిణామాలు జరగనున్నాయి. తొందర పడకండి.. వేచి చూస్తే మనందరికీ మంచిది" అని ఎమ్మెల్యేలతో కేసీఆర్ అన్నారు. ప్రస్తుత పరిస్థితులు మారడానికి నెల సమయం కూడా పట్టదన్నారు. "పదేళ్లు నన్ను నమ్ముకొని ఉన్నారు. మీకు నష్టం కలగకుండా చూసుకుంటా. మంచో చెడో ఓడిపోయాం.. మిమ్మల్ని నాశనం చేయను. ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా నేరుగా నా దగ్గరకు రండి.. ఫోన్ చేయండి. వాళ్లా వీళ్లా ఎవరూ ఉండాల్సిన పనిలేదు. నేరుగా వచ్చి నన్ను కలవండి" అని కేసీఆర్ అన్నట్లు తెలిసింది.

మనం కఠినంగా వ్యవహరించలేదు..

తాము అధికారంలో ఉన్నప్పుడు కఠినంగా ఉండలేదని, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, కొందరు నేతలు వచ్చి పనులు అడిగితే చేశామని కేసీఆర్ తెలిపారు. వారు కూడా తమ పట్ల మంచి భావంతోనే ఉన్నారని, అయితే వారి పార్టీ వేరు.. తమ పార్టీ వేరు అంతే అని వ్యాఖ్యానించారు. మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సహా ఒకరిద్దరు పార్టీ మారడాన్ని పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదని, కొందరు ఎమ్మెల్యేలు పార్టీ మారినంత మాత్రాన బీఆర్ఎస్‌కు వచ్చే నష్టమేమీ లేదని అన్నారు. "ఇలాంటి పరిణామాలు ఆనాటి వైఎస్ హయాంలోనే జరిగాయి. అయినా మనం భయపడలేదు. ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో రేవంత్‌రెడ్డి విఫలమయ్యారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయి. సమీప భవిష్యత్తులో మనకు మంచి రోజులు వస్తాయి" అని కేసీఆర్ చెప్పారు. ఇకనుంచి వరుసగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశాలు ఉంటాయని తెలిపారు.

పార్టీ మారిన ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు చేయాలి

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- రేవంత్.. మా ఎమ్మెల్యేలను చేర్చుకుంటే తప్పు సరికాదు: నిరంజన్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ గుర్తుపై గెలిచి.. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల సభ్యత్వాన్ని రద్దు చేయాలని, పార్టీ మారిన వారిని వదిలి పెట్టబోమని, ప్రజల ముందు దోషులుగా నిలబెడతామని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జి.జగదీశ్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ తాత మధుతో కలిసి వారు మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ తన పదవిని కాపాడుకునేందుకే పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని వారిపై పిటిషన్ ఇచ్చేందుకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను సమయం కోరామని, రెండు రోజుల్లో సమయమిస్తానని ఆయన చెప్పినట్లు వారు వెల్లడించారు. 'లోక్‌సభ ఎన్నికల ఫలితాలు.. తన పాలనకు రెఫరెండమన్న సీఎం రేవంత్ రెడ్డి మాటకు దిక్కులేకుండా పోయింది. తెలంగాణలో కాంగ్రెస్ వైఫల్యంపై వాస్తవ పరిస్థితులు తెలుసుకునేందుకు ఆ పార్టీ అధిష్ఠానం ప్రత్యేక కమిటీవేసింది' అని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధిష్ఠానం కమిటీ వేశాక.. రాష్ట్రంలో తన వైఫల్యం లేదని చూపించుకునేందుకే.. రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను తమ పార్టీలోకి తీసుకువెళ్తున్నారని ఆరోపించారు. నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకోవడం ద్వారా తప్పును రేవంత్ తన తప్పును సరిదిద్దుకోలేరన్నారు. బీజేపీ వైఖరి వల్ల దేశం రెండుగా చీలిపోయిందని, ఈ కీలక సమయంలో కాంగ్రెస్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిందన్నారు.

'ప్రియమైన తోటి విద్యార్థులారా!'

- నాయకత్వ లక్షణాలపై పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు శిక్షణ
- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులతో ప్రత్యేక ప్రసంగాలు
- ప్రతి రోజు యోగా, ధ్యానం తరగతులు
- విద్యా శాఖ కీలక నిర్ణయాలు

హైదరాబాద్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రియమైన నా తోటి విద్యార్థులకు, గౌరవనీయులైన ఉపాధ్యాయులకు నమస్కారం.. లాంటి మాటలు చెబుతూ ప్రసంగాలివ్వడం అందరివల్లా కాదు. ఉపన్యాసం సంగతి అటుంచితే వేదికను చూస్తేనే చాలామంది వణికిపోతారు. ఈ భయం అన్ని వయస్సుల వారిలో ఉంటుంది. అయితే, ఈ భయాన్ని పోగొట్టి పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. విద్యార్థుల్లో ఉండే భయాలను పోగొట్టేందుకు ప్రసంగాలు ఇవ్వడంపై సాధన చేయించాలని నిర్ణయించింది. అలాగే, మనసు, శరీరాన్ని నియంత్రణలో ఉంచుకునేందుకు వీలుగా విద్యార్థులకు యోగా, ధ్యానంలో శిక్షణ ఇప్పించనుంది. ఈ ఏడాది నుంచే అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యక్రమాలను అమలు చేయాలని విద్యా శాఖ నిర్ణయించింది. ఇందులో కొన్ని కార్యక్రమాలను అకడమిక్ క్యాలెండర్‌లో ఇప్పటికే పొందుపరిచారు. మిగిలిన కార్యక్రమాలను త్వరలోనే ప్రారంభించనున్నారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతీ రోజు ఐదు నిమిషాల పాటు యోగా, ధ్యానం తరగుతులు నిర్వహిస్తారు. స్కూల్ అసెంబ్లీ పూర్తయిన తర్వాత విద్యార్థులు తరగతి గదుల్లోకి వెళ్లిన వెంటనే ఇవి జరుగుతాయి. ఇక, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే లక్ష్యంగా ప్రతీ రోజు పాఠశాల పరిధిలో విద్యార్థుల మధ్య ప్రసంగాల పోటీని నిర్వహించనున్నారు. తరగతులు, పాఠశాలల వారీగా ఈ పోటీలు ఉంటాయి. ఈ పోటీలను జిల్లాస్థాయిలో నిర్వహిస్తే ఎలా ఉంటుందనే అంశాన్ని కూడా విద్యా శాఖ అధికారులు పరిశీలిస్తున్నారు. ఇక, కో-కరికులర్ సబ్జెక్టు పరిధిలో ఫిజికల్ అండ్ మెంటల్ ఎడ్యుకేషన్, న్యూట్రిషన్ అండ్ సేఫ్టీ, ఆర్ట్ అండ్ కల్చర్, స్పోర్ట్స్ అండ్ కల్చర్ అంశాల్లో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 14 తరగతులు, ప్రాథమికోన్నత విద్యార్థులకు 9, ఉన్నతపాఠశాల విద్యార్థులకు ఎనిమిది తరగతులు నిర్వహించనున్నారు. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు నెలలో ప్రతీ మూడో శనివారాన్ని నోబ్యాగ్ డేగా పాటించనున్నారు. సాంకేతికతకు అందిపుచ్చుకునేందుకు వీలుగా డిజిటల్ తరగతులను కూడా నిర్వహించాలని నిర్ణయించారు.

ఎప్‌సెట్ కౌన్సెలింగ్ తేదీల మార్పు!

» 27న నిర్వహించాల్సి ఉండగా వచ్చే నెల 4కు వాయిదా

హైదరాబాద్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి సంబంధించిన ఎప్‌సెట్ కౌన్సెలింగ్ తేదీలు మారాయి. ఈ మేరకు తాజాగా అధికారులు కొత్త షెడ్యూల్‌ను ప్రకటించారు. ఇదివరకటి షెడ్యూల్ ప్రకారం ఈ కౌన్సెలింగ్ ప్రక్రియ ఈ నెల 27న ప్రారంభం కావాల్సి ఉంది. తాజాగా దీన్ని వచ్చే నెల 4వ తేదీకి వాయిదా వేశారు. మొత్తం మూడు దశలో ఈ కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నారు. అప్పటికీ ఇంకా సీట్లు మిగిలితే.. స్పాట్ అడ్మిషన్లను చేపట్టనున్నారు. ఈ మొత్తం ప్రక్రియ ఆగస్టు వరకు కొనసాగనుంది. కొత్త షెడ్యూల్ ప్రకారం జూలై 4 నుంచి 12వ తేదీల మధ్య అభ్యర్థులు ఆన్‌లైన్ స్లాట్‌ను నమోదు చేసుకుని, ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. తర్వాత జూలై 6 నుంచి 13వ తేదీల మధ్య సర్టిఫికెట్ల వెరిఫికేషన్, 8 నుంచి 15వ తేదీ వరకు ఆప్షన్ల నమోదు, 19 తేదీన సీట్లను కేటాయించనున్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు 19 నుంచి 23వ తేదీల మధ్య సెల్ఫ్ రిపోర్టింగ్‌ను చేయాలి. జూలై 26 నుంచి రెండవ దశ కౌన్సెలింగ్‌ను, ఆగస్టు 8వ తేదీ నుంచి చివరి దశ కౌన్సెలింగ్‌ను చేపట్టనున్నారు. ఆగస్టు 21 నుంచి 28 వరకు ఇంటర్నల్ స్లైడింగ్ ప్రక్రియ నిర్వహిస్తారు. అప్పటికీ ఇంకా సీట్లు మిగిలితే ఆగస్టు 28వ తేదీన స్పాట్ అడ్మిషన్లను చేపట్టనున్నారు.

తాజా షెడ్యూల్ ప్రకారం ఇంజనీరింగ్ సీట్ల భర్తీ కౌన్సెలింగ్ వివరాలు

అంశం	తేదీలు
మొదటి దశ స్లాట్ నమోదు	జూలై 04 -12
సర్టిఫికెట్ల వెరిఫికేషన్	జూలై 06 -13
ఆప్షన్ల నమోదు	జూలై 08 -15
సీట్ల కేటాయింపు	జూలై 19
సెల్ఫ్ రిపోర్టింగ్	జూలై 19-23
రెండో దశ కౌన్సెలింగ్	జూలై 26 నుంచి
మూడో దశ కౌన్సెలింగ్	ఆగస్టు 08నుంచి
స్పాట్ అడ్మిషన్లు	ఆగస్టు 28

రెండో రోజూ జూడాల సమ్మె

హైదరాబాద్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా జూడాల సమ్మె మంగళవారం కూడా కొనసాగింది. వారి సమ్మెను సర్కారు అంత తీవ్రంగా పరిగణించినట్లుగా కనిపించడం లేదు. సమ్మె చేస్తామనగానే జూడాలను ఒక రోజు చర్చలకు పిలిచారు. చర్చలు విఫలమైన తర్వాత ఆ అంశం గురించి పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జూడాల ప్రతినిధులతో మాట్లాడినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. డిమాండ్లలో కొన్నింటికే హామీ ఇచ్చి, మిగతావి పట్టించుకోలేదని జూడాలు ఆరోపిస్తున్నారు. డీఎంఈతో జరిగిన చర్చలూ సఫలం కాలేదు. దీంతో తమ సమ్మె కొనసాగుతుందని జూడాలు సోమవారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ క్రమంలో మంగళవారం మళ్లీ చర్చలు ఉంటాయని అందరూ భావించారు. కానీ, సర్కారు వారి సమ్మె విషయాన్ని పట్టించుకోలేదు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించింది. జూడాలు సేవలు నిలిపివేసినప్పటికీ మిగిలిన సిబ్బందితో వైద్య సేవలందించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. అలాగే జూడాలు తమకు సంబంధించినవి కాకుండా ఇతర సమస్యలు.. అవి కూడా సాధ్యం కానివి డిమాండ్ చేస్తున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం చేపట్టాలని జూడాలు డిమాండ్ చేస్తున్నారు. వాస్తవానికి దీనిపై కోర్టులో కేసు నడుస్తోంది. అందుకే వారి సమ్మెను పట్టించుకోవడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు సర్కారీ దవాఖానాల్లో ఓపీ, ఐపీ సేవలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని.. సమ్మెను తీవ్రతరం చేస్తామని జూడాలు హెచ్చరించారు. అవసరమైతే అత్యవసర సేవలను కూడా బహిష్కరిస్తామని ప్రకటించారు.

స్పీకర్ ఎన్నికల్లో ఎన్డీయేకే జగన్ మద్దతు

అమరావతి, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ స్పీకర్ ఎన్నికల్లో వైసీపీ అధినేత జగన్ ఎన్డీయేకు తమ మద్దతు ప్రకటించారు. ఎన్డీయే అభ్యర్థి, మాజీ అభ్యర్థి ఓం బిర్లా తిరిగి ఎన్నికయ్యేందుకు సహకరించాలని మంగళవారం బీజేపీ నేతలు కోరగానే... జగన్మోహన్‌రెడ్డి అందుకు అంగీకరించారు. అయితే, ఎన్డీయే ప్రభుత్వంలో చేరిన చంద్రబాబు.. ప్రధాని మోదీని ప్రత్యేక హోదా ఎందుకు కోరలేదని జగన్ ఇటీవల ప్రశ్నించిన సంగతి తెలిసిందే. మరి స్పీకర్ ఎన్నికకు సహకరించాలని బీజేపీ తనను కోరినప్పుడు.. అందుకు ప్రతిగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని ఆయన ఎందుకు డిమాండ్ చేయలేదని రాజకీయ పక్షాలు నిలదీస్తున్నాయి.

విపక్ష నేత హోదా ఇవ్వాల్సిందే!

» బెదిరించే ధోరణిలో మాజీ సీఎం జగన్ లేఖ

» ఇస్తేనే అసెంబ్లీకి వస్తానని సంకేతాలు



అమరావతి, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో తనకు ప్రతిపక్ష నేత హోదా కల్పించాలని ఏపీ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి స్పీకర్ అయ్యన్న పాత్రుడికి లేఖ రాశారు. లేదంటే సభకు వచ్చి ఉపయోగం ఉండదని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటీవలి ఎన్నికల్లో వైసీపీకి అసెంబ్లీలో 11 స్థానాలే దక్కాయి. సభలో ఆ పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా, జగన్‌కు ప్రతిపక్ష నేత హోదా లభించాలంటే కనీసం పది శాతం సీట్లలో అంటే.. 18 స్థానాల్లో ఆయన పార్టీ విజయం సాధించాలి. కానీ ఏడు స్థానాలు తగ్గాయి. దీంతో స్పీకర్ ఆయన్ను సభలో వైసీపీ శాసనసభాపక్ష నేతగా గుర్తిస్తారు తప్ప.. ప్రతిపక్ష నేతగా గుర్తించే వీలు లేకుండా పోయింది. అయినా సరే.. తనకు విపక్ష నేత హోదా ఇవ్వాల్సిందేనని.. లేదంటే అసెంబ్లీకి రానన్నట్లుగా బెదిరించే ధోరణిలో జగన్ స్పీకర్‌కు లేఖ రాశారు. కొత్త అసెంబ్లీ సమావేశాల తొలిరోజు మాజీ ముఖ్యమంత్రినైన తనను సీఎం చంద్రబాబు తర్వాత కాకుండా మంత్రుల తర్వాత ఎమ్మెల్యేగా ప్రమాణం చేయించడం అసెంబ్లీ పద్ధతులకు విరుద్ధమని తెలిపారు. తద్వారా తనకు ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వకూడదని ముందుగానే నిర్ణయించుకున్నట్లు ఉన్నారని అన్నారు. ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటే పది శాతం సీట్లు ఉండాలని చట్టంలో ఎక్కడా లేదని.. పార్లమెంటులో గానీ.. ఉమ్మడి రాష్ట్రంలో గానీ ఈ నిబంధన పాటించలేదని అన్నారు. "1984లో లోక్‌సభలో టీడీపీకి చెందిన పర్వతనేని ఉపేంద్రకు ప్రతిపక్ష నేత హోదా ఇచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో 1994లో 294 స్థానాలకు కాంగ్రెస్ 26 సీట్లలో గెలిచింది. నాడు కాంగ్రెస్ నేత పి.జనార్దన్‌రెడ్డికి ప్రతిపక్ష నేత హోదా ఇచ్చారు" అని జగన్ తన లేఖలో పేర్కొన్నారు.

శత్రుత్వం ప్రదర్శిస్తున్నారు..

అధికార కూటమి, స్పీకర్ ఇప్పటికే తనపై శత్రుత్వం ప్రదర్శిస్తున్నారని జగన్ ఆరోపించారు. "ఎన్నికల్లో వైసీపీ 40 శాతం ఓట్లు సాధించింది. సభలో ప్రజల సమస్యలను ప్రస్తావించాల్సిన బాధ్యత నాపై ఉంది. నాపై పాలక కూటమి నేతలు, స్పీకర్ బహిరంగంగానే శత్రుత్వం ప్రదర్శించారు. ఈ పరిస్థితుల్లో ప్రతిపక్ష హోదా లేకుండా కేవలం 11 మంది సభ్యుల పార్టీగా మాత్రమే తమను చూస్తే సభా కార్యకలాపాల్లో పాల్గొనడం వల్ల ఉపయోగం ఏముంటుంది? ఈ అంశాన్ని అర్థం చేసుకుని త్వరగా స్పందించాలి" అని జగన్ స్పీకర్‌ను కోరారు.

అసత్యాలు.. అర్ధసత్యాలే...

స్పీకర్‌కు రాసిన లేఖలో అనేక అసత్యాలు, అర్ధసత్యాలు ఉండటం గమనార్హం. జగన్ తన లేఖలో పేర్కొన్నట్లుగా... పర్వతనేని ఉపేంద్ర 1984లో లోక్‌సభ సభ్యుడు కాదు. ఆ ఏడాది ఏప్రిల్లో ఆయన రాజ్యసభకు మొదటిసారి ఎన్నికయ్యారు. అలాగే 1994లో ఉమ్మడి ఆంధ్ర అసెంబ్లీలో పి.జనార్దన్ రెడ్డిని ప్రధాన ప్రతిపక్ష నేతగా స్పీకర్ గుర్తించలేదు. కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ) నేతగా మాత్రమే గుర్తించారు. అప్పట్లో ఆయన చేత అసెంబ్లీలో అక్షర క్రమంలో అందరు ఎమ్మెల్యేలతో సమానంగానే ప్రమాణ స్వీకారం చేయించారు. సభాపతికి లేఖ రాసేటప్పుడు నిజానిజాలు పరిశీలించుకోవాలని.. తప్పుదోవ పట్టించే విధంగా ఉండకూడదని రాజకీయ వర్గాలు అంటున్నాయి.

లోక్‌సభలో ఆ సంప్రదాయం లేదు..

లోక్‌సభలో అధికార పక్షం కాకుండా.. అధిక సభ్యులు కలిగిన రాజకీయ పార్టీ నేతకు ప్రతిపక్ష హోదా ఇచ్చే సంప్రదాయం లేదు. ప్రతిపక్ష నాయకుడి హోదాపై చట్టం చేసిన 1977లోనే ఐదో లోక్‌సభకు అధికారికంగా ప్రతిపక్ష నేతను ప్రకటించలేదు. ఇందిరాగాంధీ హయాంలో 1970 డిసెంబరు 27 నుంచి 1977 జూన్ 30 దాకా ప్రతిపక్ష నేత పదవి ఎవరికీ దక్కలేదు. మళ్లీ ఆమె ప్రధాని అయ్యాక 1980-84 మధ్య కూడా ఎవరికీ విపక్ష నేత హోదా లేదు. 1984-89 నడుమ రాజీవ్ గాంధీ హయాంలోనూ అధికారికంగా ప్రతిపక్ష నేత ఎవరూ లేరు. దీనికి కారణం.. ఎవరికీ సభలో ఉన్న మొత్తం స్థానాల్లో 10 % రాకపోవడమే. 2014, 19ల్లో మోదీ హయాంలో కాంగ్రెస్‌కు వరుసగా 44, 52 సీట్లు వచ్చాయి. అధిక సంఖ్యాబలం ఉన్న విపక్షం అదే అయినప్పటికీ ఈ పదేళ్లూ దానికి విపక్ష హోదా లభించలేదు. ఆ పార్టీ కోరినా ప్రభుత్వం అంగీకరించలేదు.



కుప్పం బస్టాండ్ వద్ద జరిగిన ఏపీ సీఎం చంద్రబాబు సభ హాజరైన ప్రజానీకం

మోయలేనంత భారం

» ఎంత కష్టమైనా మోస్తా: చంద్రబాబు

» కుప్పంలో ఏపీ సీఎం పర్యటన

కుప్పం, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో పరిస్థితులు మీరు అనుకున్నంత ఆశాజనకంగా ఏమీ లేవు. ఖజానా ఖాళీగా ఉంది. మోయలేనంత భారముంది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఎలా పరిపాలిస్తావని అందరూ అంటున్నారు. నాకు మనోధైర్యం ఉంది. కష్టాలు చూసి పారిపోయేవాడిని కాను. ఎంత కష్టమైనా పడతా.. ఎంత భారమైనా మోస్తా' అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్‌ను తిరగరాయబోతున్నానని ప్రకటించారు. నాలుగోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన తొలిసారిగా తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో రెండ్రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం వచ్చారు. భారీవర్షం కురుస్తున్నా.. కుప్పం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద బహిరంగ సభలో ప్రసంగించారు. రూ.4 వేలకు పెంచిన పింఛన్ మొత్తాన్ని ఒకటో తేదీనే ఇంటికొచ్చి ఇస్తామన్నారు. 'ప్రభుత్వం చేసే మంచి పనులకు ప్రజలు తోడు ఉండాలి. గత ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టు మోసం. ఇచ్చిన హామీ మేరకు ఆ చట్టాన్ని రద్దు చేస్తున్నాం. మీ పట్టాదార్ పాస్‌పుస్తకాలపై జగన్ ఫొటో తీసేసి, మళ్లీ రాజముద్రతో పంపిణీ చేస్తాం. త్వరలో 283 అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తాం' అని వివరించారు.

నా మెజారిటీ 48 వేలేనా?

'ఓట్లు.. గుద్దారు. అంతా వన్ సైడ్. రాష్ట్రమంతా ఒక ఊపు ఊపింది. కానీ కుప్పంలో 48 వేలేనా' అని నియోజకవర్గ ప్రజల ఎదుట చంద్రబాబు ఆవేదన వ్యక్తంచేశారు. బహిరంగ సభలో ఆయన ప్రసంగం హఠాత్తుగా టీడీపీ కూటమి ప్రభజనంవైపు మళ్లింది. 'గాజువాకలో 95 వేలు మెజారిటీ. భీమిలిలో 92 వేలు.. మునుపెన్నడూ గెలవని మంగళగిరిలో లోకేశ్‌కు 91 వేల మెజారిటీ.. పవన్ కల్యాణ్‌కు 71 వేలు. నేనే ఆశ్చర్యపోయాను. రాష్ట్రమంతా టీడీపీ సునామీ. మరి ఇక్కడెంత.. 48 వేలా' అంటూ అంతటితో ఆపేశారు. పోస్టల్ బ్యాలెట్ వన్ సైడ్ అయిందని.. మహిళలు, బీసీలు కూడా ఏకపక్షంగా వేశారని చెప్పారు. 'మా ఇంట్లో ఆడవాళ్లు ఎప్పుడైనా బయటకు రావడం చూశారా? భువనేశ్వరి వచ్చి ప్రచారం చేసింది. వీళ్ల చేసిన అరాచకానికి తప్పలేదు' అని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్ల తర్వాత సీఎం హోదాలో కుప్పం వచ్చిన చంద్రబాబుకు ఘన స్వాగతం లభించింది. ఆయన్ను చూసేందుకు జనం పోటెత్తారు. పీఈఎస్ మెడికల్ కాలేజీలో హెలిప్యాడ్ వద్ద జిల్లా నాయకులు, అధికారులు స్వాగతం పలికారు.

శరణు... శరణు!

ఢిల్లీ అండ కోసం జగన్ పాట్లు

» కేంద్ర సర్కారుకు బయటి నుంచి మద్దతు!

» లిఖితపూర్వకంగానే బీజేపీకి సమాచారం

» అంశాల వారీగా కాదు... 'అన్నింటికీ' జై

» పాత కేసులకు తోడు... కొత్త స్కాములు

» చంద్రబాబును అరెస్టు చేయించి ఆనందం

» తననూ అరెస్టు చేస్తారని జగన్ ఆందోళన!?

అమరావతి/న్యూఢిల్లీ, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): అధికారం కోల్పోయి... అనుకున్నవేవీ జరగక... దిక్కుతోచని పరిస్థితిలో పడ్డ వైఎస్ జగన్మోహన్ రెడ్డి కేంద్ర పెద్దల శరణుజొచ్చినట్లు తెలుస్తోంది. ఎన్డీయే సర్కారుకు పదేళ్లుగా ఆయన మద్దతు ఇస్తూనే ఉన్నారు. తాజాగా.. ప్రభుత్వానికి బయటి నుంచి తమ మద్దతు ఉంటుందని 'బేషరతు'గా వెల్లడించినట్లు తెలిసింది. రెండు రోజుల కిందట దీనిపై కేంద్రానికి లిఖితపూర్వకంగానే సమాచారం పంపినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అక్రమాస్తుల కేసులో జగన్ అరెస్టయి... దాదాపు పదేళ్లుగా బెయిలుపై ఉన్న సంగతి తెలిసిందే. ఆయనపై అరెస్టు కత్తి వేలాడుతూనే ఉంది. ఈ నేపథ్యంలో... ఏపీలో విపక్షంలో ఉన్నప్పుడూ, అధికారంలో ఉన్నప్పుడు బీజేపీతో పూర్తిస్థాయి సఖ్యత ప్రదర్శిస్తున్నారు. పైకి 'అంశాలవారీగా మద్దతు' అని చెబుతూనే... ఆయా అంశాల విషయంలో బీజేపీ అడగకముందే మద్దతు ప్రకటిస్తూ వచ్చారు. ఇప్పుడు ఆయనపై కేసులు పాతవే అయినప్పటికీ... పరిస్థితులు మాత్రం పూర్తిగా కొత్తవి! రాష్ట్రంలో జగన్ అధికారం కోల్పోయారు. వైసీపీ స్థాయిని ప్రజలు 11 అసెంబ్లీ స్థానాలకు కుదించారు. నాలుగు లోక్‌సభ స్థానాలు మాత్రమే కట్టబెట్టారు. రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఘన విజయం సాధించడమే కాకుండా... కేంద్ర ప్రభుత్వానికి టీడీపీ ఎంపీల మద్దతు అత్యంత కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో చంద్రబాబుకు జాతీయ స్థాయిలో ప్రాధాన్యం పెరిగింది. ఇవన్నీ జగన్ ఊహించని, అస్సలు కోరుకోని పరిణామాలు. తాను ముఖ్యమంత్రిగా ఉండగా... చంద్రబాబును స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఇరికించి, అరెస్టు చేసి... 53 రోజులు జైలులో పెట్టారు. అచ్చెన్నాయుడు నుంచి ధూళిపాళ్ల నరేంద్ర వరకు అనేకమంది టీడీపీ నేతలను రకరకాల కేసుల్లో అరెస్టు చేయించారు. "నేను ఇంత చేసినప్పుడు.. నన్ను ఏమీ చేయకుండా ఉంటారా?" అనే భయం జగన్‌కు పట్టుకున్నట్లుంది. పైగా... జగన్ హయాంలో జరిగిన మద్యం, ఇసుక, గనుల కుంభకోణాల లెక్కలను కొత్త ప్రభుత్వం బయటికి లాగుతోంది. ఈ కేసుల్లో జగన్‌ను పూర్తి ఆధారాలతో అరెస్టు చేయడం పెద్ద కష్టమేమీ కాదు. అటు సీబీఐ కేసులకు ఇటు రాష్ట్ర పోలీసులు పెట్టే కేసులు తోడైతే మరోమారు కారాగారవాసం తప్పదని జగన్ ఆందోళన చెందుతున్నట్లు కనిపిస్తోంది. ఈ కష్టాల నుంచి గట్టెక్కాలన్నా, కేసుల నుంచి ఉపశమనం లభించాలన్నా కేంద్ర పెద్దల 'అండ' ఉండాల్సిందే అని భావిస్తున్నట్లు సమాచారం. అందుకే... తనకు ఉన్న నలుగురు ఎంపీలతో కేంద్రానికి బయటి నుంచి, బేషరతుగా మద్దతు ప్రకటించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే... బుధవారం జరిగే లోక్‌సభ స్పీకర్ ఎన్నికల్లోనూ ఎన్డీయేకు జగన్ మద్దతు ప్రకటించేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● బుధవారం 26 జూన్ 2024

ఒక వస్తువుని ఉత్పత్తి చేయడం ఎంత ముఖ్యమో, దానిని అంతే భద్రంగా వినియోగదారుడికి చేర్చడం కూడా ప్రధానమే. ఈ ప్రక్రియలో కూడా ఎంతో మంది పాల్గొంటారు. అందులో ప్యాకేజింగ్ ముఖ్యమైనది. వస్తువు స్వరూప స్వభావాలను అనుసరించి అవసరమైన విధంగా అట్టపెట్టె లేదంటే మరొకదానిలో పెట్టాలి. భద్రంగా దానిని వినియోగదారుడి ఇంటికి లేదంటే తను సందర్శించే షాపు వద్దకు చేర్చాలి. ఈ ప్రాసెస్ మొత్తం ప్యాకేజింగ్ కిందకు వస్తుంది. ఈ రంగంలో ప్రాథమిక కోర్సు 'డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్ టెక్నాలజీ'. హైదరాబాద్ రామంతపూర్‌లో ఉన్న జెఎన్ గవర్నమెంట్ పాలిటెక్నిక్‌లో ఈ కోర్సు ఉంది.

విలక్షణ కోర్సు ప్యాకేజింగ్ టెక్నాలజీ



గ్రామాలు లేదంటే సమీప వ్యవసాయ క్షేత్రాల నుంచి పట్టణాలకు వెదురు బుట్టలు, తాటాకు తట్టల్లో కూరగాయలు, పండ్లు వస్తుంటాయి. జనుము సంచీల్లో బియ్యం రవాణా అవుతుంది. అయితే సాంకేతిక పురోభివృద్ధితో ప్యాకేజింగ్ అక్కడితో ఆగలేదు. ఒక హోటల్ నుంచి వండిన ఆహార పదార్థం, ఒక ఫార్మా కంపెనీ నుంచి పలు రకాల మందులు డిస్ట్రిబ్యూటర్‌కు చేరుకోవడం మొదలుకుని రకరకాల వస్తువులు ఆన్‌లైన్‌లో పొందే అవకాశం నేడుంది. ఆ క్రమంలో వస్తువు చెడిపోకుండా వినియోగదారుడికి చేర్చే ప్రక్రియకు సాంకేతికతను జోడించారు. దానిని పటిష్ఠంగా అమలు చేసేందుకు ప్యాకేజింగ్ ప్రధాన ఊతంగా మారింది. దేశీయంగా మధ్యతరగతి ఎదుగుదల, వ్యవస్థీకృత రీటైల్ రంగ విస్తరణ, ఎగుమతుల్లో పెరుగుదల ఫలితంగా ఈ కామర్స్ బలపడింది. అది సహజంగానే ప్యాకేజింగ్ పెరుగుదలకు దోహదపడింది. కొవిడ్ సంక్షోభం ఊహించని పెనుముప్పు. అయితే, ప్యాకేజింగ్ పరిశ్రమకు మాత్రం మంచి ఊపునిచ్చింది. ఒక పక్క ఔషధ పరిశ్రమ, మరోపక్క ఇంటికే నేరుగా డెలివరీలతో ప్యాకేజింగ్ పరిశ్రమ అవసరం బాగా పెరిగింది. ఆహారం నుంచి అవసరమైన వస్తువు వరకు ఏదైనా సరే, తప్పనిసరి పరిస్థితుల్లో ఇంటికే తెప్పించుకోవాల్సిన అగత్యం ఏర్పడింది.

కోర్సుగా: హైదరాబాద్‌లోని రామాంతపూర్‌లో ఉన్న జెఎన్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ మాత్రమే ఈ కోర్సును ఆఫర్ చేస్తోంది. ఈ కోర్సులో 60 సీట్లు ఉన్నాయి. 1996లో దీన్ని ఇక్కడ ఆరంభించారు. దక్షిణాది రాష్ట్రాల్లో ముఖ్యంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఈ ఒక్క పాలిటెక్నిక్ మాత్రమే ప్యాకేజింగ్ టెక్నాలజీలో డిప్లొమాను అందిస్తోంది. గ్రామీణ, పేద విద్యార్థులకు ఈ కోర్సు నిజంగా వరమని చెప్పాలి. అత్యంత ప్రతిభావంతులైన ఫ్యాకల్టీ ఈ కోర్సును తీర్చిదిద్దడం నుంచి తమ విద్యార్థులకు ప్రాక్టికల్ ఎక్స్‌పీరియెన్స్ కల్పించేందుకు తద్వారా వారు ఉద్యోగాల్లో స్థిరపడేందుకు ఎంతో కృషి చేస్తున్నారు. కోర్సులో భాగంగా ప్యాకేజింగ్ మెటీరియల్ బేసిక్స్, మెథడాలజీ, డిజైన్, అప్లికేషన్ వంటి విషయాలన్నీ బోధిస్తారు. చివరి సెమిస్టర్‌లో సంబంధిత కంపెనీకి పంపి ప్రాక్టికల్‌గా అవగాహన కల్పిస్తారు.

ఉన్నత చదువులు

- ఈసెట్‌లో ర్యాంక్ సాధించి లేటరల్ ఎంట్రీ కింద బీటెక్‌లో చేరవచ్చు. మెకానికల్, ఏరోనాటికల్, ప్రొడక్షన్ ఇంజనీరింగ్ సీఎస్ఇ, ఐటీ బ్రాంచీల్లో చేరవచ్చు.
- హరియాణా రాష్ట్రం హిస్సార్‌లోని గురు జంబేశ్వర్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అలాగే హర్యానా సెంట్రల్ యూనివర్సిటీ ప్రింటింగ్ అండ్ ప్యాకేజింగ్ టెక్నాలజీలో బీటెక్ కోర్సును అందిస్తున్నాయి.
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ సహకారంతో హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ ప్యాకేజింగ్‌లో ఎమ్మెస్సీ, ఐఐటీ రూర్కీ ప్యాకేజింగ్ టెక్నాలజీలో ఎంటెక్ అందిస్తున్నాయి.
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ నేరుగా ప్యాకేజింగ్‌లో సర్టిఫికెట్, పీజీ డిప్లొమా ఆఫర్ చేస్తోంది.

ఉపాధి: ప్రొడక్ట్ డెలివరీ(అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి సంస్థలు), ఫుడ్ డెలివరీ(స్విగ్గీ, జొమాటో వంటివి), ఫార్మా ఇండస్ట్రీ సహా ప్యాకేజింగ్ అవసరమైన ప్రతి సంస్థలో వీరికి ఉపాధి అవకాశాలు ఉంటాయి. ఎలక్ట్రికల్ - ఎలక్ట్రానిక్ గాడ్జెట్ల నుంచి వినియోగదారుడి చెంతకు చేరాల్సిన ప్రతి ప్రొడక్ట్‌కు ప్యాకేజింగ్ అవసరమే. అందుకే ఈ డిప్లొమా చేసిన వారికి నిరుద్యోగం అన్న ప్రసక్తే ఉండదు. నిజానికి డిమాండ్‌కు తగ్గ సరఫరాలేదు. ప్రాక్టికల్ ఎక్స్‌పీరియెన్స్ కోసం ఈ ఏడాది 16 మందిని తీసుకున్న రెడ్డి ల్యాబ్స్ ఒకొక్కరికి స్టయిపెండ్‌గా రూ.15,000 చెల్లిస్తోందని ప్యాకేజింగ్ టెక్నాలజీ హెడ్ డాక్టర్ వై.వెంకటరెడ్డి తెలిపారు. తదుపరి మరో ఆరు నెలలు కూడా అదే స్టయిపెండ్‌కు పనిచేస్తే రెగ్యులర్ స్కేల్ ఇస్తామని హామీ ఇచ్చారని అన్నారు. అంతేకాకుండా అరబిందో సహా పలు కంపెనీలు కూడా తమ విద్యార్థులను ఈ ఏడాది తీసుకున్నాయని తెలిపారు. చివరకు కోర్సు పూర్తి చేయలేని విద్యార్థులను సైతం కంపెనీలు తీసుకునే పరిస్థితి నెలకొందని ఆయన వివరించారు.

తెలంగాణ క్రీడా పాఠశాలల్లో అయిదోతరగతి ప్రవేశాలు

హైదరాబాద్-మాసబ్‌ట్యాంక్‌లోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ- రాష్ట్రంలోని క్రీడా పాఠశాలల్లో అయిదోతరగతి ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. మొత్తం 160 సీట్లు ఉన్నాయి. ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఎంపికైన విద్యార్థులకు బోధన, భోజనం, వసతి ఉచితం. రెండు జతల పీటీ డ్రెస్, ట్రాక్ సూట్, షూస్-సాక్స్, కిట్ బ్యాగ్, వాటర్ బాటిల్, టవల్, క్యాప్ తదితరాలు ఇస్తారు.

క్రీడా పాఠశాలలు-సీట్లు

- టీజీటీడబ్ల్యూయూఆర్‌జేసీ(బాలురు), ఏటూరునాగారం స్పోర్ట్స్ స్కూల్, ములుగు జిల్లా-80 సీట్లు
- టీజీటీడబ్ల్యూయూఆర్‌జేసీ(బాలికలు), చేగుంట స్పోర్ట్స్ స్కూల్, మెదక్ జిల్లా-80 సీట్లు

అర్హత: టీజీటీడబ్ల్యూఆర్ఈఐఎస్ సంస్థలు, ఆదర్శ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలు, జిల్లా పరిషత్ పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలలు, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో నాలుగోతరగతి చదివిన బాలబాలికలు అప్లయ్ చేసుకోవచ్చు. విద్యార్థులకు ఫిజికల్ ఫిట్‌నెస్ తప్పనిసరి. కుటుంబ వార్షికాదాయం 2023-24 సంవత్సరానికి పట్టణాల్లో రూ.2 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.5 లక్షలు మించకూడదు.



ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు

- ఇందులో బ్యాటరీ టెస్ట్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్‌లు ఉంటాయి.
- బ్యాటరీ టెస్ట్-వెయిటేజీ: హైట్, వెయిట్, 30మీ ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, మెడిసిన్ బాల్ పుట్, షటిల్ రన్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, వర్టికల్ జంప్, 200మీ రన్‌లకు ఒక్కోదానికి మూడు మార్కులు నిర్దేశించారు. ఒక గేమ్ ఈవెంట్ కూడా ఉంటుంది.
- ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్‌లో వినికిడి శక్తి, కంటిచూపు, ఇతర అవయవాల పనితీరు తదితరాలను పరీక్షిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 1
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** జూలై 8 నుంచి
- **ఎంట్రెన్స్ టెస్ట్(బ్యాటరీ టెస్ట్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్) తేదీలు:** జూలై 18, 19
- **ఎంపికైన అభ్యర్థుల సమాచారాన్ని ఎస్ఎంఎస్/ఫోన్ ద్వారా తెలిపే తేదీ:** జూలై 30
- **క్రీడా పాఠశాలల్లో అడ్మిషన్స్:** ఆగస్టు 1
- **వెబ్‌సైట్:** www.tgtwgurukulam.telangana.gov.in

జేఎన్‌టీయూకేలో ఇంటర్నేషనల్ కొలాబరేటివ్ ప్రోగ్రామ్

కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూకే)- ఇంటర్నేషనల్ కొలాబరేటివ్ ప్రోగ్రామ్(ఐసీపీ)లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. స్వీడన్‌లోని బ్లీకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బీటీహెచ్)తో కలసి ఆరేళ్ల ప్రోగ్రామ్‌ను, యూఎస్ఏలోని యూనివర్సిటీ ఆఫ్ నార్తరన్ అయోవా(యూఎన్ఐ)తో కలసి నాలుగేళ్ల ప్రోగ్రామ్‌ను అందిస్తోంది. జేఈఈ మెయిన్ 2024/ఏపీ ఈఏపీసెట్ 2024/టీజీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్, కౌన్సెలింగ్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

జేఎన్‌టీయూకే-బీటీహెచ్ ప్రోగ్రామ్: ఈ ప్రోగ్రామ్‌లో సీఎస్ఈ, సీఎస్ఈ(ఏఐ&ఎంఎల్), ఈసీఈ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కో స్పెషలైజేషన్‌లో 20 సీట్లు చొప్పున మొత్తం 60 సీట్లు ఉన్నాయి. వీటిలో సగం సీట్లను ఐఐటీ జేఈఈ మెయిన్ అభ్యర్థులకు మిగిలిన సగం సీట్లను టీజీ/ఏపీ ఈఏపీసెట్ అభ్యర్థులకు నిర్దేశించారు.

- ప్రోగ్రామ్ మొదటి మూడేళ్లు కాకినాడ జేఎన్‌టీయూలో, చివరి మూడేళ్లు బీటీహెచ్-స్వీడన్‌లో చదవాల్సి ఉంటుంది. నాలుగో ఏడాది కోర్సును బీటీహెచ్‌లో పూర్తిచేశాక ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది. వీరికి కాకినాడ జేఎన్‌టీయూ బీటెక్ డిగ్రీని, బీటీహెచ్ బీఎస్ డిగ్రీని ప్రదానం చేస్తాయి. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ మొత్తం పూర్తిచేసినవారికి బీటీహెచ్ నుంచి ఎంఎస్ డిగ్రీ లభిస్తుంది.

ఎంఎస్ స్పెషలైజేషన్‌లు: కంప్యూటర్ సైన్స్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, మెషిన్ లెర్నింగ్-సెన్సర్స్-సిస్టమ్స్.

జేఎన్‌టీయూకే-యూఎన్ఐ ప్రోగ్రామ్: ఈ ప్రోగ్రామ్‌లో ఈఈఈ స్పెషలైజేషన్ ఉంది. మొదటి మూడేళ్లు కాకినాడ జేఎన్‌టీయూలో, చివరి ఏడాది యూఎన్ఐ-యూఎస్ఏలో చదవాలి. వీరికి జేఎన్‌టీయూకే నుంచి బీటెక్ డిగ్రీ, యూఎన్ఐ నుంచి బీఎస్ డిగ్రీ లభిస్తుంది. ఆసక్తిగల అభ్యర్థులు యూఎన్ఐలో కోర్సును కొనసాగిస్తూ మాస్టర్స్ ప్రోగ్రామ్‌లో చేరే వీలుంది.

అర్హత వివరాలు: తెలంగాణ/ఆంధ్రప్రదేశ్ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ నుంచి ఎంపీసీ గ్రూప్‌తో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 70 శాతం మార్కులు తప్పనిసరి. సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ అభ్యర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థులందరికీ జేఈఈ మెయిన్ 2024/ఏపీ ఈఏపీసెట్ 2024/టీజీ ఈఏపీసెట్ 2024 అర్హత తప్పనిసరి.

- బీటీహెచ్ నిబంధనల ప్రకారం ఇంటర్ ఆంగ్ల మాధ్యమంలో చదవని వారు టోఫెల్/ఐఈఎల్‌టీఎస్ అర్హత పొందాల్సి ఉంటుంది. టోఫెల్‌లో 575/90 స్కోర్; ఐఈఎల్‌టీఎస్‌లో ప్రతి సెక్షన్‌లో కనీసం 5.5 స్కోర్‌తోపాటు మొత్తమ్మీద కనీసం 6.5 స్కోర్ రావాలి.
- యూఎన్ఐ నిబంధనల ప్రకారం ఐఈఎల్‌టీఎస్‌లో 6.0 లేదా టోఫెల్‌లో 79 స్కోర్ ఉండాలి. మాస్టర్స్ ప్రోగ్రామ్‌లో చేరాలంటే బీఎస్ డిగ్రీలో కనీసం 3.0 క్యుములేటివ్ గ్రేడ్ పాయింట్ ఉండాలి. మూడు రికమండేషన్ లెటర్లు, పర్సనల్ స్టేట్‌మెంట్ సబ్మిట్ చేయాలి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **చిరునామా:** డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్, జేఎన్‌టీయూకే, కాకినాడ - 533003
- **వెబ్‌సైట్:** www.jntuk.edu.in

SCHOLARSHIP ALERT

Tata Capital Pankh Scholarship Program

Description: An initiative of Tata Capital Limited aimed at providing financial support to students belonging to economically weaker sections of society to help them fulfill their academic dreams.

Eligibility: Indian students who are currently studying in Classes 11, 12 general graduation (B.Com., B.Sc., B.A., etc.), diploma and ITI courses at recognised institutions are eligible. Applicants must have scored at least 60% marks in the preceding class. The annual family income of the applicants from all sources must be less than or equal to INR 2.5 lakh.

Prizes & Rewards: Up to an amount ranging from INR 10,000 to INR 12,000 or 80% of course fees (whichever is less)

Last Date to Apply: 15-09-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/TCPS27

Kotak Life Insurance Scholarship Program



Description: An initiative by Kotak Life Insurance Company Ltd. to provide financial assistance to students from Tamil Nadu and Maharashtra to help them pursue their undergraduate studies in the commerce stream.

Eligibility:

- Open to students who are residents of Tamil Nadu and Maharashtra.
- Applicants must be enrolled in the first year of a B.Com. program at any of the eight specified colleges in Tamil Nadu and Maharashtra. The list of colleges is given below:
- A. Veeriya Memorial Sri Pushpam College (Thanjavur, Tamil Nadu)
- Nadar Mahajana Sangam S. Vellaichamy Nadar College (Madurai, Tamil Nadu)
- Edayathangudy G.S. Pillay Arts and Science College (Nagapattinam, Tamil Nadu)
- Jai Hind Sindhu Education Trust's Manghanmal Udharam College of Commerce (Pune, Maharashtra)
- Gokhale Education Society's B.Y.K. (Sinnar) College of Commerce (Nashik, Maharashtra)
- LRD and SRP College for Women (Nagpur, Maharashtra)
- Vysya Arts and Science College (Salem, Tamil Nadu)
- Dharmapuram Adhinam Arts College (Mayiladuthurai, Tamil Nadu)
- Applicants must have scored 65% marks or more in Classes 10 and 12.
- Applicants must have passed Class 12 in the year 2023-24.
- The applicant's annual family income must be INR 3,60,000 or less.

Prizes & Rewards: Up to INR 30,000 per year

Last Date to Apply: 31-07-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/KLISP2

HOPE Engineering Scholarship by Schaeffler India

Description: Schaeffler India invites applications from first-year engineering female students (preference will be given to students with physical disabilities) to provide them with financial support for their engineering studies.

Eligibility: The scholarship is open to female students and preference will be given to students with physical disabilities. The applicants must have scored more than 60% marks in Class 12 (science) in the academic year 2023-24. They must be enrolled in the first year of an engineering program at any recognized college in India. The annual family income of the applicants should be less than INR 5 lakh.

Prizes & Rewards: Scholarship of INR 50,000

Last Date to Apply: 30-07-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/SIHE15

buddy4study.com

లిటిల్స్

స్నేహితుల వేట

ఒక అడవిలో సింహం పులి, కలిసిమెలిసి ఉండేవి. ఒక వేసవిలో వాటికి వారం రోజులపాటు ఆహారం దొరకలేదు. అవి రెండు ఆకలితో నకనకలాడిపోయాయి. ఆ సమయంలో వాటికి ఒక జింక కనిపించింది. అపుడు సింహం పులితో.. మిత్రమా మనిద్దరం ఎవరికి వారే వేటాడితే జంతువులు చిక్కకుండా పారిపోతున్నాయి. కాబట్టి ఈసారి ఇద్దరం కలిసి ఒకేసారి చెరువు వైపు నుంచి దాడి చేద్దాం అన్నది పులి. ఆ మాటలకు సరైన అంది రెండు కలిసికట్టుగా వేటాడటంతో జింక సులువుగా దొరికిపోయింది. కానీ సింహం కలిసి వేటాడాలి అన్న ఆలోచన వచ్చింది నాకే మొదట కాబట్టి ఈ జింకను నేను తింటాను



అన్నది. జింక మీద వేగంగా మొదట దెబ్బ వేసింది నేను కాబట్టి జింకను నేనే తింటాను అన్నది పులి. ఈ రెండింటి గొడవను చెట్టు చాటు నుంచి ఒక నక్క చూస్తూ ఉంది అసలే ఆకలితో అలసిపోయి ఉండి బలహీనపడ్డ ఆ రెండు జంతువులు ఎక్కువసేపు కొట్లాడుకోలేవని అర్థమైన నక్క సింహం పులి కాసేపు గొడవపడి కూలబడగానే చాటుక్కున చెట్టు చాటు నుంచి వచ్చి జింకను లాక్కుని వెళ్లిపోయింది. అట్లా నక్క జింకను తీసుకుని వెళ్ళిపోగానే సింహం, పులి అనవసరంగా స్నేహితులమై ఉండి కూడా గొడవపడి చేతికి అందిన ఆహారాన్ని చేజార్చుకున్నామే అని బాధపడ్డాయి. ఇకమీదట కలిసికట్టుగానే పంచుకోవాలి అని నిర్ణయించుకున్నాయవి.


జత లేని బొమ్మ ఏది?



10 తేడాలు గుర్తించండి!



దారి కనుక్కోండి





డైలీ సుడోకు - 342

3		8	7	6				
2			3					
	7	6		4	2			
	2	3		7		6		
8								9
		7		8		2	5	
			4	3		8	2	
					9			4
				2	7	3		6

సుడోకు - 341 సమాధానం

7	2	3	5	9	4	6	1	8
8	9	1	2	6	7	3	4	5
6	4	5	8	1	3	7	9	2
1	7	8	4	3	2	9	5	6
5	3	2	9	7	6	4	8	1
4	6	9	1	5	8	2	7	3
2	1	4	6	8	9	5	3	7
9	5	7	3	2	1	8	6	4
3	8	6	7	4	5	1	2	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.